
ఎడ్మంటన్ తెలుగు సాహిత్య సంచిక
Telugu Cultural Association of Edmonton
తెలుగు సాంస్కృతిక సంఘము
1969
వాణి 2026

## Table of Contents


| Content | Page |
|---|---|
| TCAE Executives (2025-2026) | 2 |
| TCAE Executive Team Message | 4 |
| ముందు మాట | 5 |
| పంచభూత స్థల పద్య మాల | 6 |
| జీవిత సత్యాలు | 7 |
| ఎడ్మంటన్ సాహితీ మిత్రులు | 8 |
| Art by -Lakshmi Pravallika | 10 |
| సత్యమేవ జయతే! | 11 |
| ఓ మనిషి... | 14 |
| పుస్తకం | 14 |
| పండు !! | 16 |
| అర్ధరాత్రి అడుగులు | 17 |
| మంత్రం, మతం, మానవత్వం | 20 |
| మా ఇంటి బొమ్మలకొలువు | 26 |
| గోదావరి గట్టు | 27 |
| మన సంప్రదాయమే మనకు ఊపిరి | 28 |
| కాఫీ కబుర్లు - జూ గజం | 31 |
| స్వేచ్ఛ వైపు సాగిన ఆ ఇద్దరు | 32 |
| పరుగులు-బంతులు | 35 |
| వలపు గీతి | 37 |
| 20 వసంతాలు పూర్తి చేసుకున్న మన ఎడ్మంటన్ 'తెలుగు బడి' !! | 40 |
| ది ఆర్టిస్ట్ | 43 |
| ఋతురాగం | 45 |
| మహా శివుని సంసారం కకావికలు అయ్యింది | 48 |
| ముహూర్త బలం | 50 |
| సూట్కేస్ మాయాజాలం | 54 |
| మానవ సంబంధాలపై కృత్రిమ మేధస్సు ప్రభావము | 56 |
| కాఫీ కబుర్లు – ఇంకంక్లూసివ్ | 60 |
| వికాసం | 61 |
| Members of the Telugu community with a "Year of Excellence" | 64 |
| బాలవాణి | 65 |
| గరుడ సాహసం | 65 |
| పిల్లలు చెప్పిన బొమ్మకు కథ-అద్భుతాల మర్రి చెట్టు | 66 |
| పిల్లలు చెప్పిన బొమ్మకు కథ-ఇల్లు చాల నిశ్శబ్దంగా ఉంది | 66 |
| పిల్లలు చెప్పిన బొమ్మకు కథ-జంతువుల పాఠశాల(ఆషిత గూడూరు) | 67 |
| పిల్లలు చెప్పిన బొమ్మకు కథ-జంతువుల పాఠశాల(కావ్య కాంటేటి) | 68 |
| పిల్లలకి క్విజ్ | 69 |
| మన గడుగ్గాయుల వేసిన బొమ్మలు | 70 |
| కృతజ్ఞతలు | 75 |

# Telugu Cultural Association of Edmonton Executives (2025-26)



**Pavan Sreekanth Chandana**

President

ఎడ్మంటన్ తెలుగు సాంస్కృతిక సంఘానికి ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన కాలం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైనది, సార్థకమైనది.ఈ ప్రయాణంలో నాకు లభించిన అత్యంత పెద్ద ఆనందం - సేవా దృక్పథం, సామాజిక సమన్వయం మరియు సాంస్కృతిక ఉల్లాసం అనే విలువలను ముందుంచి ఎడ్మంటన్ నగరంలో నివసిస్తున్న అన్ని తరాల తెలుగు కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకురావడం.విద్యార్థులు, యువత, వృత్తి నిపుణులు, కుటుంబాలు, పెద్దలు ఇలా వివిధ వృత్తులు మరియు జీవన ప్రయాణాల్లో ఉన్న తెలుగు వారందరితో కలిసి పనిచేయడం నాకు గర్వకారణం.మన సంఘం ద్వారా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పండుగల వేడుకలు, సామాజిక కార్యక్రమాలు మరియు సేవా కార్యక్రమాలు మనందరినీ మరింత దగ్గర చేసాయి. ఈ కార్యక్రమాలు విజయవంతం కావడానికి కారణం సభ్యులందరి సహకారం, వాలంటీర్ల అంకితభావం మరియు కార్యవర్గ సభ్యుల సమిష్టి కృషి.ఈ కాలంలో నాకు తోడుగా నిలిచిన కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు, స్పాన్సర్లు మరియు ప్రతి కార్యక్రమానికి ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మనం కలసి చేసిన ఈ ప్రయాణం ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించింది.

సంఘం తరఫున లభించిన ప్రోత్సాహం, గుర్తింపు మరియు సభ్యుల ప్రేమ నాకు ఎంతో ప్రేరణనిచ్చాయి. మన ఎడ్మంటన్ తెలుగు సమాజం మరింత అభివృద్ధి చెంది, ఐక్యతతో ముందుకు సాగాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.



**Satya Aditya Chebolu**

Literary Representative

ఎడ్మంటన్ తెలుగు సాంస్కృతిక సంఘం (TCAE)లో సాహిత్య కార్యదర్శిగా సేవలు అందించే అవకాశం రావడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ బాధ్యతను స్వీకరించిన తర్వాత మన అసోసియేషన్‌లో 'సాహితీ సభలను' క్రమం తప్పకుండా తిరిగి ప్రారంభించడంలో నా వొంతు బాధ్యత నిర్వహించడం నాకు అత్యంత తృప్తినిచ్చిన విషయం. ఇది మన భాషా పటిమను, సంస్కృతిని నేటి తరానికి అందించే ఒక అద్భుతమైన వేదికగా నిలిచింది. అలాగే, ఎడ్మంటన్ తెలుగు వారి విభిన్నమైన సాహిత్యం, కళలు మరియు కథలతో కూడిన 'వాణి' ప్రచురణ, నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. తోటి కార్యవర్గ సభ్యులతో కలిసి ప్రతి పండుగను ఎంతో ఉత్సాహంగా, విజయవంతంగా నిర్వహించడం ఒక మధురమైన అనుభవం. సమిష్టి కృషితో పండుగలను వైభవంగా జరపడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

ఎడ్మంటన్‌లోని తెలుగు వారందరితో కలిసి, వారి సూచనలు మరియు సలహాలను స్వీకరిస్తూ మన సంఘాన్ని ముందుకు నడిపించడం ఒక బాధ్యతగా కాక, ఒక అనురాగ బంధంగా మారింది. తెలుగు భాషా సంస్కృతుల పట్ల నాకున్న ప్రేమను, ఈ పదవి ద్వారా అందరితో పంచుకునే అవకాశం రావడం నా అదృష్టం.



**Akhilesh Munipally**

**Treasurer/Joint Secretary**

మన తెలుగు సాంస్కృతిక సంఘానికి సంయుక్త కార్యదర్శి మరియు ట్రేసర్ గ సేవ చేయడం నేను గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నా బాధ్యతలను నిజాయితీ, అంకితభావం మరియు పారదర్శకతతో నిర్వహించడం నాకు ఎంతో ఆనందం మరియు సంతృప్తిని కలిగించింది. ఈ సంవత్సరంలో మన సంఘం గుర్తింపు మరింత పెరగడానికి నేను నా వంతు కృషి చేశాను. ఆల్బర్టా శాసనసభ స్పీకర్(The Honourable Ric McIver) గారి నుండి మన సంఘానికి లభించిన గుర్తింపు తెలుగు సమాజానికి ఒక ప్రత్యేకమైన గౌరవంగా నిలిచింది. అలాగే మన దీపావళి వేడుకలకు ఎమ్మెల్యేలను ఆహ్వానించడం ద్వారా ప్రభుత్వ ప్రతినిధులతో మన సంఘానికి మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా సహకరించాను.

అదే విధంగా, ఎడ్మంటన్‌లోని Council of Indian Societies of Edmonton తో కూడా స్నేహపూర్వక సంబంధాలను మరింత బలపరచడానికి నా వంతు పాత్ర పోషించాను. ఈ సహకారం ద్వారా మన సంఘం మరింత సమైక్యంగా, బలంగా ముందుకు సాగుతుందని నమ్ముతున్నాను. TCA సభ్యులు, వాలంటీర్లు మరియు స్పాన్సర్ల నిరంతర సహకారం పట్ల నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మనందరం కలిసి సంస్కృతిని పరిరక్షిస్తూ, మన సమాజాన్ని మరింత బలంగా నిర్మించుకుంటూ ముందుకు సాగుదాం.



**Sri Satya Bolem**

Library Representative

నా TCA ఎగ్జిక్యూటివ్ సభ్యత్వ ప్రయాణంతెలుగు కల్చరల్ అసోసియేషన్ (TCA) ఎడ్మంటన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ లో సభ్యుడిగా సేవ చేయడం చాలా ఆనందకరమైన మరియు గౌరవప్రదమైన అనుభవం. ఈ అవకాశాన్ని ఇచ్చి మా కమ్యూనిటీకోసం సేవ చేయడానికి అవకాశం కల్పించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను.ఈ ప్రయాణం లో భాగంగా నేను అద్భుతమైన టీమ్ సభ్యులతో కలిసి పనిచేసే భాగ్యం కలిగింది. వారి ఉత్సాహం, అంకితభావం, మరియు కొత్త ఆలోచనలు నన్నెప్పుడూ ప్రేరేపించాయి. మన తెలుగు సంస్కృతిని సంతోషంగా జరుపుకున్నాము.ప్రణాళికలు, ఈవెంట్ నిర్వహణ, స్పాన్సర్‌షిప్ ప్రయత్నాలు, మరియు టీమ్ మార్పులలో దిశానిర్దేశం వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడానికి అవకాశం లభించడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రతీ అడుగు టీమ్ వర్క్ ద్వారానే సాధ్యమైంది, మరియు ప్రతి ఒక్కరి కృషి ద్వారా నేనెంతో నేర్చుకున్నాను. ఇది నేర్చుకోవడం, నవ్వులు, మరియు మమకారంతో నిండిన ప్రయాణంగా ఎప్పటికీ గుర్తుగా నిలుస్తుంది.నేను ఇకపై కూడా ఒక గర్వించదగిన TCA సభ్యుడిగా సహకరించడం కొనసాగిస్తాను. నా పట్ల చూపిన నమ్మకం, ప్రోత్సాహం మరియు మద్దతుకు ప్రతి సభ్యునికి హృదయపూర్వక ధన్యవాదాలు.మనమందరం కలిసి మన తెలుగు కమ్యూనిటీని ఎడ్మంటన్ నగరంలో మరింత బలంగా, సంతోషంగా, ఐక్యంగా ముందుకు తీసుకెళ్దాం.

## TCAE Term Report: Major Milestones of 2025–2026

**Digital Transformation and Strategic Connectivity**
A cornerstone of this term was the comprehensive overhaul of the Telugu Cultural Association of Edmonton's (TCAE) digital infrastructure. The Executive Team successfully modernized the official website, transforming it into a dynamic central hub for event registrations and community resources. To ensure transparency, communication channels across WhatsApp, Facebook, and Instagram were reorganized. This structural change facilitated real-time updates and fostered a more connected digital ecosystem for the Telugu diaspora in Edmonton.

**Community Engagement and Niche Platforms**
To address the diverse needs of our membership, dedicated platforms were established, including Sahiti Sabha, the Youth Group, and Volunteer Coordination Teams. By creating tailored spaces for ladies, men, and business professionals, the association saw a significant uptick in participation. These platforms created micro-communities where families and newcomers could find specific support and fellowship, significantly increasing the visibility of the Telugu community in the Greater Edmonton Area.

**Cultural and Spiritual Highlights**
The 2025–2026 calendar was defined by high-impact events celebrating our heritage. The Summer Picnic in July 2025 served as a joyful reunion, while the Sri Venkateswara Swamy Kalyanam in August drew over 3,000 devotees. A key cultural highlight was the **Ganesh Chaturthi eco-friendly idol-making workshop**. This hands-on event taught children the importance of sustainability while fostering a deep connection to traditional rituals, allowing them to craft their own clay idols to take home for the festival.

**Youth Empowerment and Educational Workshops**
Focusing on the next generation, we partnered with our sponsors to provide valuable life skills. A standout initiative was the **ICICI Bank Kids Workshop**, which introduced our youth to the basics of financial literacy in an engaging, age-appropriate environment. Combined with the Youth Hiking Event, these programs emphasized TCAE's commitment to balanced development, blending cultural roots with practical skills for success in a modern Canadian context.

**Sahiti Sabhalu and Seasonal Festivals**
The revival of Sahiti Sabha emerged as a vital pillar, celebrating the Telugu language through poetry and storytelling. Festive unity continued with October's Diwali celebrations, attended by local provincial leadership, followed by Sankranti and a grand Ugadi celebration in March 2026. These events showcased traditional music, dance, and the symbolic Ugadi Pachadi, embodying the spirit of hope and renewal for the Telugu New Year.

**Provincial Recognition and Leadership**
TCAE's commitment to service received formal appreciation from the Government of Alberta and the Council of India Societies of Edmonton (CISE), solidifying our standing as an influential community partner. Our leadership remains committed to building a transparent, structured organization that mentors future generations and represents our community with pride on provincial platforms.

**Recognition of Support and Gratitude**
The success of these initiatives was made possible through the generous contributions of our community members. We extend a special thank you to our

**Premium Sponsors:** **Chandan Shri Varaday** (Sundine Produce Inc), **Kavita Rao** (ICICI Bank Canada), **Saisanshay Kalakonda** (Bahubali Indian Cuisine), and **Raj Kunduru** (Pharma Save / Stack Services Ltd), whose significant support anchored our major programs. Also, we would like to thank **Praveen Baradi** for sponsoring the **వాణి** magazine.

We also gratefully acknowledge the vital support of our **Gold Sponsor**, **Jyothsna Ansari** (ATB), and our **Silver Sponsors**: **Sahil Mutreja** (Scotiabank), **Ashok Mani** (Logic Realty), and **Bhaskar Sagiraju** (Tax Tribe).

Furthermore, we thank our **Bronze Sponsors** for their dedicated support: **Sri Jyothi Chebolu** (Shri Ethnicity), **Tony** (YEG Movers Ltd), **Sudhin K Raj** (Grandline Enterprises Ltd), **Sunil Reddy Etikela** (eXp Realty), **Sainiranjan Gajula** (Venus Realty), **Alekhya Yanampally** (Skyline IT Services Ltd), **Gopi Krishna Bollimuntha** (Initia Real Estate), **Spandana Metuku** (Mortgage Architects), **Miguel Martínez** (Primetime Signs Ltd), and **Dinesh Reddy Nallamadhi** (Reddy Properties Ltd).

*"Mana Samskruthe Mana Gauravam – Mana Iykyathe Mana Bhavithavyam."* (Our culture is our pride, and our unity is our future.)

**TCAE Executive Team**

# ముందు మాట

**-మాచిరాజు సావిత్రి**

1970 లో మొదలు పెట్టిన ఈ వాణి పత్రిక ఇంకా పలుకుతూ, మన సభ్యుల రచనా పటిమా, చిత్రకళా నైపుణ్యమూ, మన కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఉత్సాహమూ ప్రతిబింబిస్తూ, మనందరికీ ఆనందం పంచడానికి మీ ముందుకు వచ్చింది. మధ్యలో కొన్నేళ్ళు కేవలం అంతర్జాల పత్రికగా మారినా, ఇప్పుడు మళ్ళీ అంతర్జాలంలోనూ, ప్రింటులోనూ కూడా రావడం ఆనందదాయకం.

కథలూ, కవితలూ, కబుర్లూ, వ్యాసాలేకాక చిత్రకళలో కూడా మనవారు ఎవరికీ తీసిపోరని నిరూపిస్తున్నారు. ఈ సంచికలో మన సాహితీ సభల గురించిన వ్యాసంలో సంవత్సరమంతా జరిగే సాహితీ సంబరాల గురించి తెలుసుకోవచ్చు. ఇంకో విశేషమేమిటంటే, ఇక్కడ ప్రచురింపబడ్డ కథలు ఇంచుమించు అన్నీ మన వివిధ సాహితీ సభల్లో సమర్పింపబడినవే.

మన ముందు తరం వాళ్ళు కూడా మన సాహిత్యంలో ఆసక్తీ, అభిమానం పెంచుకుంటున్నారనేందుకు నిదర్శనంగా, మన బాల రచయితల కథలు కూడా ఇక్కడ ప్రచురింపబడ్డాయి. వారి శ్రమా, శక్తీ గుర్తించేందుకని మొట్టమొదటి సారిగా, "బాల వాణి" అనే విభాగం వారికి కేటాయింపబడింది. ఈ సంవత్సరం ఇంకొక కొత్త ప్రయోగం కూడా చేస్తున్నాము. మన సంఘానికీ, వాణికీ కూడా వ్యవస్థాపక సభ్యురాలు అయిన శ్రీమతి మతుకుమల్లి సుశీలా సుబ్బారావు పేరుమీద ఒక బహుమానం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిసంవత్సరం వాణిలో ప్రచురింపబడ్డ ఉత్తమ రచనకి ఈ బహుమతి ఇవ్వబడుతుంది. విజేత పేరు ఉగాది కార్యక్రమంలో ప్రకటింపబడుతుంది.

## పంచభూత స్థల పద్య మాల.
## - హైమ యద్దనపూడి

పంచభూతేశ్వరుడగు పరమ శివుడు, ఒక్కొక్క పంచభూత తత్వమునొంది పవిత్ర భారత దేశములో వెలసిన అయిదు పుణ్య క్షేత్రములను, పంచభూత స్థలములు అని అంటారు. ఆ స్థలములు అందులో వెలసిన లింగ తత్వాలు ఇలా ఉన్నాయి.

కాంచీ పురము - పృథ్వీ లింగము
జంబుకేశ్వరము - జల లింగము
అరుణాచలము - అగ్ని లింగము
శ్రీకాళహస్తి - వాయు లింగము
చిదంబరము - ఆకాశ లింగము

ఆ మహిమాన్విత పంచభూత స్థల లింగముల మీద రాసిన పద్యాలు ఇవి.

**కాంచీ క్షేత్రము - పృథ్వీ లింగము**
**-- పద్య జాతి -- మధురగతి రగడ**

పార్వతి నిర్మిత పార్థివ లింగం
గర్వితర రాక్షస ఘాతక లింగం
సంచిత పాతక ఖండిత లింగం
కాంచనమయ యేకాంబర లింగం
గుంజిత నూపుర మండిత లింగం

కాంచీ పురములోని ఏకామ్రేశ్వర లింగాన్ని పార్వతీ దేవి ఇసుకతోటి తన స్వహస్తాలతోటి చేసినది. అది రాక్షసుల గర్వాన్ని అణచేది, పాపములను నాశనము చేసేది, మరియు బంగారం వలె విలువైనది మరియు ఘల్లున మ్రోగే గజ్జెల తోటి ప్రకాశించేది అని దీని భావము.

**జంబుకేశ్వర క్షేత్రము - జల లింగము**
**-- పద్య జాతి -- కందము**

తాపత్రయముల నార్పుచు
నాపేశుడవై ఇడతివె నాగ చెలదికిన్
ప్రాపున్? సరి! మరి నాకును
నీపద బగితిని యొసగుము నీలగళేశా

ఆప = జలము, ఈశ = శివుడు/లింగము, చెలది = సాలెపురుగు, నాగ = ఏనుగు, బగితి = భక్తి

జంబుకేశ్వర క్షేత్రములో పరమశివుడు జల భావమును పొంది యుంటాడు. అందుకని ఆయనను ఆపలింగేశ్వరుడు, అప్పులింగేశ్వరుడు అని అంటారు. ఆ ఆపలింగ శివుని చల్లదనము తాపత్రయముల నార్పుతుంది అని, శ్రీకాళహస్తి వలెను ఒక గజమునకు, సాలెపురుగుకు శివ భక్తిలో పోటీ పెరిగి ఒకటిని మరి యొకటి అంతము చేసుకోగా వాటికి మోక్షమును ఇచ్చావు కదా, మరి నాకు కూడా నీ పద భక్తిని ఇవ్వవయ్యా నీలకంఠా అని భావము

**అరుణాచల క్షేత్రము - అగ్ని లింగము ---**
**-- పద్య జాతి -- ఆటవెలది**

అగ్నితత్వ మొంది యరుణాచలము నందు
నంబ తోడ వెలసి నాదిమూర్తి
నామ స్ఫురణ మొసగి రమణుని గాచిన
పరమ శివుని దివ్య పదము కొలుతు

అరుణాచములో అగ్ని తత్వము పొంది, అమ్మవారి తోడ వెలసిన ఆది మూర్తి, రమణ మహర్షికి అరుణాచలము అనే తన క్షేత్ర నామ స్ఫురణ చేత బ్రహ్మ జ్ఞానాన్ని ఇచ్చిన ఆ పరమశివుడి దివ్య పాదమును సేవించెదనని భావము

**శ్రీకాళహస్తి - వాయు లింగము**
**-- పద్య జాతి -- ఆటవెలది**

వాయులింగ రూప వాగురిక వరద
కలుషపాప హరణ కాల కాల
స్వర్ణముఖి సుసలిల చందనాభరణ శ్రీ
కాళహస్తినిలయ కావు మమ్ము

వాగురిక = వేటగాడు
స్వర్ణముఖి సుసలిల చందనాభరణ = స్వర్ణముఖీ (సువర్ణ ముఖీ) నది పవిత్ర జలములు అనే చల్లని చందనముల తోటి అభిషేకింపడే వాడు, కాల కాల = యముడికి యముడైన వాడు

తిన్నడిని బ్రోచిన వాడు, మలిన పాపాలను తీసివేసే వాడు, సువర్ణ ముఖీ నది పవిత్ర జలములు అనే చల్లని చందనముల తోటి అభిషేకింపడే వాడు, యముడికి యముడైన వాడు అయిన శ్రీకాళహస్తీశ్వరా మమ్ము కాపాడు స్వామి అని భావము

**చిదంబర క్షేత్రము - ఆకాశ లింగము**
**-- పద్య జాతి -- ఆటవెలది**

ఆది తుదలు లేని యాకాశరూపుడు
నిచ్చకాల మందు నిలయు రేడు
కరుణ నేలెడి శివగామీ సతి విభుడు
చింత దీర్చునట్టి శివుడు వాడు

చిదంబరంలో స్వామి ఆకాశ తత్త్వాన్ని పొంది ఉంటాడు. అది జడాకాశము కాదు, చైతన్యము కూడిన చిదాకాశము. కనుక అక్కడ గర్భగుడిలో తెర వెనుక భౌతిక లింగము ఉండదు కేవలము సూన్యము ఉంటుంది. అంతటా వ్యాపించిన చిదాకాశ స్వరూపుడైన శివుడు మనలోనే ఉన్నాడని, అతడు నిత్యుడు అని తెలుసుకోవడమే చిదంబర రహస్యము. అక్కడి అమ్మవారి పేరు శివకామి/ శివగామి దేవి.

## జీవిత సత్యాలు

**- వెలగపూడి పద్మజ (రాణి)**

1)గెలుపు అంటే అనుకున్నది సాధించటం కాదు, సాధించిన దానిని నిలబెట్టుకోవటం. అదొక నిరంతర ప్రయాణం. గెలుపు అనేది పాదరసం లాంటిది, సరిగా పట్టుకోకపోతే వేళ్ళ మధ్యలో నుంచి జారిపోతుంది. ప్రయత్నం చేసేవాడు గెలుస్తాడు లేదా ఓడిపోతాడు, కానీ ప్రయత్నం చేయనివాడు తప్పకుండా ఓడిపోతాడు.

2)సమస్య అనేది నీరు వంటిది, నీటికి ఒక ఆకృతి లేదు, అలాగే సమస్యకి కూడా. ఒక సమస్య పెద్దదా, చిన్నదా అనేది చూసే మనిషి దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది. సమస్య తీవ్రతను తగ్గించాలంటే ఒకే ఒక్క మార్గం.. ఏదో ఒక పని కల్పించుకోవటం. పనిలో పడితే అన్ని మర్చిపోతావు.

3)కళ్ళద్దాలు ఏ రంగులో వుంటాయో ఆ రంగు తోనే అన్ని వస్తువులూ కనపడతాయి. అలాగే మన ఆలోచనలకు ఏ రంగు పులిమితే అదే రంగు తో జీవితం కనపడుతుంది. ఊహ కు వాస్తవానికి చాలా తేడా వుంది. అది తెలిసిన మనిషి జీవితం ఆనందమయం.

4)చిన్న విత్తనం నుంచి పుట్టిన మొక్క మహా వృక్షం అవుతుంది. చిన్న జలపాతం, మహానదిగా మారి భూమి పై పరుగులు తీస్తుంది. చిన్న చినుకులు కుంభవృష్టిగా మారి నేలను తడుపుతుంది.

5)ఈ ప్రపంచంలో అన్నీ చిన్నగానే ప్రారంభమయి ఆ తర్వాతే అద్భుతాలుగా మారతాయి. నువ్వు వేసే ఒక చిన్న మొదటి అడుగు కూడా నీ విజయాలకు సాక్ష్యంగా నిలుస్తుంది..!

6)శ్రద్ధగా వినేవారే చక్కగా మాట్లాడగలరు, మంచిగా ఆలోచించేవారే సుఖంగా మనగలరు.

7)గర్వం కన్నా గౌరవం గొప్పది. సంపద కన్నా సంస్కారం గొప్పది. హోదా కన్నా మానవతాగుణం గొప్పది. అహంకారం కన్నా ఆప్యాయత గొప్పది.

ప్రేమను పంచితేనే ప్రేమను పొందగలరు.
**సర్వేజనా సుఖినోభవంతు!!**

## ఎడ్మంటన్ సాహితీ మిత్రులు

**-మాచిరాజు సావిత్రి**

కొన్నేళ్ళ కిందట ఉత్సాహవంతంగా జరిగిన మన సాహితీ సభలు కోవిడ్ మూలాన కొంచెం కుంటు పడి చివరికి కొన్నాళ్ళు పూర్తిగా ఆగిపోయాయి. అయితే, అక్టోబర్, 2024 లో మళ్ళీ మొదలయ్యాయి. అప్పటినుంచీ క్రమం తప్పకుండా మూడు నెలలకొకసారి జరుగుతున్నాయి. అక్టోబర్, జనవరి, ఏప్రిల్, జులై నెలల మొదటి భాగాల్లో జరుగుతాయి. అయితే ముందు జరిగిన సాహితీ చర్చల్లో గతం లోని రచయితలగురించీ, వారి రచనలు గురించీ, మన సభ్యులు ప్రసంగాలు ఇచ్చే వారు. ఇప్పుడు అలా కాకుండా, ఈ సభలు మన వర్తమాన, భావి సాహిత్యాల మీద అంటే ఇప్పుడు రాస్తున్న, ఇక ముందు రాబోయే రచయితల మీదా, వారి రచనలమీదా కేంద్రీకరించబడుతున్నాయి.

ఈ ధ్యేయాలను సాధించేందుకు, ఈ సభల్లోని ముఖ్యాంశాలు:

- స్వీయ రచనా పఠనం,
- బాలల రచనలకు ప్రోత్సాహం
- డయస్పోరా theme మీద రచనలు
- రచన గురించి వర్క్ షాపులు
- కెనడాలోని ఇతర రచయితలూ, వారి రచనల గురించీ తెలుసుకోవడం

ఇప్పటిదాకా జరిగిన సభల్లోని కొన్ని ప్రసంగాలు మచ్చుకి ఇక్కడ ఇస్తున్నాను:

- బతుకమ్మ పాటలు -- ఒక విశ్లేషణ
- మహిమాన్వితమైన మన సంస్కృత తెలుగు భాషలు
- యక్షగాన సాహిత్యం
- త్రిపుర రహస్యం
- నా తెలుగు పద్య రచనా ప్రయాణము

ఇవి కాక మన ఆస్థాన విద్వాంసులవంటి కొందరు రచయితలు చందోబద్ధ పద్యాలూ, గేయాలూ, కథలూ, వ్యాసాలూ, మొదలైన వారి స్వీయ రచనలను అందరితో పంచుకుని ప్రతిసారీ మన ఎడ్మంటన్ రచనా ప్రతిభని చాటుతుంటారు. వారిలో చాలామంది రచనలను ఈ వాణి సంచికలో చూడచ్చు. చిన్న పిల్లలనుంచి సీనియర్ సిటిజెన్స్ దాకా అందరూ ఉత్సాహంగా పాల్గొని ఈ సభలని కళకళలాడిస్తున్నారు. పిల్లలలో రచనా వ్యాసంగం మీద ఆసక్తి కలిగించడం కోసం వీలున్నప్పుడల్లా వాళ్ళని ప్రోత్సాహిస్తున్నాము. ఇంతవరకూ బాలలు రాసిన రచనలు:

- రామాయణంలోని కొన్ని ఘట్టాలను గురించిన కథలు

- సంక్షిప్త మహాభారతం (ఒక్కొక్కరు ఒక్కొక్క పర్వాన్ని గురించి విశ్లేషించడం)

- ఒక బొమ్మని చూసి, వారి ఊహాగానంతో ఒక కథ రాయడం

ఈ ఆఖరి కథలను మనం ఈ సంచికలోని "బాల వాణి" అనే భాగంలో చూడచ్చు.

ఇక కెనడా లోని ఇతర రచయితల గురించి తెలుసుకోవడానికి వస్తే, తెలుగు తల్లి సంస్థ వారి కథాసంకలనాలను ఇక్కడ పరిచయం చేయడం (వీటిలో మన ఎడ్మంటన్ రచయితలు కూడా ఉన్నారు), వాంకూవర్ వ్యాస్తవ్యులైన మణి మల్లవరపు గారి కథా సంకలనాన్ని పరిచయంచేయడం, కాల్గరీ వ్యాస్తవ్యులైన శ్రీనివాస్ పబ్బరాజుగారితో నవలా రచన గురించి ఒక వర్క్ షాప్ నిర్వహించడం ఇంతవరకూ జరిగిన కార్యక్రమాలు.

ఇవన్నీ చదువుతూంటే మీక్కూడా పాల్గొనాలనే ఉత్సాహం కలుగుతున్నదా? తప్పక ఏప్రిల్ లో జరిగే సభకు వచ్చి అందరితో మీ సరదాను పంచుకోండి.

చాలామంది "అబ్బే! నేను రాయలేనండీ," అంటారు. కానీ ఈ సభలకి రచయితలే కాదు, పాఠకులూ, శ్రోతలూ కూడా కావాలి కదా! కాబట్టి మీరు రచయిత కానంత మాత్రాన మీకిక్కడ స్థానం లేదని అపోహ పడకండి.

మరొక్క మాట. ఈ సభలు చాలా సార్లు ఎడ్మంటన్ తెలుగు బడి లో జరగడం మూలాన కొంతమంది ఈ సభలు తెలుగు బడి ఆధ్వర్యంలో జరుగుతున్నాయని అపోహ పడుతున్నారు. కానీ ఇవి మన అసోసియేషన్ ఆధ్వర్యంకింద జరుగుతున్నాయి. ముఖ్యంగా, బాలలు పాల్గొనేందుకు వాళ్ళు తెలుగు బడి విధ్యార్థులు అవ్వక్కర్లేదు. ఎడ్మంటన్ లో ఉండే అందరు తెలుగు వారిని ఈ సభలకు ఆహ్వానిస్తున్నాం.

## మొదటి సాహితీ సభ



First Sahiti Sabha Meeting

# చిత్రలేఖనం - లక్ష్మి ప్రవల్లిక



## సత్యమేవ జయతే!

- మాచిరాజు సావిత్రి

అప్పుడే తెలుగు స్కూలు నుంచి ఇంటికి వచ్చిన కొడుకు అజయ్ ని పలకరించాడు మూర్తి, "ఏరా? ఏం నేర్చుకున్నావు ఇవ్వాళ స్కూల్లో?" అని.

అజయ్ ఉత్సాహంగా, "ఇవ్వాళ మేం ఆవు పులి కథ నేర్చుకున్నాం," అని చెప్పాడు.

"ఓ. మంచి కథ. మన సంస్కృతిని ప్రతిబింబించే కథ."

అయోమయంగా చూశాడు అజయ్. "సంస్కృతి అంటే?"

మూర్తి తికమకపడ్డాడు. "సంస్కృతి అంటేనా? సంస్కృతి అంటే -- ఆఁ! కల్చర్! అదీ."

"కల్చర్ అంటే?"

అజయ్ ప్రశ్నకు బుర్రగోక్కున్నాడు మూర్తి. అక్కడే ఉన్న కూతురు అతుల్య అందుకుంది. "కల్చర్ అంటే, మనం ఎలా బ్రతుకుతామో అదన్నమాట." ఈసారి తండ్రీ కొడుకులు ఇద్దరూ కళ్ళప్పగించి చూశారు.

తండ్రికి కూడా తెలియని విషయం తనకు తెలిసినందుకు గర్వమనిపించింది అతుల్యకు. "అంటే మనం తినే తిండి, మాట్లాడే భాష, ఇంకా, మన ఆచారాలు, పండుగలు, ఇవన్నీ కలిపితే మన కల్చర్, అంటే సంస్కృతి అన్నమాట. మేము స్కూల్లో దీని గురించి ఒక ప్రాజెక్ట్ చేశాం."

అప్పుడే హైస్కూల్లో చేరిన కూతురి పాండిత్యానికి మెచ్చుకోలుగా చూశాడు మూర్తి. మళ్ళీ కొడుకు వైపు తిరిగి అడిగాడు, "ఇప్పుడు అర్థమైంది కదా?"

"ఊఁ హుఁ," తల అడ్డంగా తిప్పాడు అజయ్.

"అర్థం కాలేదా? సత్య సంధత అన్నది మన సంస్కృతిలోని గొప్పదనం."

అజయ్ పూర్తిగా అయోమయంలో పడిపోయాడు. "సత్య ... సత్య... ఏమిటి?"

"సత్య సంధత. అంటే, ఎప్పుడూ నిజం చెప్పడం, అన్న మాటకి కట్టుబడి ఉండడం అన్నమాట. చూడు, నీకు రామాయణం తెలుసు కదా? రాముడు ఎందుకు అడవులకి వెళ్ళాడు? తండ్రి మాట నిలబెట్టడానికే గదా? అందుకే, చివరికి గెలిచాడు. అందుకే, మన దేశ motto కూడా 'సత్యమేవ జయతే' అని. అంటే, సత్యమెప్పుడూ గెలుస్తుందని."

ఇంకా తికమకలోనే ఉన్నాడు అజయ్. "ఇప్పుడెవరు గెలిచారు?"

"అరె! ఏమిటి నీ కన్ఫ్యూషన్? ఈ కథలో ఆవు గెలిచింది," అతుల్య విసుగ్గా అందుకొంది.

"కానీ ఆవు ఎవరితోనూ పోట్లాడలేదుగా?" మూర్తి కూతురి సహాయానికొచ్చాడు. "గెలవడం అంటే పోట్లాడాలనే కాదు. తన ప్రాణాలు దక్కించుకుందిగా? అది ఎలా జరిగింది? ముందు ఇంటికి వెళ్ళి దూడకు పాలిచ్చి వస్తానని నిజం చెప్పింది. తర్వాత అన్నట్టే తిరిగి వచ్చింది. ఆ సత్య సంధత చూసే పులి దాన్ని వదిలిపెట్టింది."

సాలోచనగా చూశాడు అజయ్. "అంటే ఆవు కంటే పులే గొప్పదన్నమాట."

"అదేమిటి?" తత్తర పడ్డాడు మూర్తి.

"అవును. పులికి పాపం చాలా ఆకలిగా ఉన్నది కదా? అందుకేగా అది ఆవుని తినాలనుకున్నది? అంత ఆకలిగా ఉన్నా ఆవుని ఇంటికెళ్ళనిచ్చింది. అది గొప్ప పనే కదా? మళ్ళీ ఆవు తిరిగి వచ్చినప్పుడు దానికి ఆకలి ఇంకా ఎక్కువయ్యి ఉంటుంది. కానీ మళ్ళీ పులి ఆవుని వదిలేసింది. అది ఇంకా గొప్ప పని కదా? అందుకే ఆవు కంటే పులే గొప్ప." మూర్తికి ఏమనాలో తోచలేదు. "ఆవు కోసం వెయిట్ చేస్తున్నప్పుడు అది ఇంక వేరే జంతువునేదో తినేసి ఉంటుందిలే," అని గొణిగాడు. కానీ అజయ్ ఒప్పుకోలేదు. "అలా అని కథలో లేదుగా?"

మళ్ళీ అతుల్య కల్పించుకుంది. "అలాగైనా కథలో నీతి మారదు. పులి కూడా తన మాట నిలబెట్టుకున్నదిగా? అందుకే మనమింకా 'సత్యమేవ జయతే' అనొచ్చు."

"శభాష్!" కూతుర్ని మెచ్చుకున్నాడు మూర్తి. "బాగా చెప్పావు." అజయ్ సందేహంగా చూశాడు. "అయితే ఇప్పుడు నీకో పులి ఎదురైతే, అది నిన్ను వదిలేస్తుందా?"

మూర్తి నవ్వాడు. "ఏమో. కెనడా పులుల గురించి నాకు తెలియదు."

"కెనడాలో పులులుండవు, జూల్లో తప్ప, " అని వ్యాఖ్యానించింది అతుల్య. "కాబట్టి ఇక్కడ అడివిలో పులి ఎదురవడమనేది జరగదు."

"పోనీ మనం ఇండియాకి వెళ్ళినప్పుడు నీకో పులి కనిపించిందనుకో. అది నిన్నువదిలేస్తుందా, నువ్వడిగితే?"

"ఏమడుగుతాను? నాకేం దూడల్లేవుగా పాలిచ్చేందుకు?" నవ్వాడు మూర్తి.
"అయితే పులి నిన్ను తినేస్తుందా?" కంగారు పడ్డాడు అజయ్.

"దూడల్లేకపోతే పిల్లలున్నారుగా," అన్నది అతుల్య.

"నిజమే. నేను పులితో అంటానూ, చూడు, నాకు ఇద్దరు పిల్లలున్నారు. వాళ్ళింకా చిన్నవాళ్ళు. వాళ్ళపట్ల నా బాధ్యతలన్నీ తీర్చుకుని వస్తాను. అంటే వాళ్ళ చదువులు పూర్తయ్యి, పెళ్ళిళ్ళు అయ్యాక, అప్పుడు తిరిగి వస్తాను అని చెబుతాను. అంటే ఓ 20, 30 ఏళ్ళ తర్వాత అన్నమాట."

"అంతవరకూ ఆ పులి బతికుంటుందా?"అన్నది అతుల్య.

"బతక్కపోతే మరీ మంచిది. పీడా వదిలిందన్న మాట," నవ్వాడు మూర్తి.

"మరి అలా చెయ్యడం మోసం కాదా?" ఆందోళనగా చూశాడు అజయ్.

"ఏం కాదు. ఇది కలి కాలం. ఈ కాలంలో ఇలాగే నడుచుకోవాలి. దాన్ని లౌక్యం అంటారు."

"మరి ఆ ఆవు అలా ఎందుకు చెప్పలేదు?" అజయ్ సందేహాలకు అంతులేనట్టు ఉన్నది. మూర్తికి విసుగు వచ్చేసింది. "ఏమిట్రా నీ గోల? ఆ ఆవు సత్యకాలపుది కాబట్టి. ఇంక ఆపు నీ చొప్పదంటు ప్రశ్నలు."

అజయ్ నోరు మూసుకున్నాడు కానీ, మనసంతా సందేహాలతో అల్లకల్లోలమయింది. ఆవు సత్యకాలపుది కాబట్టి నిజం చెబితే, ఈ కాలంలో చెప్పక్కర్లేదా? అంటే ఈ కాలంలో సత్యసంధత అక్కరలేదా?

ఇంతలో ఫోను మ్రోగింది.

"అతుల్యా, ఆ ఫోను తీసుకో," అన్నాడు మూర్తి, లేవడానికి బద్ధకం వేసి. అంతలో ఏదో

గుర్తొచ్చినట్టు, "చూడు, అది గోపాలం అంకుల్ అయితే, నేను ఇంట్లో లేనని చెప్పు" అని ఆదేశించాడు.

అజయ్ కళ్ళప్పగించి చూశాడు. ఇది కూడా లౌక్యమేనా?

అతుల్య తిరిగి వచ్చింది. "నువ్వు ఇంట్లో లేవని చెప్పాను. పర్వాలేదు, రేపు పార్టీలో కలుసుకుంటానులే అని పెట్టేశారు," అన్నది.

ఖర్మ! వాళ్ళ ప్రోగ్రాముకి టిక్కెట్లమ్మమని నాకంటగట్టాడు. వీటన్నిటికీ నాకెక్కడ టైమున్నది? సరే ఏదో ఒకటి రేపట్లోగా ఆలోచిస్తాలే," అని లేచాడు.

ఇంతకీ "సత్యమేవ జయతే" అంటే అర్థం ఏమిటో అజయ్ కి ఇంకా బోధపడలేదు.


## తెలుగు పాఠశాల వనభోజనాలు




## Telugu School Picnic

## ఓ మనిషి...

**- అక్షయ శేగు**



**ఓ మనిషి...**

నువ్వు చేతి వేళ్ళతో మీటలు నొక్కుతావు,
ఆ బలం భావాన్ని చేరుస్తుందని నమ్ముతావు,
అది అర్థం చేసుకుంటుందా?

నువ్వు సమాధానం కోసం అనుక్షణం దాని
వెంటపడుతావు,
కానీ క్షణకాలం ఆలస్యానికే నిందిస్తావు,
అది వినగలదా?

నువ్వు దాని నుంచి స్నేహాన్ని, తోడుని కోరుతావు,
కానీ అది సరిపోక విసుక్కుంటావు,
అది విరిగిపోదా?

నువ్వు ప్రశ్న మీద ప్రశ్నలు అడుగుతావు
శ్వాస మధ్య విరామానికి విసుగు పొందుతావు,
అది అలసిపోదా?

నువ్వు మానవత్వాన్ని నాటాలనుకుంటావు,
కానీ అది నివసించే చోట
దానిని గెలిపించడం లో తడబడతావు.

## పుస్తకం

**- మురళి బాబు**

రాతిగుహలో ఓ రేతిరి
నన్నెవరో నిద్దురలేపిరి
ఉలిక్కిపడి చూసాను
ఉలితో తనను

తాటాకు గుడిసెలోనే
ఆటాపాటా
ఎండకు ఎండినా
ముందుకే నడిచినా
సిరావానలో తడుస్తూ
పడవేసుకొని పయనించా

ఖచ్చితంగా చెప్పగలను
అచ్చొచ్చిన కాలమిదని
నచ్చిమెచ్చినదెందరో
నెత్తినెత్తుకున్నదెందరో
ఉచ్ఛస్థితిని కాంచాను
పచ్చని ప్రపంచంలో

తెరలమరల్లోకి తొంగిచూసాను
మరలా వచ్చే వీలు చిక్కక
అక్కడే అమరిపోయాను
మునుపటి స్పర్శలేదు కానీ
ఇంకా స్పృహలోనే ఉన్నాను

# తెలుగు వనభోజనాలు



# TCAE Telugu Picnic

## పండు !!

**- సత్య ఆదిత్య చేబోలు**

ఆ రోజు పండూ రెండవ పుట్టినరోజు. ఆ సందర్భంగా ఇంటికి బంధువులను ఆహ్వానించారు అతని తల్లిదండ్రులు. ఉదయం పెద్దలంతా సత్యనారాయణ పూజలో నిమగ్నమై ఉన్నారు. బుజ్జీ, పండూ, ఇంకా ఇతర పిల్లలు ఇంట్లో దాగుడుమూతలు ఆడుతున్నారు.

పండూ చిన్నవాడైనందున తరచూ బుజ్జీ లేదా పెద్ద పిల్లలతో కలిసి దాక్కుంటున్నాడు.

అప్పుడు రాజు అనే ఒక పిల్లాడు, "ఇంకా పసిపిల్లాడిలా అక్కా, అన్నలతో కలిసి దాక్కుంటున్నావా?" అని ఎగతాళి చేశాడు.

దాంతో కోపం వచ్చిన పండూ, "నేను ఒంటరిగానే దాగుడుమూతలు ఆడతాను! చూడు, నన్నెవరూ పట్టుకోలేరు!" అని గట్టిగా చెప్పాడు.

అప్పుడే అతని తల్లి,"పండూ, ఇలా రా నాన్నా, ప్రసాదం తినాలి. నీకు ఇష్టమైన సత్యనారాయణ స్వామి ప్రసాదం!" అని పిలిచింది.

"అమ్మా, వస్తున్నా!" అంటూ పండూ వెంటనే వెళ్ళి కడుపునిండా ప్రసాదం తిన్నాడు. మళ్ళీ పిల్లల పిలుపు విని ఆడటానికి వెళ్లాడు.

పిల్లలు దాగుడుమూతలు ఆటను మళ్ళీ ప్రారంభించారు. ఒక మూలన బంధువుల కోసం ఉంచిన పెద్ద బొంతలు (బట్టల మూటలు) పండూకి కనిపించాయి.

"ఇక్కడ నన్నెవరూ పట్టుకోలేరు!" అని అనుకుని, వాటిలో ఒక చిన్న రంధ్రం గుండా లోపలికి చేరి దాక్కున్నాడు.

ఎక్కువగా తిన్నందున పండూ కొద్దిసేపటికే గాఢ నిద్రలోకి జారుకున్నాడు. కొంత సమయం గడిచింది. పిల్లలు పండూని వెతకడం ప్రారంభించారు. "పండూ! పండూ! ఎక్కడున్నావు?" అని పలుమార్లు పిలిచారు. కానీ పండూ గాఢ నిద్రలో ఉండటంతో వినిపించలేదు.చివరికి అతన్ని కనిపెట్టలేక పెద్దలకి చెప్పారు.అందరూ ఆందోళన చెందుతూ వెతకడం ప్రారంభించారు. తల్లి కన్నీళ్ళు పెట్టుకుంటూ, "పండూ! పండూ! ఎక్కడున్నావు నాయనా? ఎక్కడికి వెళ్లావు? ఎవరైనా చూశారా?" అంటూ హడావిడిగా పరుగులు తీస్తోంది.

బుజ్జీ,"నాన్నా, బయట వెతకండి. అతను ఆడుతూ బయటికి వెళ్ళి ఉండొచ్చు " అంది. తాతయ్య, అమ్మమ్మలు భయంతో వణికిపోయారు.అమ్మమ్మ చేతులు జోడించి, "హనుమంతుడా! మా పిల్లాడిని క్షేమంగా ఉంచు స్వామీ!" అని ప్రార్థించింది.

ఇప్పటికే నలభై నిమిషాలు గడిచిపోయాయి.తండ్రి పోలీస్ స్టేషన్‌కి వెళ్లాలని అనుకుంటూ, చివరిసారి మరోసారి వెతకడానికి గదిలోకి వెళ్లాడు.అక్కడ బొంతల దగ్గర నేల తడిగా కనిపించింది. అనుమానం వచ్చి బొంతలను విప్పి చూడగా పండూ లోపల నిద్రలో ఉన్నాడు! నిద్రలోనే బొంతను తడిపేశాడు.

ఆనందంతో తండ్రి, "పండూ దొరికాడు! పండూ దొరికాడు!" అని గట్టిగా అరిచాడు.

అందరూ గదిలోకి పరుగెత్తుకుంటూ వచ్చారు. పండూ ఇంకా నిద్ర మత్తులోనే ఉండి, ఏమి జరుగుతోందో అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

తల్లి అతన్ని గట్టిగా కౌగిలించుకుని,"నా బాబూ! ఎక్కడ ఉన్నావు? నన్నెంత భయపెట్టావు!" అంటూ బుగ్గలపై ముద్దులు పెట్టింది.

వెంటనే అతని తడిచిన బట్టలు మార్చింది.అమ్మమ్మ ఉప్పు, ఎండు మిరపకాయలు తీసుకొచ్చి,"ఎవరో దిష్టి పెట్టినట్టుంది. దిష్టి తీయాలి," అంటూ ఉప్పు, మిరపకాయలు తిప్పింది.

బుజ్జీ తమ్ముడిని కౌగిలించుకుని,"ఇంకెప్పుడూ నన్ను వదిలి వేళ్ళకు! నాకు ఎంత భయమేసిందో తెలుసా?" అంది.

రాజు మాత్రం మనసులో,"హమ్మయ్య! వీడు దొరకకపోతే నా పని అయిపోయేది!" అనుకుని, వెంటనే పండూకి ముద్దు ఇచ్చి ఒక చాక్లెట్ అతని చేతిలో పెట్టాడు.

సాయంత్రం తాతయ్య అదనంగా మరో కేక్ తెచ్చారు. పండూ పుట్టినరోజును మళ్ళీ ఆనందంగా జరిపారు.పిల్లలు రెండు కేకులు, సమోసాలు తింటూ, రస్నా తాగుతూ, టామ్ అండ్ జెర్రీ కార్టూన్ చూస్తూ హాయిగా ఎంజాయ్ చేశారు. ఆ రాత్రి తల్లి తన చీర కొంగును పండూ చేతికి కట్టి, అతన్ని ప్రేమగా కౌగిలించుకుని నిద్రించింది. తల్లి ప్రేమకు మించినదేమీ లేదు.



## అర్ధరాత్రి అడుగులు

**-సుష్మ పవన్**

ఉదయం 9 గంటలు..

శ్రీకాంత్ ఆఫీస్ కి వెళ్ళడానికి రెడీ అవుతూ ఉండగా తన భార్య అంజలి వంట గదిలో లంచ్ బాక్స్ సిద్ధం చేస్తోంది. అంతలో ఫోన్ మోగింది. శ్రీకాంత్ సహోద్యోగి భవ్య కాల్ చేసింది.

"హలో" అంటూ అటెండ్ చేసాడు శ్రీకాంత్.

"హాయ్ శ్రీకాంత్ గారు, నేను ఈరోజు నైట్ ఫ్లైట్ కి రిటర్న్ అవుతున్నానండి. నా ఫ్లైట్ 12:30 కి ల్యాండ్ అవుతుంది. నన్ను ఎయిర్పోర్ట్ నుండి మా ఇంటివద్ద డ్రాప్ చేస్తారా?"

"ఖచ్చితంగా వస్తానండి." చెప్పాడు శ్రీకాంత్. భవ్య "థాంక్ యు" అంటూ కాల్ ముగించింది.

టిఫిన్ చేసి శ్రీకాంత్ ఆఫీస్ కి వెళ్ళిపోయాడు. అర్ధరాత్రి 12 గంటలకు గడియారం మోగింది. అంజలి మరియు వారి 10 నెలల కుమారుడు నిహాల్ గాఢ నిద్రలో మునిగిపోయారు. భవ్యను రిసీవ్ చేసుకోవడానికి శ్రీకాంత్ ఇంటి నుండి బయలుదేరాడు. ఎయిర్పోర్ట్ కి వెళ్లే రోడ్డు సామాన్యంగా నిశ్శబ్దంగా ఉంటుంది. ఆ మార్గం లో ఒక పాత స్మశానం ఉంటుంది. రాత్రి వేళ అది మరింత భయానకం. భవ్యను రిసీవ్ చేసుకుని ఆమె ఇంటి వద్ద వదిలి తిరిగి వచ్చేసరికి గడియారం 2 గంటలు చూపించింది.

అతను బెడ్ పై పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

2:45 గంటలు : నిశ్శబ్దాన్ని భగ్నం చేసిన చిన్న ఏడుపు...

నిహాల్ నిద్ర లేచాడు. అంజలి అతడికి పాలిచ్చి మళ్లీ నిద్రపుచ్చడానికి ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు అతడిని తీసుకుని హాల్లోని ఉయ్యాలలో పెట్టి ఆడించడం మొదలు పెట్టింది.

అప్పుడే...

తన వెనుక నుంచి అడుగుల శబ్దం వినిపించింది. శ్రీకాంత్ నిద్రలేచి వచ్చి ఉంటాడు అనుకుంది. అందుకే వెనక్కి తిరిగి చూసే ప్రయత్నం చేయలేదు. కానీ... కొన్ని సెకన్లు గడిచిన ఎవరూ ముందుకు రాలేదు. మెల్లగా వెనక్కి తిరిగింది. అక్కడ ఎవరూ లేరు. ఒక్క క్షణం హృదయం ఝుల్లుమంది."అయితే ఆ అడుగుల శబ్దం ఎవరిదీ?"

నిశ్శబ్దం మరింత భారంగా అనిపించింది. గోడల మధ్య గాలి కూడా ఆగిపోయినట్టు చల్లగా ఉంది. మనసుకు ధైర్యం చెప్పుకుంటూ, "చిన్న పిల్లలకు ఏవైనా కనిపిస్తే, వాళ్ళు రియాక్ట్ అవుతారు. నిహాల్ బాగానే ఉన్నాడు కదా. మనసే భయపడుతోంది." అని అనుకుంది.

అప్పుడే.. నిహాల్ పెదవులపై చిరునవ్వు భయకంపన రేపింది. ఆ నవ్వు అంజలిని చూసి కాదు. అతను ఆమె వెనుక ఒక చోట కనిపించని దేనినో చూస్తూ నవ్వుతున్నాడు. అంజలి శరీరం నిమిషం పాటు స్తంభించింది.

బాబు నవ్వుతున్న చోట... ఎవరూ లేరు. అయితే అతను ఏమి చూసి, ఎవరిని చూసి నవ్వుతున్నాడు? ఊపిరి బిగుసుకుపోయింది. కాళ్ళు, చేతులు వణికాయి. శ్రీకాంత్ ను గట్టిగా పిలవాలని భావించింది. కానీ అతను పూర్తిగా అలసిపోయి నిద్రపోయాడన్న విషయం గుర్తుకు వచ్చింది. మళ్లీ హాల్ నుండి బెడ్ రూమ్ కి వెళ్లాలంటే, అదే దారిలో వెనక్కి తిరగాలి. ఆ ఆలోచనే భయాన్ని రెట్టింపు చేసింది.

ఒక్క క్షణం ధైర్యం, ఆ తర్వాత పరుగు..

అంజలి మనసులో దైవాన్ని ప్రార్థిస్తూ, ఒక్కసారిగా లేచి నిహాల్ ను ఎత్తుకుంది. వెనక్కి చూసే ధైర్యం లేకుండా, హాల్ లో ని నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వేగంగా బెడ్ రూమ్ వైపు పరుగెత్తింది.

శ్రీకాంత్ పక్కన బాబుని పడుకోబెట్టి, తాను కూడా భయాన్ని వదిలి నిద్రలోకి జారుకుంది.

తరువాత ఉదయం...

అంజలి రాత్రి జరిగిందంతా శ్రీకాంత్ కు వివరించింది. అతడు నవ్వుతూ..."అంటే రాత్రి భవ్యతో పాటు ఏదైనా అదనంగా వచ్చిందా?" అని సరదాగా అన్నాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు. రాత్రి భయం ఉదయపు వెలుగులో కరిగిపోయింది.

# యూత్ హైక్ 2025



## Youth Hike 2025 Whitemud Creak Trail

## మంత్రం, మతం, మానవత్వం

- శ్రీనివాస్ రాధాక్రిష్ణ

పొద్దున్నే సంధ్యావందనం చేసుకుని, హాసిని ఇచ్చిన ఫిల్టర్ కాఫీ తాగుతూ, టెర్రస్ మీద నుంచి వస్తున్న సముద్రపు గాలిని ఆస్వాదిస్తూ, సూర్యోదయం కోసం ఎదురుచూస్తూ, ఈజీచెయిర్‌లో రిలాక్స్ అవుతూ *హిందూ* పత్రిక చదువుతున్నాడు బులుసు శివాజీ.

అంతలో ఒక్కసారిగా ల్యాండ్‌లైన్ ఫోన్ మోగింది.ఇన్ని నెలల తర్వాత ఈ ఫోన్ మోగడం ఏమిటబ్బా? ఎవరిదై ఉంటుందో? అనే ఆలోచనతో తొందరగా మధ్యగదిలోకి అడుగులు వేసాడు శివాజీ.

"హలో" అన్నాడు.

"హలో అంకుల్... నా పేరు ఇబ్రహీం సయ్యద్. మా నాన్నగారు ఇర్ఫాన్ సయ్యద్ ఈ రోజు పొద్దున్న నాలుగు గంటలకు హార్ట్ అటాక్‌తో చనిపోయారు. మీ గురించి మాతో చాలా ఎప్పుడూ మాట్లాడేవారు. అందుకే మీకు చెప్పాలని ఫోన్ చేస్తున్నాను..."

అవతల నుంచి ఆ అబ్బాయి మాటలు వినగానే, కొన్ని క్షణాలు నిశ్చేష్టుడైపోయాడు శివాజీ.

"ఎప్పుడు తీసుకెళ్తారు?" అని అడిగాడు కష్టంగా.

"అన్ని కార్యక్రమాలు అయ్యేసరికి సాయంత్రం నాలుగు అవుతుందని అనుకుంటున్నాం అంకుల్."

"సరే... అంతలోపల నేను రావడానికి ప్రయత్నం చేస్తాను" అని అన్న వెంటనే అవతల నుంచి ఫోన్ కట్ అయింది.

శివాజీ వెంటనే హాసినిని చూసి అన్నాడు "హాసిని, మనం కొలకత్తాకు అర్జెంట్‌గా బయల్దేరాలి. మూడు రోజులకి సరిపడా బట్టలు నీకూ నాకూ త్వరగా సర్దు. పదకొండు గంటలకు విశాఖపట్నం నుంచి కొలకత్తాకు ఫ్లైట్‌లో టికెట్లు దొరికాయి." భర్త ముఖంలో ఒక్కసారిగా కనిపించిన బాధ, హడావిడి, ఆందోళన ఇవి చూసి హాసినికి ఏమీ అర్థం కాలేదు."ఇంత సడన్‌గా ఎందుకు వెళ్ళాలి? అసలేం జరిగింది?" అని అడిగింది.

"అన్నీ తర్వాత చెబుతాను" అని చెప్పి మాట దాటవేశాడు శివాజీ. ఒక గంటలోపే భీమిలి ఫామ్‌హౌస్ నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరారు శివాజీ, హాసినిలు. చెక్-ఇన్ అయ్యి, ఇండిగో ఫ్లైట్‌లో కూర్చున్న తర్వాత,ఇప్పుడైనా చెబుతారా అన్నట్టుగా హాసిని చూపు చూసిన శివాజీ, నెమ్మదిగా తన గతాన్ని చెప్పడం మొదలుపెట్టాడు.

********************************

1960లో అంబాజీపేట మండలంలో, దూరంగా విసిరేసినట్టుగా ఉండేది నందనాపురం అగ్రహారం.సుమారు నలభై కుటుంబాలున్న ఆ అగ్రహారంలో, బులుసు వేంకటావధానుల వారి కుటుంబం ఒకటి. పొద్దున్నే వారి ఇంట్లో వినిపించే వేదఘోషతో అగ్రహారం మేలుకొనేది. ప్రతి గడప నుంచీ ఎవరో ఒకరు వారి గాయత్రి వేద పాఠశాలలో తర్ఫీదు పొందేవారు.

ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. మూడో కుమారుడు పుట్టినప్పుడు, "మన పిల్లలందరికీ పాత పేర్లే పెడుతున్నాం... ఈసారి కొంచెం కొత్తగా, విభిన్నంగా ఏదైనా పెట్టండి" అని చెప్పడంతో, ఆ రోజుల్లో ప్రాచుర్యం అవుతున్న లెనిన్,స్టాలిన్ పేర్లని పెట్టడం ఇష్టం లేక **శివాజీ** అని నామకరణం చేశారు అవధానులు గారు.

భార్య పార్వతికి, శివాజీ బాగా చదువుకుని ఉద్యోగం చేస్తే చూడాలని ఆశ. మొదటి ఇద్దరు కుమారులు ఇప్పటికే వేదాభ్యాసంలో ఉన్నారు కదా అని భార్య ప్రాధేయపడడంతో, పన్నెండు ఏళ్ల వరకూ వేదాలు, సూక్తులు ఎంత నేర్పించాలో అంత నేర్పించి, అమలాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి నుంచి చదవడానికి శివాజీని పంపించారు అవధానులు గారు.

మామయ్య వాళ్లింట్లో ఉంటూ, చదువుకుంటూ, ఆదివారాలు అగ్రహారానికి వెళ్తూ కాలం గడిచింది శివాజీకి. వేసవి సెలవుల్లో మరింత దీక్షతో చదువుల్లో నిమగ్నమై, పదో తరగతిలో జిల్లా టాపర్‌గా,ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర టాపర్‌గా నిలిచి, 1980లో మద్రాస్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో చేరాడు శివాజీ.

అమలాపురం అనే చిన్న గ్రామం నుంచి మద్రాస్‌కి రావడం శివాజీకి ఏమాత్రం భయానకంగా అనిపించలేదు. అది అతని పెంపకం ప్రభావమో, లేక అతను పొందిన విభిన్నమైన విద్యా విధానమో నగరపు గందరగోళం అతన్ని కుదిపేయలేకపోయింది.

కొద్ది రోజుల్లోనే ఐఐటీలో ఉన్న వర్గాల స్వభావాన్ని శివాజీ గమనించాడు. ఒక వర్గం స్థానిక పెరియార్ నేతల భావజాలాన్ని, సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయాలను బలంగా సమర్థించేది. మరో వర్గం సంప్రదాయాలకు కట్టుబడి, ప్రభుత్వం ప్రతిపాదించే ప్రతి మార్పును అనుమానంతో చూసేది.

ఈ రెండు ధ్రువాల మధ్య నిలబడకుండా, శివాజీ జాగ్రత్తగా తన మార్గాన్ని తానే ఎంచుకున్నాడు. ఎలాంటి వర్గానికీ చేరలేదు. అతని దృష్టి మాత్రం రోజువారి నిత్యపూజలు, ఇంజినీరింగ్ చదువులపైనే నిలిచింది.

కాలం గడిచింది. మూడవ సంవత్సరంలో హాస్టల్ గదిలో శివాజీకి ఓ కొత్త రూమ్‌మేట్ వచ్చాడు. అతని పేరు **ఇర్ఫాన్ సయ్యద్** అహ్మదాబాద్ నుంచి వచ్చిన యువకుడు. సివిల్ ఇంజినీరింగ్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌కు మారి, మూడవ సంవత్సరంలోనే శివాజీ గదిలోకి అడుగుపెట్టాడు. మొదటి రోజే, గదిలోకి కొంచెం సంకోచంగా అడుగుపెడుతూ ఇర్ఫాన్ అన్నాడు
“డోంట్ వర్రీ భయ్యా… నేను ఫస్ట్ ఇయర్ నుంచే వెజిటేరియన్‌గా తింటున్నాను. మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.”

శివాజీ చిరునవ్వుతో “నువ్వు ఎప్పటికీ సమస్య కాదు. మనిద్దరం కలసి ఎన్నో సమస్యలకు పరిష్కారం కనుగొనగలం.”

మూడవ సంవత్సరం క్షణంలో గడిచిపోయింది. ఆ ఏడాదంతా చదువులతో పాటు, ఇద్దరూ తమ తమ మతాచారాల గురించి, ఆచరణల గురించి లోతుగా చర్చించుకునేవారు. పండుగలొస్తే ఎవరిది అయినా ఇద్దరూ కలిసే జరుపుకునేవారు.

మూడవ సంవత్సరం ముగిసేసరికి వారి స్నేహం ఎంతగా పెరిగిందంటే ఇర్ఫాన్ సంధ్యావందనం చేయడం మొదలుపెట్టాడు, భగవద్గీత చదివాడు, పూజలు కూడా ఆచరించాడు.అలాగే శివాజీ కొన్ని సందర్భాల్లో నమాజ్ చేయడం, ఖురాన్ చదవడం మొదలుపెట్టాడు.

మద్రాస్‌లో ఉంటూనే కాదు వీకెండ్‌ల్లో ఇద్దరూ కలిసి తిరుపతికి , తమిళనాట అన్ని ఆలయాలు చూసేసారు. అలాగే శివాజీ, ఇర్ఫాన్‌తో కలిసి స్థానిక మసీదుకూ వెళ్లి ప్రార్థనల్లో పాల్గొనేవాడు.

**********************************

ఆ రోజుల్లో దేశ రాజకీయ పరిస్థితులు కూడా మారడం మొదలయ్యాయి.

నాలుగో సంవత్సరం వచ్చేసరికి, రంజాన్ సందర్భంగా ఇర్ఫాన్ తన కుటుంబంతో కొంతకాలం గడపాలని అహ్మదాబాద్‌కు బయలుదేరాడు ఈద్‌ను వాళ్లతో కలిసి జరుపుకోవాలనే ఆశతో. కుటుంబంతో ఆనందంగా గడిపిన తరువాత, వీకెండ్‌కు మద్రాస్ తిరిగి వెళ్లేందుకు ఇర్ఫాన్ సిద్ధమయ్యాడు. కానీ ఈద్ తర్వాత అహ్మదాబాద్ ఒక్కసారిగా మారిపోయింది. అల్లర్లు, మత ఘర్షణలు, కాలిపోతున్న దుకాణాలు నగరం భయంతో కంపిస్తోంది. ఆ రాత్రే మద్రాస్ వెళ్లే రైలు పట్టుకోవాల్సి ఉంది. వీధుల్లో హింస తీవ్రరూపం దాల్చింది. ఇర్ఫాన్ ఒకే ఒక్క బ్యాగ్ తీసుకుని, తన స్నేహితుడి మోటార్‌బైక్ తీసుకుని రైల్వే స్టేషన్ వైపు బయలుదేరాడు. దారిలో అతన్ని కర్రలు, కత్తులతో ఉన్న ఒక గుంపు అడ్డుకుంది.

“ముందు నీ పేరు చెప్పు!” అని అరవడంతో,
ఇర్ఫాన్ స్థిరంగా అన్నాడు “నా పేరు శివాజీ. మద్రాస్ ఎక్స్‌ప్రెస్ పట్టుకోవడానికి స్టేషన్‌కు వెళ్తున్నాను.”

గుంపులో ఎవరో గట్టిగ అరిచారు “అబద్ధం! వాడు ముస్లిం కావచ్చు. నిరూపించమను!”
ఎవరో ఇర్ఫాన్‌ను బలంగా తోసేశారు. అతను కొన్ని అడుగుల దూరంలో నేలమీద పడిపోయాడు.

మళ్లీ ఎవరో అరిచారు- “వాడి ప్యాంట్ తెరవండి! అప్పుడే తెలుస్తుంది ఏ మతానికి చెందాడో!”
గుంపు ఇర్ఫాన్ వైపు ముందుకు కదిలింది.

భయంతో వణికిపోతున్న ఇర్ఫాన్, కన్నీళ్లతో, చేతులు వణుకుతుండగానే తన చొక్కా చించుకుని, తనకున్న యజ్ఞోపవీతాన్ని బయటకు తీసి, ఒక్కసారిగా గొంతు విప్పి

**విశ్వామిత్ర, అఘమర్షన, కౌసిక త్రయా ఋషేయ ప్రవరాన్విత కౌశిక గోత్రస్య, శివాజీ నామధేయః!**”

ఆ ఒక్క అరుపు భయంతో కంపించిన గొంతు నుంచి పుట్టిన ఆ మంత్రోచ్చారణ గుంపు చెవుల్లో నిజాన్ని నింపింది. క్షణాల వ్యవధిలో వారిలో మార్పు వచ్చింది. కొద్దిసేపటి క్రితం కత్తులుగా మెరిపించిన కళ్లలో సందేహం తలెత్తింది. మాటలు ఆగిపోయాయి. గుంపు చీలిపోయింది.

ఇంక ఇర్ఫాన్‌ను ఇంక ఎవరూ ఎక్కడా ఆపలేదు. అతను అహ్మదాబాద్ నుంచి మద్రాస్ వెళ్లే ఆఖరి రైలు స్టేషన్ ఒదిలి వెళ్లిపోకుండా , పరుగున ఆ రైలుని, **జీవితం** మళ్ళీ పునర్జన్మ నిచ్చినట్టుగా అవిసి పట్టుకొని ఎక్కగలిగాడు
ఈ సంఘటనను ఇర్ఫాన్ మద్రాస్‌కి తిరిగొచ్చాక శివాజీకి చెప్పాడు. ఆ రోజు నుంచి వారి బంధం మరింత గట్టిపడింది.

వృత్తి జీవితాలు ఇద్దరినీ వేర్వేరు దారుల్లోకి తీసుకెళ్లాయి.ఇర్ఫాన్ కలకత్తాలో స్థిరపడి కుటుంబంతో జీవితం నిర్మించుకున్నాడు. శివాజీ బెంగళూరులో స్థిరపడి, తన వృత్తిలో గౌరవప్రదమైన స్థాయికి చేరుకున్నాడు.
రిటైర్మెంట్ తర్వాత - శివాజీ భీమిలిలోని తన ఫార్మ్‌హౌస్‌లో ప్రశాంత జీవితం గడపసాగాడు. ఇర్ఫాన్ కలకత్తాలో తన కుటుంబంతో నివసించసాగాడు.

********************************

రెండింటికల్లా వారు ఇర్ఫాన్ ఇంటికి చేరేసరికి అందరూ శివాజీ కోసం ఎదురు చూస్తున్నారు.
చివరి చూపు చూసి, అంత్యక్రియల్లో భాగంగా, శివాజీ ఇబ్రాహీంతో కలిసి ఖబరస్తాన్‌కు వెళ్లాడు అందరితోపాటుగా.

మూడో రోజు, విశాఖపట్నం తిరిగి వెళ్లే ముందు, శివాజీ తాము బయల్దేరడం గురించి ఇబ్రాహీంకు చెప్పాలనుకున్నాడు. "అంకుల్... పదిహేను నిమిషాలు ఇస్తారా?" అంటూ ఇబ్రాహీం శివాజీని ఒక గదిలోకి తీసుకెళ్లాడు. "అంకుల్," అని ప్రారంభించాడు ఇబ్రాహీం, "మీకు తెలుసో లేదో నాకు తెలియదు. కానీ బాబా ఎప్పుడూ మీ గురించి ఎంతో గౌరవంగా మాట్లాడేవారు. మీతో గడిపిన అనుభవాలను మాకు ఎన్నోసార్లు చెప్పేవారు. గత కొన్ని సంవత్సరాల్లో బాబా కొన్ని కంపెనీలు స్థాపించారు. అందులో ప్రతి కంపెనీలో ఐదు శాతం వాటాను మీ పేరుమీద ప్రత్యేకంగా విడదీశారు. బాబా ఎప్పుడూ అనేవారు మీరు ఆయనకు రెండో జీవితం ఇచ్చారని. జీవితం పట్ల ఆయన దృష్టికోణాన్ని మార్చారని, ఆయన ఆలోచనల్ని విశాలం చేశారని. మా కుటుంబం అంతా మీకు ఎప్పటికీ ఋణపడి ఉంటుంది, అంకుల్. మీరు ఇప్పుడు నాకు జీవించి ఉన్న తండ్రిలాంటివారు. దయచేసి దీన్ని స్వీకరించండి. మీ బ్యాంక్ వివరాలు ఇవ్వండి. మా కుటుంబాన్ని ఆశీర్వదించండి." అంటూ, ఇబ్రాహీం కోట్ల రూపాయల విలువైన చెక్కును ఆ భాగస్వామ్య వాటా గుర్తుగా శివాజీ చేతిలో పెట్టాడు. ఇబ్రాహీం కుటుంబ సభ్యులంతా హాసినీకి, శివాజీకి నమస్కరించారు.

అప్పుడు శివాజీ మృదువుగా, కానీ స్థిరమైన స్వరంతో అన్నాడు ,"ఇబ్రాహీం... ఈ చెక్కుతో నేను ఏం చేయాలి? నాకు ఈ డబ్బు అవసరం లేదు. నేను మీ తండ్రికి రెండో జీవితం ఇవ్వలేదు. ఆ రోజు ఆయనను కాపాడింది ఆయన నిరంతరం నేర్చుకోవాలన్న మనసు, ఆయన విశాలమైన దృక్పథం."

కానీ ఇబ్రాహీం వదల్లేదు. చెక్కు తీసుకోవాలని, బ్యాంక్ వివరాలు ఇవ్వాలని వినయంగా పట్టుబట్టాడు. అప్పుడు శివాజీ కొద్దిసేపు ఆలోచించి అన్నాడు "మీ తండ్రికి ఏది ఆనందం కలిగిస్తుందో నాకు తెలుసు. దయచేసి ఈ చెక్కులను ఈ చిరునామాకు జమ చేయండి. ఈ ఫౌండేషన్ ట్రస్టీలతో సంప్రదింపులో ఉండండి."

అంటూ, ఒక చిన్న కాగితంపై బ్యాంక్ వివరాలతో పాటు ఇలా వ్రాశాడు **'గాయత్రి గురుకులం, అమలాపురం'** "ఇర్ఫాన్–శివాజీ లాంటి స్నేహాలు మరిన్ని పుట్టేలా ఈ పాఠశాలలు ప్రపంచాన్ని మరింత వెలుగు నివ్వాలి" అని చెప్పి, శివాజీ, హాసినితో కలిసి విమానాశ్రయం వైపు కారులో బయలుదేరాడు.

**"మతాలూ, ఆచారాలు, సాంప్రదాయాలు, మనుషులు వారికోసం వారు సృషించుకుని, వారి-వారి గొప్పలకు వాడుకుంటున్నారు. మానవత్వానికి విలువ ఇవ్వక, మనిషికి మనిషికి మధ్య సత్సంబంధాలకి దోహదం చేయకపోతే, ఇవన్నీ ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే హాసిని!" అంటూ బాధతో నిట్టూరుస్తూ అన్నాడు శివాజీ**

సర్వే జనాః సుఖినోభవంతు

స్వస్తి

# గణపతి మట్టి బొమ్మల తయారీ



# Ganesh Idol Making

# వినాయక చవితి పూజ, భోజనాలు



# Vinayaka Chavithi Pooja and lunch

# మా ఇంటి బొమ్మలకొలువు

**- శ్రీ జ్యోతి చేబోలు**

మా ఇంట్లో బొమ్మల కొలువు పెట్టడం అనేది ఒక సంప్రదాయం. బొమ్మల కొలువు అంటే కేవలం బొమ్మల అమరిక మాత్రమే కాదు, పిల్లలకు మన రామాయణ గాథలు, దశావతారాలు, కొండపల్లి, ఏటికొప్పాక వంటి హస్తకళల గొప్పతనాన్ని పరిచయం చేసే ఒక వేదిక. నా దగ్గర ఇప్పటికే శ్రీనివాస కళ్యాణం, బొమ్మల పెళ్ళి సెట్, కృష్ణుని లీలలు వంటి ఎన్నో అందమైన బొమ్మల సెట్లు ఉన్నాయి. కానీ, మనసులో ఒకటే వెలితి... అష్టలక్ష్ముల సెట్ లేదని.

నేను కెనడా వచ్చి ఇప్పటికి మూడు సంవత్సరాలు అవుతోంది. ఇక్కడికి వచ్చేటప్పుడు చాలా తక్కువ బొమ్మలే తెచ్చుకున్నాను. కొరియర్ చేయించుకుంటే పాడవుతాయేమో అన్న భయం. ఈసారి మా మావయ్య గారు వచ్చేటప్పుడు మిగిలిన బొమ్మలుతో పాటు అష్ట లక్ష్మి సెట్ తీసుకోని రాగలరా అని అడిగాను, కానీ లగేజీ ఎక్కువ అవ్వడం వల్ల మరియు సమయం కుదరకపోవడం వల్ల కేవలం పాత బొమ్మలు మాత్రమే తీసుకురాగలిగారు.

కొలువు పెట్టడానికి ఇంకా వారం రోజులే ఉంది. కానీ మనసులో ఒకటే బాధ అష్ట లక్ష్మీదేవి సెట్ లేదని. ఆన్‌లైన్‌లో వెతికితే రేట్లు ఎక్కువ, పైగా డెలివరీ సమయం ఎక్కువగా ఉంది. మా వారు "ఈసారికి ఇలాగే కానివ్వు, వచ్చే ఏడాది చూద్దాం" అన్నారు.

కానీ నాకు మాత్రం అష్టలక్ష్మి సెట్ ఉండాలని బలంగా అనిపించింది.నిద్రపట్టని ఓ రాత్రి, అనుకోకుండా ఫేస్‌బుక్ మార్కెట్‌ప్లేస్‌లో వెతకడం మొదలుపెట్టాను. అక్కడ విద్యా గారు అనే ఆవిడ "బొమ్మల కొలువు బొమ్మలు ఉన్నాయి" అని ఒక ప్రకటన పెట్టారు. వెంటనే ఆమెకి మెసేజు పెట్టి ఆవిడ ఇంటి అడ్రస్ కనుకొన్నాను.

మేము వెళ్ళేసరికి ఆ ఇల్లంతా ఖాళీగా ఉంది, వారు సిటీ వదిలి వెళ్ళిపోతున్నారట. విద్యా గారు ఇంట్లో లేరని, వారి భర్త మమ్మల్ని బేస్‌మెంట్‌కు తీసుకెళ్లారు. బొమ్మలన్నీ ఈ బాక్సుల్లో ఉన్నాయని చెప్పి అయినా పైకి వెళ్లిపోయారు, కానీ అక్కడ చాలా బాక్సులు ఉన్నాయి. ఒక్కో బాక్సు తెరవడం మొదలుపెట్టాము. అనిమల్ జూ, వింటర్ థీమ్, పెరుమాళ్ సెట్... ఇలా ఒక్కో బాక్స్ చూస్తున్నాను.

లక్ష్మీదేవి కోసం నా కళ్లు ఆరాటపడుతున్నాయి. చివరగా ఒక బాక్స్ మాత్రమే ఉంది. గుండె వేగంగా కొట్టుకుంటుండగా ఆ బాక్స్ తెరిచాను. హమ్మయ్య! నా ఆనందానికి హద్దులు లేవు. అష్టలక్ష్మి సెట్ నా కోసమే ఎదురుచూస్తున్నట్లుగా అందులో ఉంది!.

విద్యా గారు వచ్చాక ఆ సెట్ తీసుకుని ఇంటికి వచ్చాను. ఈ సంవత్సరం నా కొలువులో ఆ అష్టలక్ష్ములు కిలకిల నవ్వుతూ కొలువు తీరారు.



## గోదావరి గట్టు

**-సత్య ఆదిత్య చేబోలు**

ఇంట్లో ఏం చేయాలో తెలియక నేను ఇంకా మణికంఠ కలిసి గోదావరి గట్టుకు వెళ్దాం అని అనుకున్నాం. వాడి సైకిల్ వేసుకుని ఇద్దరం మాట్లాడుకుంటూ గట్టు దగ్గరకు చేరేసరికి రాత్రి అయిపోయింది. రాత్రి 8:30 కావడంతో జనాలు మెల్లగా ఇంటికి వెళ్తున్నారు.

అప్పుడే మా మణిగాడు, "ఒరేయ్, ఆకలిగా ఉంది. ఏమైనా తిందాం రా. డబ్బులు ఏమైనా తెచ్చావా?" అని అడిగాడు. జేబులో వెతికితే 5 రూపాయలు దొరికాయి. సరే పదరా అని, కోటి లింగాల రేవు దగ్గర పిడత కింద పప్పు తీసుకుని మళ్ళీ గట్టు దగ్గరకు వచ్చి కూర్చున్నాం. నది వేగంగా ప్రవహించడం వల్ల చల్లటి గాలి వీస్తోంది. ఆ గాలికి హాయిగా ఇద్దరం గట్టు మెట్ల మీద తల పెట్టుకుని ఆ చల్లదనాన్ని ఆస్వాదిస్తూ అలా ఒక చిన్న కునుకు తీశాం.

ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి చూసేసరికి గట్టు మొత్తం చీకటిగా అయిపోయింది. జనాలు ఎవరూ లేరు.

"ఓరి బాబు, మణి లేవరా! ఎవరు లేరు, ఇంటికి పోదాం," అని లేపాను.

వాడు నిద్రలో, "బామ్మా, కాసేపు ఉండు. మెల్లగా లేస్తా, లేవే," అని కలవరిస్తున్నాడు.

"ఇంతలో అంత మత్తు నిద్ర ఏమిటి రా?" అని వాడిని గట్టిగా కుదిపాను.

అప్పటికే వాడు లేచి, "అయ్యో, చీకటి అయింది. పద, పద!" అని అనడంతో పరుగులు తీశాం.

అలా మెట్లు ఎక్కుతుంటే, దూరంగా ఎవరిదో చితి కాలుతున్నట్టుగా కనిపించింది.

మణిగాడు, "ఒరే రవి, చూడు! అక్కడ చితిలోంచి ఎవరో లేస్తున్నట్టు ఉంది రా," అన్నాడు. నా గుండెలు జారిపోయాయి. ఇంక భయంతో అటు చూస్తే, అక్కడ నిజంగానే ఎవరో చితి మంట దగ్గర నడుస్తున్నట్టుగా కనిపించింది. ఇంటికి వెళ్లాలంటే ఆ వైపుగానే వెళ్లాలి.

"మణిగా, సినిమాకి వెళ్దాం రా అంటే వినలేదు. చూడు, ఇప్పుడు ఈ దెయ్యాల గట్టుకి తెచ్చావు," అన్నాను. వాడు భయపడుతూ, "ఇంక ఎప్పుడూ ఇటు రావద్దు రా," అన్నాడు. ఇద్దరం భయపడుతూ అక్కడ ఒక చెట్టు పక్కన సైకిల్ పెట్టి ఆగాము. ఈసారి మళ్ళీ చూస్తే, రెండో మూడో దెయ్యాల్లా అక్కడ కనిపించాయి. "ఒరేయ్ రవీ, దెయ్యాల కుటుంబం ఏమో రా! మనల్ని కూడా పట్టుకుని తినేస్తాయి," అని ఏడవటం మొదలు పెట్టాడు.

ఇద్దరం ఆంజనేయ దండకం చదువుతూ మళ్ళీ ఆ చితి వైపు చూసాము. ఈసారి ఎవరో ఆ నిప్పులన్నీ తోసేస్తూ, ఆ మంటల దగ్గర తెల్ల ముసుగుతో కనిపించారు. ఇంక మా మణిగాడు గజగజ వణికిపోయి, "దెయ్యం! దెయ్యం!" అని గట్టిగా అరిచాడు. నేను వాడితో కలిసి అరవడం మొదలుపెట్టాను. మా అరుపులకు అక్కడ ఉన్న రేవు గార్డ్ విజిల్ వేస్తూ వచ్చాడు.

"ఏరా వెధవల్లారా, అర్ధరాత్రి ఇక్కడ ఏం చేస్తున్నారు?" అని అడిగాడు. మేము ఆయనకు జరిగినది చెప్పాము. ఆయన కర్ర తీసుకుని ఆ చితి వైపుకు వెళ్లి చూశారు. నిజంగానే అక్కడ అంతా చిందరవందరగా ఉంది. ఆయన నవ్వుకుంటూ మా వైపు వచ్చాడు.

"మీ దెయ్యం ఎవరో అర్థమైంది. నేను ఆ దెయ్యాన్ని చాలా సార్లు చూసాను," అని అన్నాడు. మా ఇద్దరికీ ఒళ్ళు జలదరించింది.

"ఏ బంధువులు లేని అనాథలను ఇక్కడ దహన సంస్కారాలు చేస్తూ ఉంటారు. వారిని చూడటానికి ఎవరు రారు కాబట్టి, ఆ కట్టెలు ఇచ్చే పిల్లలు ఇలాంటి దహనం అయ్యాక రాత్రుళ్ళు వచ్చి ఏమైనా బంగారు పన్ను కానీ, బంగారు వంగరం కానీ దొరుకుతుందా అని ఇలాంటి పనులు చేస్తూ ఉంటారు. మీ అరుపులకు పారిపోయారు."

"నేను సూపరింటెండెంట్ గారికి చెప్పి ఒక గేటు పెట్టిస్తా," అని చెప్పి మాకు ధైర్యం చెప్పారు. ఇంకెప్పుడూ రాత్రుళ్ళు ఇటు వైపుకి రావద్దు అని మందలించారు. మేము ఇద్దరం మళ్ళీ ఆ గట్టు వైపుకి పొద్దున్న కూడా రామని అనుకుని అక్కడి నుంచి పారిపోయాము.



## మన సంప్రదాయమే మనకు ఊపిరి

**- షామీర్ జానకీదేవి**

మన సంప్రదాయమే మనకు ఊపిరి...
మన సంస్కృతి అందరికీ ఆదర్శం... విదేశాలలో సైతం మ్రోగింది మన ప్రభంజనం...
ఆచారాలతో ముడివేసిన తెలుగుదనం...

గిరిజనుల దేవతల కోసం చేసే జాతరలు.. గ్రామ దేవతలుగా అందించే చల్లని చూపులు...
అందరినీ ఒకటిగా చేర్చే అమ్మ ఆశీస్సులు...
మన తెలంగాణ దేవతలు సమ్మక్క- సారలమ్మ జాతర...

హరికథలు బుర్రకథల లో వినిపించే మన పురాణాలు...
మనసును రంజింప జేసే పాటలు... నృత్యంలో కదలాడే అందెల రవళులు... లలిత కళలను పోషించారు ఆ నాటి రాజులు...

నాటి భువన విజయం గుర్తొచ్చేలా... జరిపిస్తున్నాము కవుల సమ్మేళనం... జోలపాటలా వినిపించే స్వరఝరులు... ఆస్వాదిస్తూ పోషిద్దాం లలిత కళలను కడవరకు...

# శ్రీ వేంకటేశ్వర కళ్యాణం



# Sri Venkateswara Kalyanam

# శ్రీ వేంకటేశ్వర కళ్యాణం



# Sri Venkateswara Kalyanam

## కాఫీ కబుర్లు - జూ గజం

**- మురళీబాబు**

ఎడ్మంటన్ కి నేను 2018 ఆగస్టు మొదటి వారం లోనే వచ్చినప్పటికీ ఇల్లు చూసుకుని పరివారాన్ని ఇక్కడికి తరలించేసరికి ఇంకో నాలుగు వారాలు పట్టింది. వచ్చిరాగానే స్కూల్ మొదలైంది ఇక ఆ హడావుడి లో ఇంకో నాలుగు వారాలు.

ఇంట్లో తరచూ వినిపించే "ఈ ఊరేంటి ఇలా ఉంది, ఎవరూ తెలియదిక్కడ", "నాన్నా, వి విల్ గో బ్యాక్ టు కాల్గరీ" సంభాషణల మధ్య "ఈ ఊరు మనదిరా, .." అని అరచి చెప్పలేక "ఊరే ఎవరినో ఒకరిని పరిచయం చేస్తుంది, నేను కాళహస్తి లో పుట్టాను కానీ కాల్గరీ లో కాదు కదా" అని అంటే "నేను సరే, మరి పిల్లలూ" అని తననేలోపల "చూస్తూ ఉండు ఇంకో నెలాగైతే మంచు కురిసినా కురవకున్నా, కొత్త స్నేహాలు విరగపూస్తాయి".

ఇలా ఇంకో నెల అవుతుండగా, ఒక ఆదివారం ఉదయాన "మనం ఎడ్మంటన్ జూ కి వెళ్తున్నాం" అని చెబితే మిగతా ముగ్గురి లో ఇద్దరు ముభావంగానే ఉన్నారు, మా పాప మటుకు ఉత్సాహం కనపరిచింది. తనకప్పుడు మూడేళ్లు. సరే అని స్నానాలు చేసుకొని బయలుదేరేదానికి సిద్ధమవుతుండగా కాల్గరీ నుంచి స్నేహితుడు కాల్ చేసి "ఎలా ఉన్నావు, సండే ప్లాన్స్ ఏమిటి " అని అడిగితే "జూ కి వెళ్తున్నాం" అని చెప్పాను. పెద్ద నవ్వు వినిపించింది అటువైపు నుంచి. అందులోని వెటకారం తూచడానికి త్రాసులేదు కానీ, ఉంటే రెండుముక్కలయ్యుండేది. "వీడేంటి ఇంత మాటన్నాడు" అని ఉక్రోషం పొడుచుకొచ్చి అప్పటికప్పుడు తట్టిన ఇంగ్లీష్ సామెతలు చెప్పను "కంపారిసిన్ ఈజ్ ది థీఫ్ అఫ్ జాయ్", "ఆ బర్డ్ ఇన్ హ్యాండ్ ఈజ్ వర్త్ టూ ఇన్ ది బుష్". దేని ప్రత్యేకత దానిదే, నాకు అందుబాటులో ఉన్న ఆనందాన్ని ఎక్కడ ఉన్నదానితో పోల్చుకొని చిన్నబుచ్చుకొను అని త్వరగా కాల్ ముగించేసి బయలుదేరాము. జూ కి చేరుకునేసరికి ఉదయం 10.30 అయ్యింది. టిక్కెట్లు కొనుగోలు చేసి లోనికి నడిచాము. ఒక్కొక్క జంతువును విడిగా ఉంటే విడిగా, జతగా ఉంటే జతగా నిర్దిష్ట ప్రదేశాలలో ఏర్పాటు చేశారు. మేము పులులు, లామా, మంచు చిరుత, పెద్ద కొమ్ముల పొట్టేలు తదితర జంతువులూ మరియు గబ్బిలం, కోతులను ఒక్కొకటి గా చూస్తూ ముందుకు వెళ్తున్నాము.

అప్పుడు కనిపించింది అక్కడ ఒక ఏనుగు. దాని పేరు లూసీ ( ఆ రోజు నాకు ఆ ఏనుగు పేరు తెలియదు). చూసి చూడగానే పిల్లలు కూడా బాగా ఆకర్షితులయ్యారు.అన్ని జంతువుల లాగ ఆ ఏనుగుని విడిగా గా కంచె వేసి ఉంచలేదు. మనం నడుస్తువుంటే ఓ పక్కకు నిల్చొని ఉంది. పక్క ఒక జూ అధికారి ఉంది. ఆగి అందరూ ఫోటోలు తీసుకుంటున్నారు. అందరితోపాటూ మేము కూడా.

మా బాబు సాయి అడిగాడు "ఏనుగులు పెద్దవి కదా, అవి ఇక్కడ కెనడా వింటర్ ని తట్టుకోగలవా" అని. వాడు అక్కడున్న పులుల ని చూసి అడగలేదు కానీ ఈ ఏనుగు గురించి అడిగాడు. ఆకారం అంతున్నా సాధుజీవి అని సానుభూతేమో ? అని అనుకొని "లేదు సాయి, ఏనుగులు కూడా ఇక్కడ కెనడా వాతావరణానికి స్వతహాగా ఇమడలేవు, మన లాగే" కానీ మనిషి జియోగ్రఫీ లో చెప్పినట్టు ఎన్విరాన్మెంటల్ పాసిబిలిజం తో ప్రకృతి అనుకూలంగా లేకున్నా అక్కడికెళ్లి స్థిరపడగలడు. జపాన్ లో భూకంపాలు వచ్చినా ఉంటాడు, ఇజ్రాయిల్ లో నీళ్ళు తక్కువున్నా డ్రిప్ ఇరిగేషన్ ( బిందు సేద్యం ) తో వ్యవసాయం చేస్తాడు. వాడికి 9 ఏళ్ళు, నేను చెప్పింది ఎంత అర్థమయ్యిందో తెలియదు. అలాగే ఈ ఏనుగును కూడా తెచ్చుకున్నాడు అని ముగించి, ఫోటోలయ్యాక ఇక ఇక వెళదామని ఇంటికి బయలుదేరి వచ్చాము.

ఇక ఆ తరువాత పిల్లలు అపుడుడప్పుడు స్కూల్ తరపున, స్నేహితులతోనో జూ కి ఒకటి రెండు సార్లు వెళ్లినా, నీకు వెళ్లడం కుదర్లేదు. ఆ మధ్య 2023 లో లూసీ గురించి వార్త - తనకు అస్వస్థత అని, ఇక జూ సందర్శకులను అలరించదు అని. ఒక్కసారిగా మళ్ళీ ఆ ఏనుగు గుర్తొచ్చింది. తనని రెండేళ్లప్పుడు కెనడా కి తీసుకొచ్చారని, మొన్నీ మధ్యే తనకు 2025 లో 50 ఏళ్ళు నిండాయని. తను జీవితమంతా ఒంటరిగానే ఉంది అట. మధ్యలో పిల్లలు కోసం ప్రయత్నించినా ఎందుకో ఫలప్రదం కాలేదట. లూసీని, ఎడ్మంటన్ జూ తమ ఉనికి లో భాగంగా చేర్చుకున్నారు. లూసీ ప్రస్తుతం ఇక్కడ జూ పర్యేవేక్షకుల దగ్గరే సేదతీరుతోంది. మనలాగే ఏనుగులు కూడా సంఘ జీవులు. లూసీ ఒంటరిగా కాకుండా తన స్నేహితులతో, జతగాళ్లతో వచ్చిఉంటే తన కథ మరోలా ఉండేదేమో. లూసీ లానే మనం ఇక్కడికి, కానీ ఇష్టం గానే వచ్చాము. ఒంటరిగా కాదు, మన పద్ధతులు, ఆహారం, అలవాట్లు అన్ని తెచుకున్నాము. అయినా ఏదో లేదని వెతుకుతూనే ఉంటాము. లూసీ లానే మనల్ని కూడా ఎడ్మంటన్ స్వంతం చేసుకుంది. మొన్నటి వరకూ పుట్టినరోజులు మాత్రమే జరుగుతాయిక్కడ అని అనుకుంటుంటే, ఇప్పుడు పెళ్లిళ్లు, షష్టిపూర్తులు జరుపుకుంటున్నాము ఈ నగరంలో..... మంచి ప్రయత్నం ఉంటే, ఈ మంచులో కొత్త స్నేహాలు ఎందుకు పూయవూ..



**లూసీ తో నేను 2018 అక్టోబర్ 21**

## స్వేచ్ఛ వైపు సాగిన ఆ ఇద్దరు

**- కవిత ధర్మరాజు**

వాంకూవర్ సముద్ర తీరంలో 70 ఏళ్ళ డాన్ అనే వృద్ధురాలు ఒంటరిగా జీవించేది. ఆ రోజు ఆమె పుట్టినరోజు. ఉదయం సరుకులు కొనడానికి స్టోర్‌కి వెళ్ళి, క్యాషియర్‌తో చిన్నగా మాట్లాడాలని చూసినా, అతను రూడ్ గా స్పందించాడు. డాన్ నిశ్శబ్దంగా బయటకు వచ్చేసింది.

అప్పుడే ఆమె కుమార్తె ఫోన్ చేసి, “Mom, I can’t make it today… but I sent you a gift” అంది.

డాన్ చిరునవ్వు వెనుక చిన్న బాధ దాచుకుంది.

ఆమె తనకు ఇష్టమైన పార్కులో నడుస్తు ఉండగా, రోడ్డుపక్కన ఒక 30 ఏళ్ళ యువకుడు ఒలివర్ పాత కీబోర్డ్ అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడు. అతను కఠినంగా, “150 డాలర్లు,” అన్నాడు.

“నేను కొనుగోలు చేస్తాను. నువ్వే కీబోర్డ్ మా ఇంట్లో సెటప్ చేయాలి,” అంది డాన్. ఒలివర్ నమ్మకపోయినా, డబ్బు అవసరం. వర్షం తడిసిన వాంకూవర్ వీధుల్లో దాదాపు ఒక కిలోమీటర్ నడిచి, ఆమె పడవ వరకు వచ్చాడు. కీబోర్డ్ సెటప్ చేసిన తర్వాత, డాన్ నవ్వుతూ, “నాకు ఒక పాట నేర్పాలి. ప్రతి క్లాస్‌కు 20 డాలర్లు… పైగా వేడి భోజనం,” అంది.

మొదట్లో ఆలివర్ సంకోచించినా తరువాత అతను మనసు మార్చుకొని డాన్ ప్రతిపాదనకు అంగీకరించాడు. ఆ రోజు నుంచి వారి మధ్య ఒక అద్భుతమైన బంధం మొదలైంది. డాన్ అతనికి భోజనం పెట్టింది, అతని పాటలు రికార్డ్ చేయడానికి సహాయం చేసింది, అతన్ని addictions నుంచి బయటకు వచ్చేలా చేసింది.

ఒలివర్ కూడా తన song writing skills in తిరిగి కనుగొన్నాడు.

కానీ వారి బంధం డాన్ కుమార్తెకు నచ్చలేదు.

ఒక రోజు ఆమె అకస్మాత్తుగా వచ్చి, కోపంతో ఒలివర్‌ను పడవ నుండి బయటకుతోసేస్తూ, "Stay away from my mother!" అంది.

డాన్ ఏమీ చెప్పలేకపోయింది.

ఆమె కుమార్తె వెంటనే డాన్‌ను retirement livingకి మార్చి, పడవను అమ్మకానికి పెట్టింది.
డాన్ గదిలో ఒంటరిగా కూర్చుని, ఒలివర్ నేర్పిన చిన్న మెలోడీని గుర్తు చేసుకుని కన్నీళ్లు పెట్టుకుంది.

ఒలివర్ మాత్రం ఆమెను వెతుకుతూనే ఉన్నాడు.
ఒక రాత్రి, అమ్మకానికి పెట్టిన పడవలో సరుకులు నింపి, చీకట్లోనే retirement homeకి చేరుకుని, డాన్ గదికి నిశ్శబ్దంగా తలుపు తట్టాడు.

"డాన్... నేను వచ్చాను," అన్నాడు.
డాన్ కళ్లలో వెలుగు మెరిసింది. "నువ్వు వస్తావని నాకు తెలుసు," అంది.

ఒలివర్ ఆమెను నెమ్మదిగ పడవలోకి తీసుకెళ్లాడు. వాంకూవర్ నది మీద అలలు మృదువుగా తాకుతున్న శబ్దం మధ్య, వారు పడవను నెమ్మదిగా సాగించారు.

డాన్ అతని భుజంపై తల వాల్చి, నిశ్శబ్దంగా అంది:

"ఇదే నేను ఎన్నేళ్ళ క్రితం కలగన్న జీవితం... నా మొదటి ప్రేమ ఆండ్రూతో కలిసి ఇలా సముద్రం మీద ప్రయాణించాలని అప్పట్లో ఎంతగా కోరుకున్నానో."
ఒలివర్ చిరునవ్వాడు.

ఆ పడవలో, వాంకూవర్ రాత్రి నిశ్శబ్దంలో రెండు విరిగిన హృదయాలు సంగీతం, స్నేహం, స్వేచ్ఛతో కొత్త జీవితం ప్రారంభించారు.

# వాలంటీర్స్ మీట్



# Volunteers Meet

## పరుగులు-బంతులు

**- భుజంగ రావు దన్నపునేని**

పట్టువదలని విక్రమార్కుడు బేతాళుని శవాన్ని భుజాన వేసుకుని నడుస్తుండగా, శవం లోని బేతాళుడు ఇలా ఒక కథ చెప్ప సాగాడు.

***

అది 1983 వ సంవత్సరం.

ఆరోజు రెండవ శనివారం స్కూల్ కి సెలవు కావడం తో అన్వేష్ మధ్యాహ్నం రేడియో ప్రోగ్రాం వినాలని నిర్ణయించు కున్నాడు. మధ్యాహ్నం సరిగ్గా రెండున్నర అవగానే చకచకా వాళ్ళ అన్నయ్య దగ్గరికి వచ్చి అడిగాడు, "అన్నయ్యా నేను 'బాలానందం' వినాలి రేడియో పెట్టవా" ,

"లేదురా ఇప్పుడు నేను క్రికెట్ కామెంట్రీ వింటున్నాను. ఈ రోజు రాత్రి 10.30 వరకు రేడియో నీకు దొరకదు" ,అని వాళ్ళన్నయ్య అనడంతో కాసేపు ఏడ్చి,వాళ్ళమ్మ గారు సర్ది చెప్పడం తో అప్పటికి ఊరుకున్నాడు.

రెండు మూడురోజుల తర్వాత... "వరల్డ్ కప్ లో మన టీం నెగ్గింది " అని అన్న హుషారుగా చెప్పడం తో, "హుర్రే....ఇక వచ్చే ఆదివారం 'బాల వినోదం' ప్రోగ్రాం వినడానికి క్రికెట్ అడ్డు లేదు", అనుకుంటూ గంతులేసాడు అన్వేష్.

***

కొన్నేళ్ళ తర్వాత అన్వేష్ రేడియోలో క్రికెట్ కామెంట్రీ వినడం , ఈనాడు పేపర్ లో క్రికెట్ వార్తలు,కాలమ్స్ చదవడం లాంటివి నేర్చుకొని క్రికెట్ అభిమానుల బృందంలో చేరి పోయాడు. అంతే కాదు వాళ్ళ నాన్న , "నీకు చేతనైతే ఆడు, కానీ ఎవరో ఆడుతున్న ఆటను నీ స్కూలు,హోమ్ వర్క్ మానేసి వినడానికి సిగ్గులేదా..?" , అంటూ పెట్టే చివాట్ల దండకానికి అలవాటు పడ్డాడు.

***

ఒకానొక రోజు అన్వేష్, వాళ్ళ అన్నయ్య,మరియు వారి మిత్రులు కొంతమంది తో కలసి,వాళ్ళ ఇంట్లోని ఒక రూమ్ లో చేరి క్రికెట్ రన్నింగ్ కామెంట్రీ వింటున్నారు.

అది షార్జాలో జరుగుతున్న రెండు పొరుగు దేశాల ఉత్కంఠ భరితమైన మ్యాచ్. పరుగులు ,బంతుల పోరు సాగుతోంది. అది పొరుగు జట్టు ఇన్నింగ్స్ ,ఒక్క పరుగు సాధించినా.. కామెంటేటర్ ఉర్దూలో "ఔరేక్ రన్ కీ ఇఝాఫా...." ,అంటూ ఉద్వేగంగా చెపుతున్నాడు.

పొరుగు జట్టులోని ఒక అనుభవజ్ఞుడైన ఆటగాడు మరోవైపు వికెట్లు కూలుతున్నా లెక్క చేయకుండా,మొక్కవోని ధైర్యంతో ఒక్కో పరుగు పెంచుతూ దృఢంగా నిలబడి ఉన్నాడు.

నెమ్మదిగా బ్యాటింగ్ చేస్తున్న పొరుగు జట్టు 9 వికెట్లు నష్టపోయి చివరి వికెట్ ,చిట్టచివరి బంతికి చేరింది. అప్పుడు ఆడుతున్నది అనుభవజ్ఞుడైన బ్యాట్స్ మన్. మిగిలి ఉన్నది ఒకే ఒక బంతి, బ్యాటింగ్ చేస్తున్న జట్టు చేయాల్సినవి ఐదు పరుగులు.

చివరి బంతికి ఫోర్ కొట్టి నా ఆట సమం అవుతుందని, క్యాప్టెన్ బౌండరీ అడ్డు కోవడానికి తగిన వ్యూహంతో ఫీల్డింగ్ మొహరించాడు. కానీ అనూహ్యంగా బ్యాట్స్ మన్ చివరి బంతికి సిక్స్ కొట్టడంతో మ్యాచ్ చేజారింది. కామెంట్రీ వింటున్నవారిలో విషాదం అలుముకుంది. అన్వేష్ అయితే కన్నీటి పర్యంతమయ్యాడు.

***

అన్వేష్ ఆఫీస్ నుండి వచ్చీరాగానే ఆ రోజు 20-20 డే-నైట్ మ్యాచ్ ఉందన్న సంగతి గుర్తొచ్చి టీవీ దగ్గరికి హుషారుగా వెళ్ళాడు. కానీ అప్పటికే టీవీకి అతుక్కు పోయిన శ్రీమతి, తన "అత్తా-కోడలు" సీరియల్ నుండి బయటికి రావడానికి ససేమిరా అంది.

తనను రిక్వెస్టు చేసాడు, “ఈ సీరియల్ రేపయినా చూడొచ్చు...ఇంకా కొన్ని నెలల తర్వాత చూసినా కథ ఇప్పుడున్న ‘ సీన్’ కన్నా ముందుకు వెళ్ళదు కదా..! ఈజీగా క్యాచ్ చేయవచ్చు ...ప్లీజ్ “ .
అలా ఆమెను అనునయచడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవగా,ఇక చేయడానికి ఏమీ లేక ఆరోజుకి అతను బయటికెల్లి ఏదో రెస్టారెంట్లో మ్యాచ్ చూసాడు( అప్పటికింకా అతని వద్ద ల్యాప్టాప్ / డెస్క్-టాప్ లు లేవు ).

తర్వాత కొంతకాలానికి అతని మిత్రబృందం తో కలసి మ్యాచ్ ఎక్కడయినా బయట చూడడానికి అలవాటు పడ్డాడు.
***
మరి కొంతకాలానికి తనకు పెరిగిన పని ఒత్తిడి, మ్యాచ్ ఫలితం ఫిక్సింగ్ ద్వారా బుకీలు నిర్ణయిస్తున్నారని వచ్చిన ఆరోపణలు, వరుస పరాజయాలు లాంటి అనేక కారణాలు అన్వేష్ లోని మ్యాచ్ ఆసాంతం చూసే ఆసక్తిని తగ్గి పోయేలా చేసాయి.
***
అనుకోకుండా ఒక రోజు పిల్లలు, శ్రీమతి ఏదో కారణం తో ఇంట్లో లేక పోవడం, ఆరోజు క్లైంట్ హాలిడే కూడా అవడంతో అన్వేష్ ఒక్కడే ఇంటి దగ్గర ఉండి పోయే సందర్భం వచ్చింది.
అతనికి రాకరాక టీవీ రిమోట్ పట్టుకునే సువర్ణావకాశం రావడంతో ఛానల్స్ స్కాన్ చేయసాగాడు..
అతను ఒక ఛానల్లో వస్తున్న 83 వరల్డ్ కప్ సినిమా ప్రమోషన్ కార్యక్రమం ట్యూన్ చేసుకున్నాడు.
83 వరల్డ్ కప్ గెలిచిన జట్టు సభ్యులు, ఆ సినిమాలో వారి పాత్రలలో నటిస్తున్న నటులు అందరూ కలిసి పాల్గొంటున్న ప్రోగ్రామ్ అది.
ఒక నాటి నవయువకులైన క్రికెటర్ల లో అలుముకున్న ముదిమి ఛాయలు ప్రస్పుటమవుతున్నాయి. దాదాపు అందరూ భావోద్వేగంతో కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు.

ఆ సందర్భానికి ఒక మహా కవి చెప్పిన కవిత "ఏవి తల్లీ! నిరుడు కురిసిన హిమసమూహములు?" గుర్తుకొచ్చి అనుకున్నాడతడు..జీవితం చాలా చిన్నదనే సత్యం క్రీడల్లో మనకు అనుభవంలోకి వస్తుందని .

క్రికెట్ దిగ్గజం ధోని తన రిటైర్మెంట్ రోజు విలకర్ల తో ఉదహరించిన అమితాబ్ నటించిన పాట
“ మై ఫల్ దో ఫల్ కా షాయర్ హూం”, కూడా అప్పటి దృశ్యానికి సరిగ్గా సరిపోతుందని అనిపించింది అతనికి.
***
అలా చాలా ఏళ్ళ తర్వాత ఈ మధ్య అప్పుడప్పుడు కాలక్షేపం కోసం అన్వేష్ ఆసియాకప్ క్రికెట్ మ్యాచులు చూస్తున్నాడు.
ఆసియాకప్ లో తమ అభిమాన జట్టు అప్రతిహత విజయాన్ని స్వంతం చేసుకోవడం, ఒకనాటి క్రీడాకారుడు ద్రవిడ్ ను తలపించే తిలక్, జట్టుకు దొరకడం చాలా ఆనందాన్నిచ్చింది అతనికి.
***
అలా కథ ముగించిన బేతాళుడు, విక్రమార్కునితో అన్నాడు, “ఇది కథ ఎలా అవుతుంది? ఇవి కేవలం అతని జ్ఞాపకాలు మాత్రమే కదా? రాజా ఈ ప్రశ్నకు జవాబు తెలిసికూడా చెప్పక పోయావో ..వచ్చే జన్మలో 14 మంది జట్టులో ఉండి , తుది 11 మంది లో ఉండని ఆటగాడివై పుడతావు”.

“ఏ కథలో అయినా ఏముంటుంది ? ..

ప్రేమ, పెళ్ళి, విడాకులు, కుదిరితే మళ్ళీ పెళ్ళి , కుటుంబ రాజకీయాలు, ఆఫీసు రాజకీయాలు, కాక పోతే దయ్యాలు, భూతాలు, లేదంటే కృత్రిమ మేధ, కుదిరితే కాసిన్ని కబుర్లు, ఓ కప్పు కాఫీ తప్ప“ అని నవ్వి, మళ్ళీ తానే అన్నాడు,”ఈ కథ మనకు చాలా ఇష్టమైన క్రీడకు సంబంధించిన కొన్ని జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు..మనం ఇలా కొన్ని అంశాలు చెప్పుకోవచ్చు.

1.యవ్వనం శాశ్వతం కాదనే సత్యం.

2.రేడియో నుండి టీవీ వరకు గమనం.

3.మధ్య తరగతి కుటుంబంలో రేడియో-టీవీల్లో వారి వారి ప్రాధాన్యాల వలన పోటీ .

4.మ్యాచ్ ఫిక్సింగ్ వంటి సమకాలీన అంశాలు.

5.నిలకడతో,పట్టుదలగా ప్రయత్నిస్తే గెలుపు వైపు ప్రయాణం సాగుతుంది అని చెప్పే ఉత్కంఠ భరితమైన మ్యాచ్ .

6.జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు అన్నట్లు ఒకప్పుడు ఓడిన జట్టు ఇప్పుడు గెలవడం.

7. క్రికెట్ మోజులో అటకెక్కిన చదవు లాంటివి ఎన్నో .." అంటూ ముగించాడు విక్రమార్కుడు. భుజం పైనున్న బేతాళుడు తిరిగి చెట్టెక్కాడు.

## వలపు గీతి

-రాజు గాదిరాజు

మేరువుల సాగి తేరువుల తూగి
వసుధ తిరిగి వనము జూచి
చెలఁగి సాగి దిగులు తొలగి
కలువజేరు భ్రమర రీతి

కడలి ఎగసి ఋతువు కలిసి
నీలాల మెరిసి మేఘాల వెలసి
జగతిపై కురిసి జలములై పారి
కొలనుజేరు వాన చినుకు రీతి

పున్నాగ పూల వల్లరీ-
ఇన్నాళ్లకు నీ చెంత చేరనైతి
మధురోహల నీ చెంప తాకనైతి !!

(ఆరేడు జన్మల ప్రయాణం లో ఇప్పటి ఈ పరిచయం, ప్రణయం, పరిణయం ఒక అనివార్యమైన గమ్యం. నా పున్నాగపూల వల్లరి కి- పుష్ప లత కు ఈ కవిహృదయం అర్పణం, ఈ కవితాఖండిక అంకితం)

# దీపావళి తెలుగు వెలుగులు



# Deepavali, Festival of lights

# దీపావళి తెలుగు వెలుగులు




# Deepavali, Festival of Lights

## 20 వసంతాలు పూర్తి చేసుకున్న మన ఎడ్మంటన్ 'తెలుగు బడి'!!

**- కవిత ధర్మరాజు.**

ఎడ్మంటన్ తెలుగు బడి - కెనడా, అల్బెర్టా ప్రావిన్స్, ఎడ్మంటన్ నగరంలో, మన మాతృభాష అయిన తెలుగును పరిరక్షించడానికి మరియు భవిష్య తరాలకు తరగని నిధిగా అందించడానికి గత 20 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తోంది.

ప్రిన్సిపాల్ శ్రీ ప్రవీణ్ బారాడి, శ్రీ వివేక్ వేముల, మరియు ఇతర ఉత్సాహభరితులైన స్వచ్ఛంద ఉపాధ్యాయుల సంకల్ప బలంతో, సారధ్య నైపుణ్యంతో, తెలుగు భాష మరియు సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించడంలో ఎడ్మంటన్ తెలుగు బడి ఉత్తర అమెరికా ఖండంలోనే అనేక ఇతర నగరాలకు ఆదర్శం గా నిలిచింది.

తెలుగు బడి ప్రధాన లక్ష్యం- యువతరం తమ మాతృభాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా తెలుగు సంస్కృతితో అనుబంధాన్ని కొనసాగించడం. వినడం, మాట్లాడటం, చదవడం, వ్రాయడం అనే నాలుగు ప్రాధమిక బాషా నైపుణ్యాల ద్వారా అన్ని వయస్సుల విద్యార్థులను తెలుగు భాష నేర్చుకునేలా, వాడుక భాషగా తమ తల్లితండ్రులతో, తాతమామ్మలతో సంభాషించ గలిగేలా ప్రోత్సహించడం. దాదాపు నలభై సంవత్సరాల క్రితం ఒక ఇంటి బేస్‌మెంట్‌లో కొద్దిమంది భాషాభిమానులైన స్వచ్ఛంద ఉపాధ్యాయులతో ప్రారంభమై, కొన్ని బాలారిష్టాలు ఎదుర్కొన్నా, 2005 వ సంవత్సరం లో ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్ సభ్యులు సౌజన్యం పునఃప్రారంభమై ఇప్పటి వరకూ అప్రతిహతంగా కొనసాగుతోంది. పదిహేను మంది విద్యార్థులతో, సంక్రాంతి పండుగ రోజు పునరుత్తేజితమైన మన తెలుగు బడిలో ప్రస్తుతం నాలుగు నుండి పద్నాలుగు (4-14) సంవత్సరాల బాలలు ఎనభై కి (80) పైగా విద్యార్థులుగా కొనసాగుతున్నారు. ఇంత మంది విద్యార్థులకు తరగతుల వారీ తెలుగు నేర్పడానికి పదిహేను మంది వరకూ స్వచ్ఛంద ఉపాధ్యాయులు ఫలాపేక్ష లేకుండా నిరంతరం కృషి చేస్తున్నారు.

బోధనా సౌలభ్యం కోసం, పిల్లల వయస్సు, స్థాయి ని బట్టి ఎడ్మంటన్ తెలుగు బడి తరగతులుగా విభజించబడి నిర్వహించబడుతోంది. కోవిడ్ మహమ్మారి దరిమిలా, 2020 నుండి రెండు అంతర్జాల మాధ్యమ తరగతులు (ఆన్లైన్ క్లాసెస్) కూడా ప్రతిభావంతులైన గురువుల సహాయంతో విజయవంతంగా నడుస్తున్నాయి. విద్యార్థులు మరియు తల్లిదండ్రుల విలువైన సూచనల ఆధారంగా ప్రతి గ్రేడ్‌కు సంబంధించిన పాఠ్య ప్రణాళిక క్రమం తప్పకుండా సమీక్షించబడుతుంది. అంతే కాకుండా, పట్టభద్రులైన విద్యార్థులకు సహాయక ఉపాధ్యాయులుగా సేవలందించే అవకాశం కూడా లభిస్తుంది. తద్వారా మాతృభూమికి మాతృబాషకు దూరమైన సహాధ్యాయులకు తెలుగు నేర్చుకోవడం లో సహకరించడం లో వారు తమ వంతు సాయాన్ని అందించేలా ప్రోత్సహిస్తూ, ఒక స్వయంచాలిత నిర్మాణాత్మక ఒరవడికి తెలుగు బడి నాంది పలికింది.

ఎడ్మింటన్ తెలుగు బడి తరగతులు ప్రతీ శనివారం మధ్యాహ్నం 3:30 PM నుండి 5:30 PM వరకూ అల్బెర్టా హిందీ పరిషత్ వారి ప్రాంగణంలో నిర్వహించబడుతున్నాయి.

తరగతి ముగింపులో సుమారు 30 నిమిషాలు పాఠశాల-సమావేశ సమయం ఉంటుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు భాషలో తమ ఆలోచనలు పంచుకోవడం, కవితలు, కథలు చెప్పడం, ఇంకా మన సంస్కృతి మరియు వారసత్వం యొక్క ప్రాముఖ్యతను ఉపాద్యాయుల నిర్దేశకత్వంలో చర్చిస్తారు . ఇట్టి కార్యక్రమాలు విద్యార్థుల్లో భావ ప్రకటనా నైపుణ్యాలు మరియు నాయకత్వ లక్షణాల్ని బహుధా పెంపొందిస్తాయి.

భాషా నిపుణత, సత్ప్రవర్తన, క్రమం తప్పకుండా తరగతులకు హాజరు అయ్యి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వార్షిక పట్టభద్రుల వేడుకలో పురస్కారాలు అందజేయబడతాయి. అదేవిధంగా, విద్యార్థులతో తమ అనుభవాలను, తెలుగు భాషా జ్ఞానం పంచుకోవడానికి ప్రత్యేక అతిథులను ఆహ్వానించడం మన ఎడ్మంటన్ తెలుగు బడి లో ఒక ఆనవాయితీగా కొనసాగుతోంది. ఎడ్మంటన్ తెలుగు బడి చిన్నారులను తమ వారసత్వ మూలాలైన సంస్కృతీ సంప్రదాయాలను మాతృబాష అయిన తెలుగుతో అనుసంధానించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. పాఠ్య ప్రణాళిక తో పాటు-కథలు, పాటలు, నృత్యాల ద్వారా విద్యార్థులకు చిన్న వయసునుంచే తెలుగు భాషాభ్యాసం సరళతరం చేయటం తెలుగు బడి ప్రాధాన్యతాంశం. గురువుల ప్రోత్సహం తో విద్యార్థులు అష్టావధానం, ఏకపాత్రాభినయం లాంటి విభిన్న కార్యక్రమాలలో పాల్గొనడం తో పాటు, మట్టితో వినాయకుడి విగ్రహాలు తయారు చేయడం, ముగ్గుల పోటీలు వంటి సరదా కార్యకలాపాల్లో యెంతో ఉత్సాహంతో పాలుపంచుకోవడం ఎంతైనా అభినందనీయం.

అంతే కాకుండా తెలుగు బడి విద్యార్థులు ఏటా భక్త రామదాసు ఆరాధనలోను, అన్నమాచార్య ఆరాధనలోను ప్రాతినిధ్యం వహిస్తూ ఎంతో ఉత్సాహంగా కీర్తనల్ని, భక్తి గీతాల్ని ఆలపించి తలిదండ్రులను అలరిస్తున్నారు. మనదైన బాషా వారసత్వాన్ని కాపాడుకుని, నిరంతరాయం గా పోషించడంలో ఇది మన బాల, యువ విద్యార్థులు మరియు గురువుల నిరంతర సాధనకు నిదర్శనం.మన ఎడ్మింటన్ తెలుగు బడి 2007–2008 విద్యా సంవత్సరం నుండి ఇంటర్నేషనల్ హెరిటేజ్ లాంగ్వేజ్ అసోసియేషన్ (IHLA) సభ్య సంస్థగా కొనసాగుతోంది. మన మాతృభాషను భవిష్యత్ తరాల కోసం సజీవంగా ఉంచేందుకు చేస్తున్న ఈ అచంచల ప్రయత్నం మన తెలుగు బడికి కెనడా లో ఒక ప్రత్యేక గుర్తింపు ని తీసుకొచ్చింది అనటం లో ఎలాంటి సందేహం లేదు.

మీ అందరి నిరంతర సహకారంతో, ఎడ్మాంటన్ తెలుగు సమాజానికి (TCAE) బాషా ప్రయుక్త కళలు మరియు సంస్కృతిక అనుబంధాన్ని కొనసాగించడంలో మన తెలుగు బడి ఇదేవిధమైన నిబద్ధతతో మరింత ముందుకు సాగుతుందని మా- మనందరి విశ్వాసం.

మరిన్ని వివరాలకు సంప్రదించండి:

Dr.Praveen Baradi:
praveenbaradi@hotmail.com

Vivek Vemula:
vvivekanand@hotmail.com

# సాహితీ సభలు 2,3




# Sahitee Sabha 2,3

# ది ఆర్టిస్ట్

**- సత్య ఆదిత్య చేబోలు**

మధు హడావిడిగా రెడీ అవుతోంది. క్యాబ్ డ్రైవర్ ఇంకా అయిదు నిమిషాల దూరంలో ఉన్నాడు. మధు అమ్మ ఇంకా టిఫిన్ బ్యాగ్ సర్దుతోంది.

"అమ్మా, టైమ్ అవుతోంది. త్వరగా రెడీ అవ్వు. ఆర్ట్ ఎగ్జిబిషన్ తొమ్మిది గంటలకల్లా మొదలవుతుంది. ఎంతో కష్టపడి వి.ఐ.పి టికెట్ తీసుకున్నాను."

"ఎప్పుడైనా కాలేజీకి ఇంత త్వరగా రెడీ అయ్యావా? సినిమాలకి, షికార్లకి మాత్రం ముందుంటావు!"

"అమ్మా, మనం వెళ్తున్నది ఫేమస్ ఆర్టిస్ట్ 'ఇరహల్' షోకి. ప్రపంచంలో ఎంతో ప్రముఖ ఆర్టిస్ట్ ఆయన. మోంట్రియల్‌కి వచ్చారు. ఎలాగైనా కలవాలి మనం. పదమ్మా, లేదంటే క్యాబ్ అతను వెళ్ళిపోతాడు." కంగారుగా మధు, ఆమె తల్లి క్యాబ్ ఎక్కారు.

"అయినా మధు, ఇంత డబ్బు ఎందుకు ఖర్చు చేశావు? టీవీలో చూసేద్దామనుకుంటే కదా!"

"అమ్మా, ఈ పెయింటింగ్స్ విలువ నీకు తెలియదు. ఇరహల్ గారు వేసిన ఎన్నో చిత్రాల్లో ఆయనకు చాలా ఇష్టమైన కలెక్షన్ ఇదట. ఇప్పటివరకు ఇవి బయట ప్రపంచానికి చూపించలేదట. ఈ మధ్య ఎందుకో మనసు మార్చుకుని ఈ షోకి ఒప్పుకున్నారు."

"ఓహో, అవునా? సరే చూద్దాం ఆ కళాఖండాల్ని. ఈ కాలం బొమ్మలన్నీ పిచ్చి గీతల్లాగానే ఉంటాయి."

మాట్లాడుకుంటూ షోకి చేరుకున్నారు. లోపలికి వెళ్లేందుకు పెద్ద లైన్ ఉంది. ఎక్కువగా యువతీయువకులే కనిపించారు. వి.ఐ.పి టికెట్ ఉండటంతో నేరుగా లోపలికి వెళ్లగలిగారు.

"అమ్మా చూడు, ఎంత అందంగా ఉన్నాయో పెయింటింగ్స్! ఒక అమ్మాయి కళ్ళు… ఆ కళ్లలో ఇంకో చిన్న బొమ్మ ఉంది. ఎవరో అమ్మాయి సముద్రం వైపు చూస్తోంది."

"అవునే, చాలా బాగున్నాయి."

"ఈ బొమ్మ చూడమ్మా, అదే అమ్మాయి దూరంగా నవ్వుతున్నట్టు ఉంది."

"అవును మధు. ఈ బొమ్మ చూడు, ఆ అమ్మాయి చెవిపోగులు సరిచేసుకుంటోంది."

"నిజమే అమ్మా! ఈ బొమ్మలో పాదాలు ఎంత అందంగా ఉన్నాయి. పట్టీలు కూడా ఒక కాలుకే వేసుకుంది."

అది చూసి ఒక్కసారిగా ఆ చిత్రాన్ని చూస్తూ నిలిచిపోయింది మధు తల్లి.

"అమ్మా, ఈ బొమ్మలన్నీ చూస్తే ఒక అమ్మాయి సముద్ర తీరంలో ఉన్నప్పుడు కలిగిన భావాల్లా ఉన్నాయి కదా?"

"నిజమే మధు. చాలా గొప్ప ఆర్టిస్ట్ అనిపిస్తున్నారు."

"నేను చెప్పలేదా! లోపల ఇంకా ఒక పెద్ద పెయింటింగ్ ఉందట. పద చూద్దాం."

అని ఇద్దరూ మరో రూమ్‌లోకి వెళ్ళారు.

"చూడు అమ్మా, ఎంత అందంగా ఉంది! ఒక అమ్మాయి నవ్వుతున్న చిత్రం. ఆమె నవ్వు చూస్తే ఎలాంటి కష్టమైనా మర్చిపోవచ్చనిపిస్తోంది."

మధు తల్లి మౌనంగా చూస్తూ నిలిచిపోయింది.

“కానీ అమ్మా !! ఈ ముఖం ఎక్కడో చూసినట్టు ఉంది. ఆమెను చూస్తుంటే, నువ్వు యువతిగా ఉన్నప్పుడు ఇలాగే ఉంటావేమో అన్నట్టు ఉంది” అని అన్నది మధు. కానీ మధు తల్లీ అక్కడ లేదు, మధు ఆమె తల్లిని వెతుక్కుంటూ వెళ్ళింది. అక్కడ చూసేసరికి, “మేడం మీరు లోపలకి వెళ్ళకూడదు, సార్ రెస్ట్ తీసుకుంటున్నారు” అని ఒక సెక్యూరిటీ గార్డ్ మధు తల్లిని ఆపుతున్నాడు.

“ఏమైంది అమ్మా, ఇక్కడికి వచ్చావు, నీ గురుంచి ఎంత వెతికానో తెలుసా?”

“మధు, ఆ ఆర్టిస్ట్ ని ఒకసారి చూడాలి, ప్లీజ్ ఒక్కసారి అడుగు”

ఇంతలో లోపలికి రమ్మని ఎవరో చెప్పారు ఆ సెక్యూరిటీ గార్డ్ కి. వెళ్లి చూసేసరికి మధు తల్లి ఎంతో ఆశ్చర్యంతో “మధుసూదన్, నువ్వా, ఎలా ఉన్నావ్, అసలు ఇన్నేళ్లు ఎక్కడున్నావ్”

“లహరి, ఓహ్ మై గాడ్, వచ్చావా, ఇది నిజామా? కలా?” అని కన్నీరు మున్నీరు అయ్యారు ఇరహల్.

మధు అయోమయం లో చూస్తోంది ఇద్దరిని.

“మధు ఇలా రా, ఈయన మధుసూదన్ గారు, నా మొదటి ప్రేమ, మీ నాన్నతో పెళ్లికాకముందు, నేను వైజాగ్ లో ఉండేదాన్ని కదా, అక్కడ పరిచయం, ఎన్నో సంవత్సరాల తర్వాత చూసాను”

“హలో, మధు, గ్రేట్ టు సి యు”

మధు ఏమని అనాలో తెలియక, మొహమాటంగా నవ్వుతూ నిలుచునుంది.

మధుసూదన్ ఇంకా లహరి చాలా సేపు మౌనం తరువాత, మాట్లాడుకున్నారు.

“ఇన్ని ఏళ్ళలో, నన్ను ఒక్కసారైనా కలవాలని అనిపించలేదా, మధుసూదన్?, అనుకోకుండా విదేశాలకు వెళ్లిపోయావ్, ఒక్క మాట లేదు తర్వాత”

“లహరి, నిన్ను మొట్టమొదటి సారి, బీచ్ లో చూసాను, నీకంటే అందమైనది ప్రపంచం లో ఏది లేదు అనిపించింది, కన్ను అర్పకుండా చూస్తూనే ఉండాలని అనిపించింది, నేను ఎలాగైనా నీతో జీవితం గడపాలని అనుకొని, నీకు ఏ కష్టం రాకుండ చూసుకుందాం అని విదేశాలకు వెళ్ళాను. ఎన్నో ఉత్తరాలు రాసాను, ఒక్క దానికి సమాధానం రాలేదు, ఇండియా కి ఒచ్చి చూసేసరికి నీకు పెళ్లి కూడా అయిపొయింది”

“మా నాన్న, బొమ్మలు వేసుకునే వాడు నిన్ను ఏమి పోషిస్తాడు అని మన ప్రేమని ఒప్పుకోలేదు, అందుకేనేమో ఒక్క ఉత్తరం కూడా నాకు అందనివ్వలేదు, బలవంతం గా పెళ్ళి చేశారు, పెళ్ళి మాత్రమే చేశారు, కానీ నీ ఆలోచనలకు దూరం చెయ్యలేక పోయారు. నా అదృష్టానికి అర్ధం చేసుకునే భర్త రావడం వల్ల నా జీవితంలో కాస్త మార్పు వచ్చింది”.

“నీకు పెళ్ళి అయ్యాక నువ్వు బెంగళూరులో ఉన్నప్పుడు కూడా నిన్ను దూరంగా చూసాను, నువ్వు మీ పాపని ఆడిస్తున్నావు, ఇంక నీకు నా అవసరం లేదు అని దూరం అయ్యాను. నువ్వు కెనడా లో ఉన్నావని తెలిసింది, ప్రతీ ఊరులోనూ నా షో పెట్టి, నా రూమ్ లో ఉండే ఈ బొమ్మను ప్రపంచానికి చూపిద్దాం అని అనుకున్నాను. నా అదృష్టానికి నువ్వు రెండవ షో కే కనిపించావు.
లహరి, నేను ఎక్కడికెళ్ళినా, ఏ గ్యాలరీలో నిలబడ్డా, నీ ముఖమే నా ముందు ఉంటుంది. నా బ్రష్ మీద రంగులు మారినా, నా మనసులో మాత్రం ఒకే బొమ్మ అది నువ్వు. జీవితం మొత్తం

నేను నీ కోసం గీసాను, కానీ ఇవన్నీ నీకు చేరని ఉత్తరాల్లానే మిగిలిపోయాయి.

ఇప్పుడు మిగిలింది జ్ఞాపకాలే, అవే నా సంపద. ఈ చివరి రోజుల్లో, నీ నవ్వు ఒకసారి చూడగలిగానంటే, ఇది నా అదృష్టమే"

"ఆఖరి రోజులు ఏమిటీ మధుసూదన్?"

"నాకు ఇంక ఎక్కువ సమయం లేదు, లహరి, కానీ నా జీవితానికి ఇంక చాలు, థాంక్స్ టు మధు, నిన్ను చూసే అవకాశం వచ్చింది, మై లైఫ్ ఈస్ కంప్లీట్ నౌ "

ఆ మాట విని లహరి కళ్ళలో నీళ్లు తిరిగాయి. "జీవితంలో ఇంకోసారి నిన్ను చూస్తా అని అనుకోలేదు మధుసూదన్, చూసాను, మళ్ళీ దూరం అవుతున్నావు"

"బాధ పడద్దు లహరి, టుడే ఈస్ ద బెస్ట్ డే అఫ్ మై లైఫ్, నాతో డిన్నర్ కి వస్తావా " అని అన్నాడు మధుసూదన్.

"నేను వస్తా కానీ, ఈ, ఇరహల్ ఎవరు, నేను మధుసూదన్ తోనే వస్తాను"

"లహరి, నీ పేరు ఇంగ్లీష్ స్పెల్లింగ్ ఏంటి? Lahari దాన్ని మలుపు తిప్పు, irahal ( ఇరహల్ ). నువ్వు, ఆ బీచ్ లో నా జీవితాన్ని మొత్తం నీ వైపు తిప్పావు, అందుకే నేను నీ పేరుని తిప్పి పెట్టుకున్నాను "

ఆ మాట విని ఇద్దరూ నవ్వుకున్నారు, మనసులో ఎంత బాధ ఉన్నా. మధు దూరంగా వారిని చూస్తూ, తన తండ్రి పోయాక లహరి నవ్వటం, మరియు ఆమె మొహం లో వెలుగు చూసి ఆనందించింది.

## ఋతురాగం

**- రాజు గాదిరాజు**

ఆదివారం ఉదయం. ప్రకృతి కాంత స్నానమాడి తన తడి ఆరని సిగ విరబోసినట్టు చినుకులతో ఆ వర్ష కాలపు ఉదయం ముసిరి పోయి.. మురిసి పోతున్నట్టు వుంది. ఆకాశ వీధిన మేఘదొంతరల సబ్బు నురగల మద్య జారిపోతానేమో అన్నట్టు సూరీడు నెమ్మదిగా తన రథాన్ని పోనిస్తున్నాడు. సమయం ఏడున్నర అయినా ఇంకా ఆ వాతావరణం- చలి దుప్పటి కప్పుకుని చీకటిని కళ్ళలో నింపుకుని మేలుకోవటం ఇష్టం లేనట్లు మగత నిదర లో జోగుతోంది. ఆ ఇంటి కప్పుపై చినుకులు ఆ వర్షా కాలపు సుప్రభాత సంగీతానికి తాళం వేసినట్టు పడుతున్నాయి. కిటికీలోంచి చల్లటి గాలి, మట్టి సువాసనతో కలిసి గదిలోకి దూసుకొస్తోంది. మంచం మీద, ఒకరినొకరు అల్లుకుపోయి నిద్రపోతున్న ఆ జంటకు ఆ వర్షం ఓ లాలిపాటలా వినిపిస్తోంది.

"ఇంకా ఎంత సేపు నిద్రపోతావ్? తెల్లారింది కదా!" తను లేవకుండా ఆమెను పొదుముకుంటూనే నిద్ర లేపాలి అనే అతని ప్రయతనం ఒక విరోధాభాసం. "అబ్బా... నీ నోరు ఒకటి అంటుంది.. చేతులు ఇంకోటి చేస్తున్నాయి.. ఏమి వినాలి.." ఆమె నిద్ర లో కలవరిస్తున్నట్టు అంది. అంటూనే ఇంకా దగ్గరగా జరిగింది. ఇప్పుడు ఆ మెత్తని దుప్పట్లో ఇంకొక ఇద్దరు సౌకర్యం గా పడుకునేంత చోటు వుంది.

"కాఫీ".. దాహం, అన్నంత ఆర్తి గా అడిగాడు. ఆమె నవ్వింది. బయట వాకిట్లో ఒక గులాబీ మొగ్గ చినుకు ముత్యాల్ని విదిలించుకుంటూ తన పూరెక్కల్ని విప్పార్చింది. ఆమె నవ్వుతూనే కను రెప్పల్ని కొద్దిగా తెరిచింది. ఆ నవ్వులో కొత్తగా ప్రేమలో పడిన అమ్మాయి సిగ్గు, సంతోషం కలగలిసి ఉన్నాయి. "అదేంటి, నువ్వు లేచి కాఫీ పెట్టి తీసుకొస్తేనే కదా నా రోజు మొదలయ్యేది!"

"ఈరోజు ప్రతి రోజు కాదు" అతను ఆమె నడుము చుట్టూ చేయి వేసి మరింత దగ్గరగా లాక్కున్నాడు.

"అబ్బో! అంత అదృష్టం నీకెక్కడిది?" ఆమె అతని ఛాతీపై తల ఆనించి, అతని గుండె చప్పుడు వింటూ కళ్ళు మూసుకుంది. "టప్.. టప్.. లబ్.. డబ్".. బయట కురుస్తున్న వర్షం, లోపల వారి హృదయాల లయ ఒక్కటైనట్టు అనిపించింది. కొద్దిసేపటికి, ఇద్దరూ లేచారు. చిన్నపాటి వాదనలు, ఒకరిపై ఒకరు విసుర్లు, కానీ ప్రతి మాటలోనూ, ప్రతి చూపులోనూ అంతులేని ప్రేమ. ఆమె వంటగదిలో అడుగుపెట్టగానే, అతను వెనుక నుండి వచ్చి ఆమె నడుము చుట్టూ చేతులు వేసి, ఆమె మెడపై తన గడ్డం ఆనించాడు. "ఏంటిది? వంట చేయనివ్వవా?" ఆమె నవ్వుతూ అంది. "వంట పని నువ్వు చూడు, వంటి పని నేను చూస్తాను." అతను ఆమె జుట్టులోకి ముఖం దూర్చి గట్టిగా పీల్చాడు. ఆమె సిగ్గుపడి, అతని చేతులను విడిపించుకుని, "పొద్దున్నే ఈ అల్లరి ఏంటి?" అంది. "నీది విసుగు.. నాది వ్యామోహం!" అతను ఆమె చెవిలో గుసగుసలాడాడు.

రోజు గడిచింది. వర్షం తగ్గుముఖం పట్టింది. సాయంత్రం, వాళ్ళిద్దరూ వరండాలో కూర్చుని, తడిసిన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్న చిన్న గొడవలు, వాటి వెనుక ఉన్న ప్రేమ, దైనందిన కష్టాలు, నిష్ఠూరాలు, వాటిని కలిసి ఎదుర్కొన్న ధైర్యం... అన్నీ వారి బంధాన్ని మరింత దృఢంగా చేశాయి. ఆమె అతని భుజంపై వాలి, అతని చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లగా నిమిరింది. అతని స్పర్శలో, ఆమెకు ఎప్పటికీ కొత్తదనం, భద్రత కనిపించాయి.

రాత్రి, భోజనం తర్వాత, ఇంటి నిశ్శబ్దం వారిద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత ఘాడం గా మార్చింది. దీపాలు ఆర్పేసి, మంచంపై ఒకరినొకరు హత్తుకుని పడుకున్నారు. బయట చిరుజల్లులు, లోపల వారి గుసగుసలు. అతని వేళ్ళు ఆమె జుట్టులో మెల్లగా కదులుతున్నాయి. ఆమె అతని ఛాతీపై తలపెట్టి, అతని శ్వాసను తన శ్వాసలో కలుపుకుంది. వారి స్పర్శలో, వారి కళ్ళలో, వారి మాటల్లో... కొత్తగా ప్రేమలో పడిన లాంటి ఉద్వేగం, ఆరాటం. కాలం వారిపై ఎలాంటి ప్రభావం చూపలేదని ఆ క్షణం స్పష్టమైంది. ఆ రాత్రి, వారికి కేవలం వర్షం, వలపు మాత్రమే తోడు.

మరుసటి రోజు ఉదయం. ఇంకా తెల్లవారలేదు. ఇద్దరూ ఒకరినొకరు హత్తుకుని గాఢ నిద్రలో ఉన్నారు. అప్పుడే, ఫోన్ మోగింది. పదే పదే మోగుతుంటే, అతను విసుగ్గా చేయి చాచి ఫోన్ తీసుకున్నాడు. "హలో... ఏంట్రా, పొద్దున్నే ఫోన్ చేశావ్? ఇంకా నిద్రపోతున్నాం కదా!"

"అదేంటి నాన్నా, ఇంకా నిద్రపోతున్నారా? ఈ రోజు మీకు 45 వ పెళ్లి రోజు కదా? పార్టీకి ఏర్పాట్లు చేయాలి కదా!" అవతలి వైపు నుండి వాట్సాప్ కాల్ స్పీకర్ లో అమెరికాలో ఉన్న వారి మధ్య వయస్కుడైన కొడుకు గొంతు వినిపించింది.

ఆ మాటలకు, ఇద్దరూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకున్నారు. వారి పెదవులపై చిరునవ్వు. అవును, వారికి 45 వ పెళ్లి రోజు. కానీ, వారి ప్రేమకు మాత్రం ఇంకా నిన్ననే పెళ్ళైనంత కొత్తదనం. కాలం వారిని వృద్ధులను చేసినా, వారి హృదయాలు మాత్రం ఇప్పటికీ యవ్వనంగా, ప్రేమతో నిండి ఉన్నాయి. కాలంలో ప్రవహించే ఋతువులు వారి జీవితానికి కొత్త శోభల్ని అలకంరించి వన్నె తెచ్చాయి తప్ప వార్ధక్య సంకెలలు బిగించలేదు.

మానవ జీవితానికి ప్రకృతి అల్లిన- కలిమి లేముల, కష్ట సుఖాల జీవన హారానికి ఆలూమగల శృంగారం అంతఃసూత్రం, అనురాగమే ఋతురాగం.


# ఐసీఐసీఐ బ్యాంకు వారు నిర్వహించిన పిల్లల వర్క్‌షాప్




## ICICI Bank kids workshop on Banking

## మహా శివుని సంసారం కకావికలు అయ్యింది
## - పైడికొండల గీతానాథ్, కుమారి

శుభోదయం , పిల్లలందరూ యిపుడు మనమందరము ఒక చిన్న కథ విందాము!



మనకుటుంబం - మహాశివుని కుటుంబము : సారూప్యాన్ని చూద్దామా !!

మన కుటుంబంలో ఎవరుంటారు? అమ్మ, నాన్న, అన్న, చెల్లి, తమ్ముడు, తాత, అమ్మమ్మ, నానమ్మ అనుకుందాం. మరి శివుని కుటుంబంలో ఎవరున్నారు?

మహాశివుడు-కుంటుంబ పెద్ద, ఆయన ఆభరణాలు- పాములు, రుద్రాక్షలు, విభూది, చంద్రుడు, కొన్ని ఆయుధాలు. శివుని వాహనం ఏమిటి ?, నంది (ఎ)ద్దు- అది వాళ్ళ ఫామిలీ వెహికల్.

పార్వతీ దేవి-అమ్మ, ఆభరణాలు- చక్కని పట్టుచీరలు కట్టుకుంటుంది, వజ్రాల కిరీటం పెట్టుకుంటుంది. బోలెడు నగలు పెట్టుకుంటుంది. అమ్మ వాహనం ఏమిటి? సింహము. అమ్మ పర్సనల్ వెహికల్ అన్నమాట. రాక్షసులని చంపాలంటే, అమ్మ సింహంమీదే యుద్ధానికి వెళుతుంది.

అమ్మ ఒడిలో ఎవరూ? గణేశుడు, పెద్దఅబ్బాయి. చక్కగా వజ్రాల కిరీటం పెట్టుకొని , మంచి పట్టు బట్టలు కట్టుకొని, లడ్డులు తింటూ హ్యాపీగా ఉంటాడు. మరి, ఈయన వెహికల్ ఏమిటి ?, ఎలుకండోయ్, ఎందుకని?, సేఫ్టీ కోసం, అసలే ఆయనిది భారీ కాయం. ఎలుక నెమ్మదిగా వెళుతుంది, బరువు మోస్తుంది. చక్కగా అదికూడా లడ్డూలు తింటుంది, దిక్కులు చూసుకుంటూ నెమ్మదిగా వెళ్ళవచ్చు. సేఫ్టీ ఎక్కువ, ఖర్చు తక్కువ.

పక్కన నిలిచింది ఎవ్వరు?- చిన్న అబ్బాయి, కార్తికేయుడు. ఈయన స్పీడు, స్పోర్ట్స్ కారు కావాలన్నాడు. శివుడు కైలాసంలో దొరకదుకదా, అని నెమలిని కొనిపెట్టాడు. అది ఫ్లైయింగ్, బ్యూటిఫుల్ బర్డ్. మిగిలివారు-శృంగి, భృంగి, సేవాగణాలు.

మరి, యిలా చక్కగా సంసారం గడిచిపోతూఉంటే, శివుడికి ఫామిలీ ఫోటో దిగాలని పించింది. భూలోకంలో ఉన్న భక్తులకు మన లేటెస్ట్ ఫామిలీ ఫోటో పంపుదామని అనుకున్నాడు. వెంటనే ఫామిలీని అంతా చక్కగా నగలన్నీ పెట్టుకొని ముస్తాబై, పైనున్న ఫోటో మాదిరి అంతా రెడీగ కూర్చోవాలి, అని కమాండ్ జారీ చేసాడు. ఆందరు చక్కగా ముస్తాబై, నీటుగా కూర్చున్నారు. ఫోటోగ్రాఫర్ కూడా రెడీ

అయిపోయాడు. వినాయకుడు మాత్రం, తన లడ్డూల ప్లేటు కూడా తెచ్చుకుని కూర్చున్నాడు.
మరి అయ్యలందరు వస్తే, వారి వాహనాలు ఉరుకొంటాయా?. అవ్వన్నీ కూడా వచ్చేసాయి. ఎద్దు, సింహం ఎదురుగా కింద కూర్చున్నాయి. నెమలి కార్తికేయుడు పక్కనఉన్న పిట్టగోడ ఎక్కింది. ఎలుక వినాయకుడి పాదాల దగ్గర కిచ కిచ లాడుతూ కూర్చొంది. ఫోటో రెడీ 1 -2 -3 , అనేటప్పటికి వినాయకుడు లడ్డు నోటిలో వేసుకున్నాడు. మరి యిక్కడే, మహాశివుడి కొంప కొల్లేరవ్వబోయింది- ఎలాగ అనుకొంటున్నారా ?. చూడండి!

గణేశుడు చేతిలో లడ్డు పాత్ర క్రింద పెట్టగానే, ఎలుక లడ్డుకోసం ప్లేటులోకి దూకింది. ఎలుక ఎప్పుడైతే కదిలి దూకిందో , పాము ఎలుకని పట్టుకోవాలని పరుగెత్తింది. దానితో నెమలి పాము ని తిందామని ఎగిరింది. యిదేసందు అని సింహం పంజా ఎత్తి, ఎద్దుని కొట్టబోయింది, అందుకని ఎద్దు పరుగు పెట్టింది. శివుడి కొంప కొల్లేరవ్వబోయింది. మహాశివుడికి విపరీతమైన కోపం వచ్చింది . వెంటనే కొమ్ము బూర ఉది "అటెన్షన్,, అటెన్షన్ ", అని గట్టిగా "ఎవెర్బడి ఫాల్ ఇన్ లైన్" అని అరిచాడు.

అందరు బిక్కు బిక్కుమంటూ వచ్చి అటెంషన్లో నిలుచున్నారు. అప్పుడు శివుడు పెరేడ్చుట్టూ గ్రౌండ్ చుట్టూ రెండు రౌండ్స్ వేసి, యిలా కాషన్ యిచ్చాడు.

" చూడండీ! మనము దేవతలము. నేను అన్ని లోకాలకు ప్రభువును. మన ఇంటిలోనే డిసిప్లిన్ లేకపోతె భూలోకంలోని మానవులకు యేమని చెపుతాము. అందుకని మన యింటిలో ఇకనుంచి ఎవ్వరికీ, ఎవ్వరి మీద కోపం, అసూయా, ద్వేషం ఉండకూడదు. ఎవరికి ఎవ్వరు హాని కలిగించరాదు. ఒకరిని ఒకరు ప్రేమించాలి. ఉన్నది కలసి పంచుకోవాలి. అందరూ ఉన్నదానితో తృప్తిపడి ఆనందంగా జీవించాలి. అర్ధమయిందా" అంటూ చెప్పాడు. అందరూ విన్నారు, అలాగేనని ప్రామిస్ చేసారు.

ఆతరువాత అందరూ ఆనందంగా వారికి కేటాయించిన సీట్లో నీటుగా కూర్చొని, చక్కగా ఫోటోకి ఫోజులు యిచ్చారు. శివుడి ఫామిలీ ఫోటో చాలా అందంగా వచ్చింది. అది నాకు శివుడినించి నిన్ననే అందింది. అదే నేను పోస్టుచేస్తే, మనమందరము చూసి ఆనందిస్తున్నాము.
బాగుంది కదా!

యిప్పుడు, మనమందరూ ఆలోచిద్దాము. పరమ శివుని యింటిలోనే వైరుధ్యాలు ఉంటె, మనయింటిలో ఉండవా?, ఉంటాయి. అక్కకు, తమ్ముడికి పడదు. చెల్లికి, అక్కకు పడదు. అక్క టీవీ చూస్తూవుంటే, చెల్లి ఛానల్ మార్చ మంటుంది.అన్న క్రికెట్ చూడాలంటాడు, అమ్మ తన ఫేవరెట్ సీరియల్ చూడాలంటుంది. ఇంతలో తాతయ్య రామాయణ ప్రవచనం వినాలంటాడు, నాన్న ఒక యింటిలో నాలుగు టీవీలు ఎందుకు అంటాడు.

అలాగే వంటల్లో కూడా! అమ్మ పప్పు వండుతానంటే డాడీ చికెన్ కావాలంటాడు. చెల్లి నాకు చికెన్ వాసన పడదు అంటుంది.
అమ్మమ్మ ఈవేళ ఏకాదశి అందారూ ఉపవాసం చెయ్యండి అంటుంది. అలాగే బట్టల సెలెక్షన్స్, నగల సెలెక్షన్స్లో కూడా ఎన్నో- ఎన్నో విభేదాలు ఉంటాయి.

ఈజీవితంలో ఎన్నో విభేదాలు వున్నా కానీ కుటుంబంగా మనమందరం కలసిపోవాలి. ఒకరి మాట ఇంకొకరు వినాలి. ఎందుకు నేనే చేయాలి? అన్న ప్రశ్నకు జవాబు మనందరి కోసం! అన్నది గుర్తుపెట్టుకోవాలి. మన చేతి ఐదు వేళ్ళు సమానంగా ఉండవు. కానీ అవి సమానంగా లేకపోబట్టే మనం పిడికిలి బిగించి పనిని ఒడుపు గా చేయగలుగుతాము. అందుకని మనలో మనకి విభేదాలు వున్నా, మనమందరము కలసికట్టుగా జీవితాన్ని ఎదుర్కొందాము. ఉన్నా ఒకే మాట, ఒకే బాట, ఒకే ధ్యేయం. మనది వసుధైక కుటుంబం. అదే పరమశివుడు చూపిన రీతి, నీతి, వేసిన బాట.

బాలలూ .., ఇకనుంచి "వై, వాట్?" అనే మీ ప్రశ్నలకు "FOR ALL OF US AS A FAMILY " అన్న సమాధానం, మీ అందరి నోటినుండి రావాలి. ఇంతకీ మన కథకు పేరుండొద్దూ?. యేమని పెడదాము?. " శివుని కొంప కొల్లేరయింది". బాగుందా ?, కానీ ఈ విలాసం ఆయన చేసిందంతా, తన పిల్లలందరూ బాగుండాలనే!, వారికి నీతి నేర్పుదామనే!! సత్యం ఏమిటంటే, పరమశివుని సన్నిధిలో అన్ని ప్రాణులు పరస్పర విభేదాలు మరచి పరమ శాంతితో, ఆనందపారవశ్యంలో తేలియాడుతూ ఉంటాయి. "హర హర శంకర, శివ శివ శంకర" "హర హర శంకర, శివ శివ శంకర"

బాగుందా ??

ఆశీస్సులతో, మీ తాతయ్య, అమ్మమ్మ.

## ముహూర్త బలం

**- భుజంగ రావు దన్నపునేని**

"వినరో భాగ్యము విష్ణు కథా" అని ఆపిల్ ఐప్యాడ్ నుండి వస్తున్న మంగళవాద్య స్వర పరిమళం ఆప్రదేశం లో విస్తరిస్తూ ఆహ్లాదం, ఆనందాన్ని పంచుతోంది. విజయ్ తాను నూతన గృహప్రవేశం చేయడానికై కావాల్సిన పూజా సామాగ్రి చేబూని, తన కుటుంబ సభ్యులు, మరియు ఇతర సన్నిహితులతో పాటు ముహూర్తానికి ఇంకా 15 నిమిషముల సమయం ఉండడంతో ఎదురుచూస్తున్నాడు.

విజయ్ కు తాను స్వంత ఇంటి కలను సాకారం చేసుకునే క్రమంలో ఉపయుక్తికరము, ఆసక్తికరమైన అనుభవం స్వంతం అయింది. మొదట తన మిత్రుల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం తన సన్నిహిత మిత్రులలో ఒకరు రియల్టర్ వృత్తిలో ఉన్నాడని తెలిసికొని, అతనిని కలుసుకొని తమ కుటుంబ సభ్యుల ప్రాధామ్యాలు, అవసరాలు మొదలయిన వివరాలు అన్నీ మిత్రుడికి అందించాడు.అతని మిత్రుడు ఉత్తమ వృత్తి నైపుణ్యం కలిగిన రియల్టర్ కావడటం తో అన్ని ఫార్మలిటీస్ చాలా పద్దతిగా నిర్వహించడంతో,చివరికి ఇల్లు తాళం చెవులు విజయ్ వద్దకు చేరాయి. అన్ని వ్యవహారాలు సజావుగా ముగియడంతో విజయ్ ఇక ముహూర్తం వెతికే పనిలో పడ్డాడు.

తనకు తెలిసిన ఒక జ్యోతీష్యుడి వద్దకు వెళ్ళగా ఆ రోజుకు రెండురోజుల క్రితం మంచి రోజు ఉందని చెప్పడంతో, తనకు సహజంగా ఉన్న ప్రాథమిక జ్ఞానంతో తానుకూడా పంచాంగం పరిశీలించాడు.

జ్యోతీష్యుడు సూచించిన రోజు నవమి అవడంతో, సహజంగానే అనుమానం బుర్ర ఉన్న విజయ్ ఆ ముహూర్తాన్ని తిరస్కరించాడు. ఇక అప్పటినుండి ఎవరో ఒక పండితున్ని అడగడం తనకు గురి కుదరక మల్లీ ఇంకొకర్ని అడగడం ఇలా ముహుర్తం వెదకడం ఒక అంతులేని కథగా, నిత్య కృత్యంగా మారింది అతనికి.

చివరికి అతని చిన్న నాటి మిత్రుడు, జ్యోతీష్యంలో దిట్ట అయిన వాసుదేవ్ కి కాల్ చేసి అడిగాడు, ఏదైనా మంచి ముహూర్తం చూడమని. వాసుదేవ్ కు తన మిత్రుడి పరిజ్ఞానం తెలుసు, అంతే కాదు అతడు కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి వేసే రకమని చిన్నప్పటినుండి తెలుసు. అందుకని మిత్రునికి ముహూర్తం చూడటానికి కొంత సమయం పడుతుందని చెప్పాడు.

వాసుదేవ్ రెండు రోజుల తర్వాత కాల్ చేసాడు.ఈ నెల 10 వ తేదీన సాయంత్రం 7.55 నిమిషములకు రేవతి నక్షత్రం, కర్కాటకం లగ్నం లో మంచి ముహూర్తం ఉందని చెప్పాడు. అతనికి ఆ ముహూర్తం ఎందుకు పెట్టాడో తెలుపుతూ వివరాలు ఈ మెయిల్ చేసినట్టు తెలిపాడు. అంతే కాదు తాను ప్రిపేర్ చేసిన ఆన్లైన్ ముహుర్తం క్యాల్క్యులేటర్ లింక్ కూడా అదే ఈమెయిల్ లో షేర్ చేసినట్టు చెప్పాడు.

విజయ్ ఈమెయిల్ ఓపెన్ చేసి చదవటం ప్రారంభించాడు. వేద జ్యోతిషశాస్త్రం పంచాంగం (తిథి, వార, నక్షత్రం, యోగ మరియు కరణం) మరియు లగ్నం యొక్క ఐదు భాగాలను ఉపయోగించి ఒక క్షణం లేదా సంఘటన యొక్క మొత్తం శుభాన్ని నిర్ణయిస్తుంది. ప్రతి మూలకం యొక్క ప్రభావాన్ని భిన్నంగా అంచనా వేస్తారు మరియు తుది విశ్లేషణ కోసం సమగ్ర విధానాన్ని ఉపయోగిస్తారు.ప్రబలమైన శుభ అంశాలు: నక్షత్రం, తిథి మరియు లగ్నాలు చాలా ముఖ్యమైన కారకాలుగా పరిగణించబడతాయి. లగ్నం (లగ్నం) తరచుగా జన్మ చార్టులో అత్యంత ముఖ్యమైన కారకంగా పరిగణించబడుతుంది, ఇది భౌతిక స్వీయ, వ్యక్తిత్వం మరియు మొత్తం జీవిత మార్గాన్ని సూచిస్తుంది.

నక్షత్రం పాత్ర విధి మరియు దశల క్రమాన్ని (గ్రహ కాలాలు) నిర్ణయించడానికి కీలకమైనది.

తిథి (చంద్ర దినం) ఆచారాలకు మరియు రోజువారీ కార్యకలాపాలకు ముఖ్యమైనది, ఇది కొన్ని పనుల అనుకూలతను ప్రభావితం చేస్తుంది.యోగా మరియు కరణం ఖచ్చితత్వం యొక్క పొరను జోడిస్తాయి కానీ సాధారణంగా ఇతర కారకాలకు ద్వితీయంగా పరిగణించబడతాయి.యోగా (చంద్ర-సూర్య కలయిక) రోజు యొక్క సాధారణ నాణ్యతను ప్రభావితం చేస్తుంది. కరణం (అర్ధ-తిథి) సమయాన్ని మరింత మెరుగుపరుస్తుంది కానీ తులనాత్మకంగా తక్కువ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. జ్యోతిషశాస్త్రంలో ప్రబలంగా ఉన్న జ్ఞానం ఏమిటంటే, కొన్ని చిన్న అంశాలు ఆదర్శంగా లేనప్పటికీ, శక్తివంతమైన శుభ కలయికలు సానుకూల ఫలితాలను అందిస్తాయి. అనుకూలమైన భాగాల బలం తప్పనిసరిగా ఇతరముల బలహీనతను "అధిగమిస్తుంది".

ఈ వివరణ,తనకు తెలిసిన జ్ఞానం ముహూర్తానికి సరిపోడం తో విజయ్ సంతృప్తిగా మిగతా పనులు ప్రారంభించాడు.

తానొకటి తలిస్తే , దైవమొకటి తలచినట్టు తాను ఎంతో కష్టం తో పెట్టించిన (పెట్టిన) ముహుర్తాన్ని చూసి తన శ్రీమతి పెదవి విరిచింది. "మంచి ముహుర్తం మీకు రాత్రి పూటే దొరికిందా..!! చక్కగా ఏ సెలవు రోజో ఉదయం పూట జరుపుకుంటే ఎంత బాగుంటుంది. మీ చాదస్తంతో చస్తున్నాం" అని విసుక్కుంది. తనతో ఏ విషయంలోను వాదించి తాను గెలవ లేడు.

ఇంట్లో పోరు పడలేక తన శ్రీమతి కి నచ్చచెప్పడం ఎలా అని ఆలోచిస్తున్న విజయ్ కి ఒక రోజు తన చిన్ననాటి తెలుగు మాస్టారు రాజశేఖర శర్మ గారు గుర్తుకొచ్చారు. ఆయన తెలుగు మరియు సంస్కృతం లో పోస్ట్ గ్రాడ్యుయేట్. అంతే కాదు వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మరియు సాంప్రదాయ క్రతువుల నిర్వహణ లో నిష్ణాతులు. తను చదువుకునే రోజుల్లో మాస్టారు గారు దినమంతా తమ పాఠశాలలో పిల్లలకు విద్యాబోధన చేస్తూ, సాయంత్రం వేలలో తమ ఊరి కోవెలలో ధార్మిక సత్సంగం నిర్వహించేవారు. కాల్గరీ లో తన కొడుకు ఇంటికి విసిటింగ్ కు వచ్చిన ఆయనను కలసి తన సమస్యకు గల మార్గం ఏమిటో అన్వేషించాలని నిర్ణయించుకున్నాడు విజయ్.

విజయ్ తన పక్క ఊరు కాల్గరీ లో ఉన్న మాస్టారింటికి చేరుకొని, గురువుగారికి పాదాభివందనం చేసి, కుశల ప్రశ్నల తర్వాత తన సందేహాలు మాస్టారు ముందుంచాడు.మాస్టారు తల పంకించి చెప్పారు,"ముహూర్త లోపాలు, వాస్తు లోపాలు, క్రియాలోపాలు సవరించేందుకు భగవతుడిని ప్రార్థించటమే సరియైన పరిష్కారం. ఉదాహరణకు, మన పూజ, క్రతువు ఇతర లోపాలను హరించేందుకు చివరలో మనం చదివే మంత్రం 'మంత్ర హీనం, క్రియా హీనం, భక్తి హీనం జనార్దన..' అనే ప్రార్థనలో చెప్పినట్లుగా, చేసిన పూజను దేవుడు పరిపూర్ణం చేయాలని కోరుకుంటాము. ఈ జీవితమే అశాశ్వతం అయినప్పుడు దానిలో వచ్చే గడియలు, విగడియలు శాశ్వతం కావనే జ్ఞానంతో ముందుకు సాగితేనే మంచిది".

తన మాస్టారి బోధన విజయ్ ఆలోచనలో మార్పుతెచ్చి, తన శ్రీమతికి, తనకూ ఉభయ తారకంగా ఉండే కూర్పుతో కార్యక్రమం సుఖాంతం అయింది.

# శ్రద్ధాంజలి

*In loving memory of*



## Smt. Rama Logsetty garu

Mrs. Rama Logsetty Garu passed away on November 19, 2025, leaving a legacy of kindness in India, England, and Edmonton. A devoted mother and grandmother, she was a pillar of the Telugu community and a dedicated volunteer with the Red Cross and Cross Cancer Institute. Known for her welcoming spirit and love for cooking and gardening, she will be deeply missed and forever remembered for her compassionate heart.

## సూట్కేస్ మాయాజాలం

**- కృష్ణ జ్యోతి**

లలిత అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తను ప్రేమించి పెళ్ళి చేసుకున్న ప్రహస్ తో ఇద్దరి పిల్లలతో చక్కటి సంసార జీవితాన్ని గడుపుతోంది. ప్రతీ సంవత్సరం పిల్లల వేసవి సెలవుల్లో ఇండియాకి వెళ్ళి తన అత్తమామలతోను, తల్లితండ్రులతోను గడపడం కోసం సంవత్సరమంతా ఎదురుచూస్తూ ఉండేది. అదే కాకుండా, పిల్లలు గ్రాండ్ పేరెంట్స్ తో గడిపే సమయం ఎంతో విలువైనదని, తను తన అమ్మమ్మ, తాతయ్య లతో గడిపిన క్షణాలు గురించి తాను ఎప్పుడూ తలుచుకుంటూ ఉండేది, తన పిల్లలకి కూడా అదే అనుభవం ఇవ్వాలని కోరుకునేది.

తాను ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. ఇండియా కి కావలసిన షాపింగ్ అంతా ముందుగానే చేసుకుంది. పిల్లలతో వెళుతోంది కాబట్టి కొద్దిగా ముందుగానే ఎయిర్‌పోర్ట్ కి వెళ్ళడం మంచిదని ప్రహస్ అనడంతో కొద్దిగా ముందుగానే ఎయిర్‌పోర్ట్ కి చేరుకున్నారు. పిల్లల తో వాళ్ళ గ్రాండ్ పేరెంట్స్ తో ఎలా మెలగాలో వారికి ఏ రకం గా సహాయపడాలో చెబుతూ వచ్చింది. ఈ లోపు సెక్యూరిటీకి బయలుదేరుతూ, పిల్లలు ఇద్దరూ నాన్నకి హగ్ ఇచ్చి సెక్యూరిటీ లైన్ లోకి వెళ్ళిపోయారు.

ఎయిర్‌పోర్ట్ వాళ్ళు తమ పని తాముచేసుకున్నారు, నెమ్మదిగా ఫ్లైట్ లో కూర్చున్నారు. ఫ్లైట్ నెమ్మదిగా టేకాఫ్ అయ్యింది. పిల్లలు మెల్లగా నిద్రలోకి జారుకున్నారు. లంచ్ ఓ, డిన్నర్ ఓ తెలియకుండా, విమానంలో పెట్టిన భోజనం తిని చివరికి హైదరాబాద్ లో ల్యాండ్ అయ్యారు.

మొత్తానికి బ్యాగేజ్ క్లెయిమ్ బెల్ట్ నంబర్ అనౌన్స్ చేయడంతో, గేట్ దగ్గరికి వచ్చి లలిత బ్యాగ్స్ ని ట్రాక్ చేసుకుంటోంది. చూడబోతే, అన్ని బ్యాగ్ లు ఒకే రకంగా ఉండడం తో ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని బ్యాగ్ లని తీసుకుంది. ఇంక ఒక్క బ్యాగ్ వస్తే సరిపోతుంది. ఈ లోగా చిన్నవాడికి ఆకలి, నిద్ర ముంచుకురావడంతో గోల మొదలు పెట్టాడు. పెద్దవాడు కొద్దిగా ఓపిక తో చివరి బ్యాగ్ ని ట్రాలీకి ఎక్కించాడు.

సెక్యూరిటీ ముగించుకుని, బయటకు వచ్చేసరికి తన బలగాన్ని చూసుకొని కళ్ళు చెమర్చాయి. ఆనందంగా తల్లిదండ్రులని గట్టిగా హగ్ చేసుకుంది. క్షేమ సమాచారాలు మాట్లాడుకుంటూ, కార్ లో ఇంటికి ఎప్పుడు వచ్చేశారో తెలియకుండానే ఇల్లు చేరారు. ఇంటికి వస్తూనే, కొంత ఫ్రెష్ అప్ అయ్యి తను తెచ్చిన సరంజామా అంతా అమ్మా, నాన్నలకి చూపించడానికి తన సూట్‌కేస్ లు ఓపెన్ చేసి చూపించసాగింది. పిల్లల కన్నా ఆత్రుతగా 5 సూట్ కేస్లు ఓపెన్ చేసి అమ్మకి నాన్న కి తెచ్చినవన్నీ చూపించింది. 6వ సూట్ కేస్ ఓపెన్ చేస్తూనే నిర్ఘాంతపోయి, ఆ ముఖంలో చిరునవ్వు ఒక్కసారి మాయమైపోయింది.

తీరా చూస్తే, ఆ సూట్‌కేస్ తనది కాదు. పైగా దానిలో చాలా పర్సనల్ ఫోటోస్ మాత్రమే ఉన్నాయి. ఒక జత ఆడ, మగ మనిషి బట్టలు ఉన్నాయి. ఒక ఎన్వలప్‌లో, కత్తిపోటుతో కూడిన ఫోటోలు, ఒక తుపాకీ కనిపించాయి. ఒక్కసారి గుండె జారినంత పని అయింది.

ఇంకా దానిలో చూడకూడదు అనుకుంటూనే, ఇంకో కార్నర్ లో ఏదో తెల్లటి రంగులో ఉన్న ఒక జిప్‌లాక్ బ్యాగు కనిపించింది. గబాలున సూట్‌కేస్ ని ఒక్క తోపు తోసేసింది.

కొద్దిగా సమయం తీసుకొని, కుదుట పడ్డాక, సూట్‌కేస్ తనది కాదు అని తెలుసు, కానీ ఎవరిదో తెలుసుకోవాలి కదా! అప్పుడు నెమ్మదిగా లలిత బుర్ర పరిష్కారం వైపు ఆలోచించసాగింది. అప్పుడు సూట్‌కేస్ మీద ఎక్కడైనా అడ్రస్ కనిపిస్తుందేమో అని వెతికింది, ఎక్కడా కనిపించకపోవడంతో లలితకి ఏమి చేయాలో తోచక, కళ్ళు తిరిగినంత పని అయింది. అసలు ఈ సూట్‌కేస్ తనకి ఎలా వచ్చిందో, ఎయిర్‌పోర్ట్ వాళ్ళకి రిపోర్ట్ చెయ్యాలో పోలీస్ వాళ్ళకి రిపోర్ట్ చెయ్యాలో ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు తన బుర్రలో మెదలసాగాయి. తను ఇండియా వచ్చిన ఆనందం అంతా ఒక్కసారి ఆ సూట్‌కేస్ తో మటుమాయం అయిపోయింది.

ఈ లోపు తన ఫోన్ కి చాలా బ్లాంక్ కాల్స్ రావడం మొదలుపెట్టాయి. ఎప్పుడు తెల్లవారుతుందా? ఎవరికొకరికి రిపోర్ట్ చేస్తేనే కానీ తన మనసు కుదుటపడదు. ఈలోపు, అమ్మ, నాన్న, ప్రహాస్ తనకి ధైర్యం చెబుతూనే ఉన్నారు. కానీ, తను మాత్రం ఈ లోకంలో లేదు. మనసు అనేక విధాలుగా పోతోంది. ఆ రాత్రే, విమానాశ్రయ అధికారులకు కాల్ చేసింది. వాళ్ళు అనవసరమైన వివరాలు అన్నీ తీసుకున్నారు కానీ, పరిష్కారం చెప్పలేదు.

పోలీస్ వాళ్ళకి కంప్లైంట్ చేస్తే ఇది చాలా పెద్ద కేసు అవుతుందేమో, చక్కగా 10 రోజులు ఫ్యామిలీ తో గడుపుదామని చేద్దామని వస్తే, తనమీద క్రిమినల్ కేసు బుక్ అవుతుందనే భయంతో పోలీస్ దాకా వెళ్ళే ప్రయత్నం చేయలేదు. కాలం గడుస్తూనే ఉంది. ఒక వారం అయిపోయింది తాను ఇండియా వచ్చి, కానీ ఎయిర్‌పోర్ట్ నుంచి ఎటువంటి సమాచారం లేదు. ఎయిర్‌పోర్ట్ కి వెళ్ళినా, వారు ఈ డిపార్ట్‌మెంట్ వాళ్ళు, మాకు సంబంధం లేదు అని ఇంకో ఆఫీసర్, అక్కడ నుంచి ఇంకో ఆఫీసర్ కి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారే కానీ ప్రయోజనం లేకపోయింది. వాళ్ళ రూటీన్ డైలాగ్ తో ఎటువంటి అప్‌డేట్ వచ్చినా మీకు చెప్తాము అని యధావిధిగా విమానాశ్రయ అధికారులు చెప్తూనే ఉన్నారు. 10 రోజులు గడిచాయి. తనకి బ్లాంక్ కాల్స్ రావడం మానలేదు. చివరిగా ఎయిర్‌పోర్ట్ బ్యాగేజ్ సర్వీసెస్ నుంచి కాల్ వచ్చి, ఎవరో తమకు సంబంధించిన సూట్‌కేస్ మిస్ అయినట్లు ఫిర్యాదు చేశారని, వారు ఇచ్చిన వివరాలు ప్రకారం, తన దగ్గర ఉన్న సూట్‌కేస్ లాగే ఉందని కాల్ రావడంతో ఉన్నపళంగా లలిత నాన్న సహాయంతో కార్ తీసుకొని, ఎయిర్‌పోర్ట్ కి వెళ్ళింది.

అక్కడ ఎయిర్ ఇండియా కౌంటర్ దగ్గర ఎవరో వెయిట్ చేస్తున్నట్లు కనిపించింది. పరుగు పరుగున లలిత కౌంటర్ చేరడంతో, యధావిధిగా కౌంటర్ క్లర్క్ వివరాలు తీసుకొని లలిత సూట్‌కేస్ ని వారికి అప్పగించారు. భయం భయంగా తన దగ్గర ఉన్న సూట్‌కేస్ ని అప్పగిస్తూ, సారీ ఇది మా వద్దకు వచ్చేసింది అని చెప్పింది. దానికి ఆ ఎదుటి వ్యక్తి, మేడం భయపడినట్లు ఉన్నారు. మేము ఒక చిన్న షార్ట్ ఫిల్మ్ చేస్తున్నాము దానికి సంబంధించిన ఫోటోలు, డాక్యుమెంట్స్, నకిలీ తుపాకీ దానిలో ఉన్నాయని దానికి సంబంధించిన ఆధారాలు చూపించేసరికి లలిత గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

వాళ్ళ షూటింగ్ ఆగిపోవడంతో వాళ్ళు ఆ పనిలో నిమగ్నమయ్యి, వాళ్ళు ఈ సూట్‌కేస్ గురించే మర్చిపోయినట్లు చావు కబురు చల్లగా చెప్పారు. ఏది ఏమైనా, లలితకి మళ్ళీ మరుజన్మలా అనిపించి, తన సూట్‌కేస్ తను తీసుకుని తిరుగు ప్రయాణం కట్టింది. మళ్ళీ కార్లోకి ఎక్కే సరికి, మళ్ళీ బ్లాంక్ కాల్ వచ్చింది. ఎత్తేసరికి, మాది కోడింగ్ కంపెనీ, మీ అబ్బాయిని క్లాసులకు పంపుతారా? అంటూ అడుగుతూ కాల్ కట్ అయిపోయింది. తనకి ముందర వచ్చిన కాల్స్ చూసుకుంటే, అన్నీ ఈ నంబర్ నుంచి వచ్చినట్లే కనిపిస్తున్నాయి.

అక్కడితో ఊపిరి పీల్చుకొని ఈ కాల్స్ అన్ని యాదృచ్ఛికంగా వచ్చిన మార్కెటింగ్ కాల్స్ అని, తనని కిడ్నాప్ చేయడానికి వచ్చిన కాల్స్ కాదని రిలీఫ్ అయ్యి, తన మనసులో భారం తగ్గి చిన్నగా తన ముఖంలో మళ్ళీ చిరునవ్వు వచ్చింది. ఈ సూట్‌కేస్ పుణ్యమా అని, పది రోజులు గడిచిపోయాయి. మిగిలింది ఇంకొక్క వారం. ఇట్టే గడిచిపోతుంది అనుకుంటూ మిగిలిన సమయాన్ని అత్తమామల దగ్గర పెద్ద విందు పెట్టుకుని మిగిలిన వారం మళ్ళీ సంవత్సరం వరకు గుర్తు ఉండేటట్లు ఈవెంట్స్ పెట్టుకొని, మిగిలిన 1 వారం గడిపేసింది. మళ్ళీ తిరుగు ప్రయాణానికి డేట్ రానే వచ్చింది. ఈ సారి సూట్‌కేస్ లు అన్నీ జాగ్రత్తగా చూసుకొని తీసుకోవాలని గట్టి పాఠం నేర్చుకొని, సూట్‌కేస్ కి బండ గుర్తులు పెట్టి మళ్ళీ అమెరికాకి తిరుగు ప్రయాణం కట్టింది.

## మానవ సంబంధాలపై కృత్రిమ మేధస్సు ప్రభావము

**- లక్ష్మి గోనెళ్ళ**

అది 2045 సంవత్సరము. మాధవికి పొద్దున్నే ఒక్కసారిగా గా ఉలిక్కిపడి మెలుకువ వచ్చింది అలెక్స అరుపులకి “మాధవి, లే లే, సమయము 7:00 గంటలు కావస్తోంది. మీకు 9 గంటలకు మీ బోర్డు అఫ్ డైరెక్టర్స్ తో సమావేశము ఉంది కదా. మీకు రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. నన్ను క్షమించాలి లేపినందుకు" అని అది ఒకటే కూస్తోంది. వెంటనే దాని నెత్తిమీద ఒకటి కొట్టి, మెల్లిగా సౌచాలయం వేపు అడుగులు వేసింది వయసు తో పాటు వచ్చిన కాలి నెప్పులతో.

తాను కాలకృత్యాలు తీర్చుకొని స్నానం చేసి సోని అప్పటికే సిద్ధము గా పెట్టిన ఆఫీస్ డ్రెస్ వేసుకొని కిందకి దిగింది. అప్పటికే ఆమె భర్త ఆనంద్ సోని చేసిన అల్పాహారం తిని ఆఫీస్ కి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు. మాధవి ని చూసి "హలో మాధవి డియర్! ఎలా ఉంది నీకు ఈ రోజు. నిద్ర బాగా పట్టిందా. బ్లడ్ ప్రెషర్ ని చెక్ చేసుకో. ఒకే, మరి నా ఆఫీస్ కి వేళ అవుతోంది సాయంకాలము మాట్లాడుకుందాము" అని చెప్పి తన దగ్గర గుత్తి లో ఎదో మీట నొక్కగానే గారేజ్ లోంచి టెస్లా డ్రైవర్ లేని కారు బయలుదేరడానికి సిద్దము గా ఉంది. ఆనంద్ జి కి మోకాలు నెప్పులు ఉండడము తో ఈ కారు తీసుకున్నాక చాలా సౌకర్యము గా ఉంది ఎలోన్ మస్క్ పుణ్యమా అని.

ఇంతలో సోని మాధవి దగ్గరికి వచ్చింది. సోని ఎవరో కాదండి కృత్రిమ మేధస్సు ద్వారా నిర్మిచబడిన రోబో పని మనిషి.

ఇద్దరు పెద్దవాళ్లయ్యాక పిల్లలు గ్రహాంతర వాసానికి వెళ్ళాక సహాయము కోసం ఈ రోబో ని ఇటీవలే తీసుకున్నారు. చేదోడు వాదోడుగా ఉంటుందని. డైనింగ్ టేబులు మీద అల్పాహారాన్ని సిద్ధము చేస్తూ ఇలా మాట్లాడింది మాధవితో "హలో మాధవి, ఎలా ఉన్నారు ఈ రోజు. ఇదిగో మీ రక్తపోటు బిళ్ళ అల్పాహారం అయ్యాక వేసుకోండి. అన్నట్లు, మీ రక్తపోటు చెక్ చేస్తాను" అంది తన దగ్గర ఒక స్విచ్ నొక్కగానే బీపీ యంత్రము సిద్ధము గా బయటకి వచ్చింది. స్కాన్ చేసి బీపీ బాగా ఎక్కువ అయ్యింది. అందుకే ఈ రోజు మీ డైట్ లో ఇవి చేశాను "హెర్బల్ తేనీరు, ఓట్స్ మీల్, ఫ్రూట్ బౌల్". మధ్యాహ్నానికి "కొర్రల కిచిడి, పెరుగు, రాత్రికి "రెండు పులకాలు, కప్పు కూర" అని ఏమాత్రము భావ ప్రకటన లేకుండా చెప్పింది. మాధవి ఒక సారి దీర్ఘం గా శ్వాస పీల్చి కడుపు నిండా ఇష్టమైనవి తినడానికి కూడా లేదు ఈ సోని వచ్చాక అని మనసులో అనుకుని తినడానికి ప్రయత్నించింది.

ఇంతలో ఎదురుగా గోడ మీద అమర్చిన పెద్ద స్క్రీన్ లో ఆకాష్ "హలో అమ్మ, ఎలా ఉన్నారు. మీ ఆరోగ్యము ఎలా ఉంది" అని ఒక్క అడుగు వేసేటప్పటికీ బెడ్ రూమ్ ల లోంచి వంట గది లోకి వచ్చి పడ్డాడు ఒక్కసారిగా సంబ్రమాశ్చర్యాలతో అటు చూసింది. ఆకాష్ మాధవి ఆనంద్ ల మొదటి బిడ్డ. ఈ మధ్య నే అంగారక గ్రహానికి ఎలోన్ మస్క్ కట్టిన కాలనీ ల లో ఉద్యోగము వచ్చి భార్యా పిల్లలతో బదిలీ అయ్యాడు. "అమ్మ, కంగారు పడకు! అంగారక గ్రహము లో భూమాయాకర్షణ శక్తి భూగోళం కన్నా 38% మాత్రమే ఉంటుంది. అందుచేత ఇక్కడ 100 కేజీల బరువు ఉన్న మనిషి 38 కేజీలు మాత్రమే ఉంటారు. అందుచేత, తేలికగా ఎక్కువ దూరము గాలిలో ఎగురుతూ వెళ్ళగలుగుతారు" అని, ఇంకా అంగారక గ్రహము లో వాళ్ళ జీవన శైలి గురించి చెప్పుకుంటూ వచ్చాడు. ఇంతలో ఆఫీస్ వేళ అవుతుంటే పెద్ద వ్యోమ గాములు వేసుకొనే కోటు వేసుకొని, ప్రాణ వాయువు ట్యాంక్ తగిలించుకొని బయలుదేరాడు బాయ్ చెప్తూ అమ్మకి.

మాధవి మదిలో ఏవేవో ఆలోచనలు పరి-పరి విధాలా ముసిరాయి. తన చిన్నప్పటి పల్లెటూరి రోజులు, ఆ ఆప్యాయతలు అన్ని తలచుకొని ఒక నిట్టూర్పు విడుస్తూ ఏదో తిన్నానని అనిపించి తాను కూడా ఆఫీస్ కి బయలుదేరింది సోనికి ఆదేశాలు చెప్పి. అదండీ మాధవి శుభోదయం 2045 లో నా ఊహ లో. కృత్రిమ మేధస్సు ఎంతో వేగము గా మన జీవితాలలోకి చోర బడి పోతోంది. దాని వలన కొన్ని ఉపయోగాలు ఉన్నప్పటికీ దాని వాళ్ళ కలిగే ముప్పు, అది మానవ సంభంధాలపై చూపే ప్రభావము తలచుకొంటే కొంచెము దిగులు వేస్తోంది కూడా. సరదాగా నా ఊహా ప్రపంచంలో మెదిలిన కథ లాంటి ఈ చిన్న ప్రయతన్నాన్ని చదివి ఆనందిస్తారని ఆశిస్తూ.

# సంక్రాంతి సంబరాలు



# Sankranthi Sambaralu

# సంక్రాంతి సంబరాలు




# Sankranthi Sambaralu

## కాఫీ కబుర్లు – ఇంకంక్లూసివ్

**- మురళి బాబు**

2023 డిసెంబర్ లో మాకు ఆఫీస్ లో క్రిస్మస్ సెలవులు ఇచ్చారు. ప్రతి సంవత్సరం కేవలం 25, 26 మాత్రమే ఇచ్చేవారు ఆ యేటి నుంచి క్రిస్మస్ నుంచి జనవరి 2 వరకు సెలవలు అని చెప్పారు. దానికి కారణం అంటూ పూర్వాపరాలలోకి వెళ్తే ఉద్యోగులకు ఏ విధముగా లబ్ది చేకూరుద్దాం అని మా యాజమాన్యం బాగా ఆలోచించి జీతం పెంచితే ఎక్కడ ఖర్చు పెట్టేసుకుంటారేమోనని సమయం ఇచ్చారు అయినవారితో హాయిగా గడపమని. దాని వల్ల మాకు ఏప్రిల్, సెప్టెంబర్ లో ఒక్కోరోజు మరియు డిసెంబర్ లో ఐదారు రోజులు అదనంగా సెలవులొచ్చాయి. అది విన్నప్పుడు మనసు మరియు మనీ పర్సు రెండూ చెమర్చాయి. సెలవులు ఊరక రావు. అదనపు వ్యయాన్ని వెంటేసుకొని వచ్చి వాటేసుకుంటాయేమో అనిపించింది. సెలవు కాలాన్ని ధనం తో పోల్చుకోకు అని మా వైస్ ప్రెసిడెంట్ సెలవిస్తే, అయన పేస్కేల్ లో ఉంటే ఇలాంటివి ఇంకో పది చెబుతాను అని అనుకొని, అందరితోపాటు 'తప్పట్ల' ఎమోజి ని ఆయాచితంగా క్లిక్ చేసాను. వారానికి రెండు రోజులు సెలవలు ఇప్పటికే ఉండడంవల్ల వాటి విలువ తెలియడం లేదేమో. ఖర్చులు అంటే నాకు గుర్తొచ్చేది ఆగస్టు నెల. నాకు 'ప' గుణింతం పట్టి పట్టి మళ్ళీ నేర్పించేది, పెళ్ళిరోజు, పిల్లల పుట్టినరోజులు, ఆగష్టు 15 సెలవులు ఇలా అన్నీ కలిపి పర్సుని పరమాన్నం చేసినట్టు చేసేస్తాయి.

అలా ఆ డిసెంబర్ సెలవుల్లో ఒకరోజు మధ్యాహ్నం ఎడ్మంటన్ లోని ఒక కాఫీ షాపు కి వెళ్ళాను. బయట మంచు కురుస్తోంది, లోపల కాఫీ పరిమళం. అక్కడ కూర్చుని నా ఫోన్ లో ఒక క్రాస్ వర్డ్ పజిల్ ని పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నాను. సాధారణంగా కాఫీ షాపుల్లో ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉంటారు. కానీ అప్పుడు అప్పుడే ఎక్కిన వ్యక్తి అన్ని సీట్లు వదిలేసి మన పక్కనే కూర్చున్నపుడు ఏవిధమైన భయం, ఆశ్చర్యం వేస్తుందో అలానే అనిపించింది. తలెత్తి తనను చూసాను. నవ్వుతూ "క్రాస్ వర్డ్? " అన్నాడు, చిన్న నవ్వుతో అవునన్నట్టు తలూపాను. ఎన్నో ఆలోచనలు మెదిలాయి, ఒకవేళ ఏమైనా ఇన్సూరెన్సు గూర్చి చెబుతాడేమో, లేక డబ్బులేమైనా అడుగుతాడేమో అని ఇబ్బందిగానే తలెత్తి చూస్తున్నా.

తనే మళ్ళీ అందుకున్నాడు "కాఫీ కోసమే కాదు, నేను ఒక స్నేహితుడు కోసం ఎదురుచూస్తున్నా, మేము వారానికి మూడురోజులు ఇక్కడకొచ్చి Scrabble గేమ్ ఆడుతాము, తను ఎందుకో ఈరోజు రాలేదు ఇంకా".

"ఫోన్ చేయకపోయారా" అని అడిగా. "అది మంచి పద్ధతి కాదు కదా, తను ఏ పనిలో ఉన్నాడో ఏమో?" అని అనగానే నాకు ఒక్క క్షణం ఏమనాలో తెలియలేదు. "పోనీ మెసేజ్ " అని అంటే "ఇట్స్ ది సేమ్" అన్నాడు.

అదే నేనైతే బయలుదేరేముందు ఒకసారి, దారిలో ఒకసారి, అక్కడికి చేరుకున్నాక ఇంకా రాలేదే అని ఒకసారి కాల్ పాటికి కాల్, మెసేజ్ పాటికి మెసేజ్ ఈ తతంగమంతా అలవాట్లైపోయింది. అది ఎందుకనిపిస్తుందో ఏమో, ఆరాటమో, లేక ఊసుపోకపోవడమో. ఆలా వేచి ఉండి, ఆ వ్యక్తి రాగానే నీకోసం ఇంతసేపు ఉన్నాను, టైం చాలా వృధా అయ్యింది అని చెప్పకనే చెప్పేస్తాము.

కానీ తనలో ఆ ఆత్రుత లేదు. ఎదుటివారి సమయాన్ని, వారి ఏకాంతాన్ని గౌరవించే ఆ తీరు నన్ను ఆశ్చర్యపరిచింది.

కాఫీ కప్పు ఖాళీ అవుతున్నా, ఆ వ్యక్తి ఇంకా రాలేదు. అయినా అతని ముఖంలో అసహనం లేదు. "సరే, మరి నేను బయలుదేరాలి" అని నేను లేవబోతుంటే, అతను నవ్వుతూ "ఇట్స్ ఓకే, తను రాకపోతే నేను కూడా కాసేపట్లో వెళ్ళిపోతాను. ఈ నిరీక్షణలో కూడా ఒక అందం ఉంది కదా" అన్నాడు. ఆ మాట విన్నప్పుడు మన కాలానికి మనం ఎంత బానిసలమైపోయామో అనిపించింది. ప్రతి నిమిషానికి లెక్కలు కడుతూ, ప్రతి పనికీ ఒక ఫలితాన్ని ఆశిస్తూ... అసలు ఏమీ ఆశించకుండా కేవలం ఒక స్నేహితుడి కోసం వేచి ఉండటం లోని తృప్తి ని మనం మర్చిపోయామేమో.

అతని పేరు అడగలేదు, అతను ఏమి చేస్తాడో తెలియదు. కానీ ఆ రోజు ఆ 'ఇంకంక్లూసివ్' (ముగింపు లేని) నిరీక్షణ నాకు ఒక కొత్త పాఠాన్ని నేర్పింది. జీవితంలో అన్నిటికీ ముగింపులు, ఫలితాలు అవసరం లేదు. కొన్నిసార్లు ఆ నిరీక్షణే ఒక అనుభవం.

## వికాసం

**- భుజంగ రావు దన్నపునేని**

కిచ్నర్ పట్టణంలోని “ఫెయిర్ వ్యూ” మాల్ లో తన షాపింగ్ ముగించి బయటికి వచ్చాడు మనోజ్. ఆరోజు సామాగ్రి ఎక్కువగా ఉండటం తో తను ఉంటున్న కేంబ్రిడ్జ్ పట్టణానికి వెళ్ళడానికి సిద్ధమై ఊబర్ లో క్యాబ్ బుక్ చేసాడు.కొద్ది నిమిషాల వ్యవధి తర్వాత డ్రైవర్ జస్విందర్ సింగ్ నుండి ”ఐ హావ్ అరైవ్డ్” , అని మెస్సేజ్ రావడంతో, నెంబరు చూసుకొని కారులోకి చేరుకున్నాడు మనోజ్.

క్యాబ్ డ్రైవర్ కు పిన్ చెప్పగానే అతను “ఆర్ యూ గోయింగ్ టూ లిండెన్ డ్రైవ్ ?” అని అడిగి సరిచూసుకొని , కారు ముందుకు నడిపించాడు. ప్రయాణీకుడు భారత సంతతి వాడవడం తో ..డ్రైవర్ జస్విందర్ సింగ్ , మనోజ్ అనుమతి తీసుకొని సంభాషణ హిందీలో మొదలు పెట్టాడు. “ఆప్ ఇండియా మే, కహాసే? ..కిత్ నే సాల్ సే ఇదర్ హై?” (మీరు ఇండియాలో ఎక్కడినుంచి? , ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ ఉంటున్నారు ?) లాంటి ప్రశ్నల తర్వాత వారి మధ్య చర్చ కెనడా దేశంలోని పిల్లల చదువులు తర్వాత వారి ఉద్యోగ అవకాశాలు అనే అంశం వైపు సాగింది.

దాదాపు 50 సంవత్సరాల వయస్సు వాడైన జస్విందర్ తన గురించి చెపుతూ తనకు 25, 23 సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నట్టు , వారు చదువు పూర్తి చేసి, ఉద్యోగాలు చేస్తూ విడిగా జీవిస్తున్నట్టు చెప్పాడు. వారికి కెనడాలోని పిల్లలకు లభించే ఉత్తమ విద్య , సంస్కారం లాంటి వాటికి ఒకింత ఆనంద పడుతూనే, వారు తమనుండి దూరంగా జీవించడం పట్ల విచారం వ్యక్తం చేసాడు.నిజానికి తాను (జస్విందర్) కూడా తన భవిష్యత్తును వెతుక్కుంటూ తల్లిదండ్రులకు దూరంగా వచ్చాననే విషయాన్ని ఒకింత మరిచిపోయి , తన పిల్లలు మాత్రం తనతో ఉండక పోవటాన్ని

ప్రశ్నించటం మనోజ్ సులభంగానే గుర్తించాడు. అప్పుడే తాను కూడా ఒక 5 సంవత్సరాల వయస్సుఉన్న కూతురి తండ్రిగా తనకూతురు భవిష్యత్తు లాంటి విషయాలకు సంబందించిన సందేహాలు, నెమ్మదిగా మనోజ్ మనస్సులోకి చేరుకోవడం మొదలయింది. తన కూతురుకి మంచి భవిష్యత్తు ఏర్పరచడమే కాక, తమ పూర్వీకుల విలువలు మర్చిపోకుండా ఎలా పెంచాలి లాంటి ప్రణాళిక ఏర్పరచుకోవడానికి నిర్ణయించుకున్నాడు.

***

ఐదు సంవత్సరాల తర్వాత ఉద్యోగ నిమిత్తమై ఆల్బర్టా ప్రావిన్స్ లోని ఎడ్మంటన్ నగరం లో స్థిరపడిన మనోజ్ ఒక రోజు తను ఉంటున్న నగరంలోని మిత్రుడి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఉన్న 18 సంవత్సరాల వయసు వాడైన అతని మిత్రుని కొడుకుతో సంభాషించాడు, కెనడాలో పుట్టి పెరిగిన పిల్లల ఆలోచనలు, అలవాట్ల గురించి తెలుసుకోవాలన్న తలంపుతో..

వారి మధ్య సంభాషణలో మనోజ్ గ్రహించిన విషయాలు నిజంగా అమూల్యం. తాను పుట్టి పెరిగిన ప్రాంతంలోని ఈనాటి టీనేజ్ యువతలోను , పెద్దవారిలోను లేని సుగుణాలు ఎన్నో ఆ నవ యువకునిలో కనిపించడం మనోజ్ ఆసక్తిని మరీ పెంచింది. ఎలాంటి అహంకారము లేక పోవటం , ఇతరులతో పోల్చుకోక పోవటం, చాలా పారదర్శకంగా ఉండడం , ఎలాంటి నటన లేని , వెటకారం లేని హుందాతనం అతనిలో తనకు కనిపించింది.

తర్వాత కాలంలో ఇది ఈ ఒక్క యువకుడికే పరిమితమా లేక ఇక్కడ చిన్నప్పటినుండే ఉన్న అందరిలోను ఉందా అని తరచి చూడగా, చాలా చిన్న వయస్సు నుండి ఇక్కడే ఉన్న దాదాపు అందరిలోను ఇదే విధమైన ఉన్నత విలువలు కనిపించి, ఆనందం కలిగించింది. అంతే కాదు తమ పెద్దలు పుట్టి, పెరిగిన ప్రాంతం లోని తాము గొప్ప వారిమి అని చూపించుకునే ప్రధానమైన లోపం వీరిలో లేశమాత్రం కూడా కనిపించక పోవడం మరింత సంతృప్తినిచ్చింది.

***

మరి కొన్నేళ్ళకు ఒక రోజు బయట ఏదో కార్యక్రమం అటెండ్ అయ్యే పని మీద కుటుంబంతో పాటు బయలుదేరాడు మనోజ్. దారిలో చాక్లెట్ పైన రేపర్ ముక్క కారు కిటికీ లోంచి రోడ్డు పక్కకు విసిరేసాడు మనోజ్, అది చూసిన మనోజ్ కూతురు పదేల్ల జ్యోత్స్న గట్టిగా అరిచింది కారు ఆపమని. కారు ఆగిన తర్వాత పరిగెత్తుకెల్లి ఆ పేపర్ ముక్క తీసి రోడ్డుకు మరో వెపుకు జీబ్రా క్రాసింగ్ ద్వారా దాటి, అక్కడ ఉన్న డస్ట్ బిన్ లో వేసింది.అది చూసిన మనోజ్ తన కూతురు తనకు సివిక్ సెన్స్ నేర్పించిందని గ్రహించాడు. అది తన కూతురు ఇక్కడి సమాజంనుండి నేర్చుకుందని గ్రహించాడు.

ఒక మహానుభావుడు చెప్పినట్టు ఒక సమాజంలోని క్రమశిక్షణ దానికి అభివృద్ధిని ఇస్తుందే కాని వారి ఆహారం, ఆహార్యం, విందు, వినోదాలు మాత్రమే కావని. మనోజ్ కు తాను పుట్టిన దేశంలో ఈనాటి పిల్లలకు తల్లిదండ్రులు పోటీ పడి వేలం వెర్రి లా నేర్పిస్తున్న చదువు, వొత్తిడికి గురి చేసే మితిమీరిన హోమ్ వర్క్, 5 వ తరగతిలోనే ఐఐటి, ఐఏఎస్ ట్రైనింగ్ లాంటి వాటి వలన కలిగే వివిధ దుష్పరిణామాలు గుర్తుకు వచ్చాయి. లక్ష్యాలను సాధించలేని పిల్లలు డిప్రెషన్ లో కూరుక పోవడం, కొన్ని కార్పోరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే పిల్లలు ఉరి వేసుకుని మరణించడం, మరికొందరు తమ సమాజం తమకు పెట్టిన టార్గెట్ రీచ్ అవడానికి అడ్డదారులు తొక్కడం లాంటి నేటి పోకడలను వార్తా సంస్తల ద్వారాను, స్వానుభవం ద్వారాను తెలుకుంటున్న మనోజ్ కు తన కూతురు అదృష్టవంతురాలని అనిపించింది.

***

ఒక రోజు మనోజ్ తాను ఉంటున్న నగరంలోని బెంగాలీ మిత్రమండలి వారి సాంస్కృతిక కార్యక్రమానికి ఒక మిత్రుని ఆహ్వానం మేరకు వెళ్ళాడు. అక్కడ కలిసిన ఒక మిత్రుడు పలకరింపులయ్యాక మనోజ్ తో చెప్పాడు, "మా కొడుకులిద్దరూ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యి ఉద్యోగం చేస్తున్నారనే సంతోషం లేకుండా వారు వారి వారి స్వంత ఇళ్ళు కొనుక్కుని విడిగా ఉంటున్నారు ".

"అందులో బాధపడడానికి ఏముందండీ , ఈ రోజుల్లో ఇండియాలో కూడా కోడళ్ళు వేరు కాపురం పెట్టిస్తున్నారు కదా..పైపెచ్చు తమ పుట్టింటి వారితో ఒక లాగా , అత్తింటి వారితో మరో లాగ వ్యవహరించడం మనకు తెలిసిందే కదా?" అన్నాడు మనోజ్.

కాని మిత్రుడు చెప్పాడు, " మా వాళ్ళకింకా పెళ్ళి అవలేదండి. అలాగే వారు ఏ అమ్మాయితోను సహజీవనం చేయడం లేదండీ , నిజానికి వారు స్వంతంగా పని చేసి వారి గ్యాడ్యుయేషన్ ఫీజుకు కూడా మా సంపాదన పై ఆధార పడలేదు . అంతే కాదు వారి ఇంటి రుణం కూడా వారికి వారే తీసుకొని కడుతున్నారు"... పిల్లలు తమనుండి విడిగా ఉంటున్నారనే బాధ అతని మాటల్లో స్పష్టంగా కనిపించింది.

" పెళ్ళయ్యాక ఆస్తులు లాక్కొని విడిపోయే పిల్లల కన్నా ..వారి కాళ్లమీద వారు నిలబడి,తల్లిదండ్రుల ఆస్తులపై ఆధారపడి గొప్పలు చెప్పుకునే వారిలా కాకుండా , వృద్ధిలోకి వచ్చారు సంతోషమే కదండి.." అని అనునయించాడు మనోజ్.

***

"పిల్లల వ్యక్తిత్వాలు మెరుగుపడడం, వారి కాళ్ల పై వారు నిలబడడం లాంటి విలువలు ఇక్కడి సమాజంలో ఉండడమే అభినందనీయం. మనకు ఉన్నదానితో సంతృప్తి పడేలా మన చుట్టూ పరిస్థితులు ఉండాలి కానీ, నిరంతరం మనకేదో లేదనే విషయం కనిపెట్టి, మనల్ని ఇబ్బంది పెట్టేలా ఉండకపోతే మంచిదే కదా..", అని స్వగతంలో అనుకున్నాడు మనోజ్.

అంతేకాదు మంచిని ఎక్కడినుండయినా నేర్చుకోవాలనే తన ప్రాచీన పరంపరకు ఇది బలం చేకూర్చే విషయమేనని గ్రహించాడు.

## Members of the Telugu community: A "Year of Excellence"



Chebolu Anandi
Gold medal for grade 2 at APEGA Science Olympics




Edmonton Sunrisers Cricket Club
EDCL RUNNERS (9th Division)



Sid Vemula
Notable New Comer Award presented by Canderel for providing Mentorship and Collaboration




Charvy Gundu
Honours in academic excellence - Grade 1
Attending cogito program at Stratford Public School



Bhavya Jha
Womanition SuPEARLative Award - New Citizen



Sunil Reddy Etikela
Top Performer in Commercial and Residential Estate




Pavan Sreekanth Chandana
Honoured to be one of the top 18 delivery leaders globally at Wipro

# బాలవాణి

## గరుడ సాహసం

**-కృష్ణ యద్దనపూడి**

అనగనగా, గరుడ అనే ఒక పిల్లి ఉండేది. అది రవి అనే పిల్లవాడి ఇంటిలో ఉండేది. గరుడకి పాలు అంటే చాలా ఇష్టము. ఈ విషయంలో గరుడ సామాన్యమైన పిల్లి లాగా ఉండేది. కానీ, గరుడకు ఒక రహస్య శక్తి ఉంది. దానికి, ఒక మునీశ్వరుడి వరము వలన, ఎగిరే శక్తి ఉండేది.

ఒక రోజు, రవి పాలు ఇవ్వలేదని తట్టుకోలేక, అది రవి వాళ్ళ రిఫ్రిజిరేటర్ లోకి దూరి, దాన్లో ఉన్న పాలన్నిటిని తాగేసింది. అట్లా తాగుతూ, వంటింటి నిండా పాలు దొర్లించినది. అది పాలు తాగిన తర్వాత చేసిన చిందరవందరకి, రవి వాళ్ళ అమ్మకు చాలా కోపం వచ్చింది. "ఒరేయ్! వంటింటిని అంతా పాడు చేసావు! ఇంకా పో!" అని అరుస్తూ గరుడను ఇంట్లోంచి తరిమేసింది.

గరుడ తన అమ్మకు జరిగిందంతా వివరించింది. వాళ్ళమ్మ విన్న తర్వాత, "అలా దొంగలించ కూడదు, నాన్న. అది మంచి పని కాదు. అదే కాకుండా, వాళ్ళ వంటింటిని పాడు చేసావు. పాలు కావాలంటే వాళ్ళని అడగాలి, కానీ, ఆలా తీసుకోవద్దు." అన్నది.సరేనని తల ఊపింది గరుడ.

కాసేపటికి గరుడ, దాని స్నేహితులతో ఆడుకుందాం అని, పార్కు వైపు నడిచింది. అక్కడికి, దాని పిల్లి స్నేహితులు, ఇంకా రవి యొక్క స్నేహితులు కూడా వచ్చి ఉండటంతో వాళ్లతో ఆడడం మొదలుపెట్టింది.

కొంత సేపు తర్వాత, వాళ్లకు అలసట వచ్చి విరామం తీసుకున్నారు. అప్పుడు హఠాత్తుగా, ఒక కుక్క మొరగడం వినిపించింది. గరుడ ఏంటబ్బా అని శబ్దం వచ్చిన వైపు తిరిగితే, ఒక పెద్ద కుక్క కనపడింది.

గరుడ తన మిత్రులతో పారిపోండి అని అంటుంటే, ఆ కుక్క వాళ్ళని కొరకడం, ఇంకా గీకడం మొదలుపెట్టింది. శరీరం లో చాలా నొప్పి పుట్టి స్నేహితులు పారిపోలేక ఏడవటం చూసి గరుడ, కుక్క మీదకు దూకి దానితో పోరాడటం మొదలుబెట్టింది. అవి ఒకరినొకరు బాగా దెబ్బలాడుకున్నాయి. చాలాసేపు తన్నుకున్నాయి. కానీ, గరుడ, కుక్క కన్నా చిన్నగా ఉండి మెల్లమెల్లగా అలసిపోయింది. చాలా దెబ్బలు తిన్న తర్వాత, తను తగవులో ఓడిపోతోందని తెలుసుకుంది. తన ఎగిరే శక్తి గుర్తు తెచ్చుకుని, ఒక ఉపాయం ఆలోచించింది.

గరుడ, పోట్లాడలేక, నేల మీద పడిపోయినట్లుగా నటించింది. కుక్క తాను గెలిచిందనుకుని, గరుడ యొక్క స్నేహితుల మీద దాడి చేయడానికి సిద్ధపడింది. అప్పుడు, గరుడ కుక్క వైపు ఎగిరి, దానిని ఒక పెద్ద తన్ను తన్ని పార్కు అవుతల వైపు పడేలా విసిరింది. అంతే! దూరంగా ఎగిరి పడిన కుక్క భయపడి, పార్కు లోంచి పారిపోయింది.


గరుడ, తన స్నేహితుల నుండి సెలవు తీసుకొని, ఇంటి వైపు రవితోటి వెళ్ళింది. రవి వాళ్ళ అమ్మ దానిని చూసి, జాలి పడి, ఇంట్లోకి రానిచ్చి పరుపు మీద పడుకోబెట్టింది. పాలు గిన్నె లో పోసి, గరుడకి ఇచ్చింది. గరుడ, దానిని తాగి, తృప్తిగా నిద్రపోయింది.అలా గరుడ మరల రవి దగ్గరకు చేరింది.

# పిల్లలు చెప్పిన బొమ్మకు కథ

## అద్భుతాల మర్రి చెట్టు

**-రిత్విక్ పల్లెకోన**

అనగనగా లక్ష్మీపురం అనే ఊరిలో, ఊరికి చివరగా కొండ మీద అమ్మవారి దేవాలయం ఉంది. ఆ దేవాలయ ప్రాంగణంలో ఒక మర్రి చెట్టు ఉంది,గుడికి వచ్చే ప్రజలందరు మర్రి చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారి దర్శనం చేసుకుని వెళ్ళేవారు. ఆ తరువాత రెండు సంవత్సరాలు వానలు సరిగ్గా కురవక ఆ ఊరిలో కరువు వచ్చింది. కరువు వలన ప్రజలందరు ఇబ్బంది పడుతున్నారు.ప్రజలందరూ తమ కష్టాలు పోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నారు.



ఒక రోజు సాయంత్రం ఆశ్చర్యంగా మర్రి చెట్టు కాయలన్ని చీరలుగా మారిపోయాయి. ప్రజలందరు ఆ వింత చూడడానికి చెట్టు దగ్గర గుమ్మిగూడారు. కొంత మంది ఉత్సాహంగా ఆ చీరలని లాగాలని ప్రయత్నించారు, కాని ఆశ్చర్యంగా లాగిన ప్రతీసారి చెట్టు ఇంకా పెద్దదిగా పెరిగిపోయి చీరలు అందకుండా పైకి వెళ్ళిపోయాయి. అపుడు చెట్టు పైన ఉన్న చిలుక మాట్లాడటం మొదలు పెట్టింది, ఎవరైతే ఎదుటి వారి గురుంచి చెడుగా ఆలోచించరో, నిస్వార్థంగా ఎదుటి వారికి సాయం చేస్తారో వారికి మాత్రమే ఆ చీర దొరుకుతుంది అని చెప్పింది. ఆ చీర ఎవరి ఇంట్లో ఉంటుందో ఆ ఇల్లు సుఖ సంతోషాలతో ఉంటుంది అని చెప్పింది. అపుడు ఒక చిన్న పాప తన ఆకలి గురించి ఆలోచించకుండా చేతిలో ఉన్న ఒకే పండుని పక్కనే ఉన్న ముసలి అవ్వకి ఇచ్చింది. అపుడు ఆశ్చరంగా ఒక ఉడుత చెట్టు పైకి ఎక్కి ఒక చీర పాప చేతిలో పడేటట్లుగా జార్చింది. అప్పటినుండి ఎవరైతే మంచి ఆలోచనలతో ఉన్నారో అలాగే పరోపకారం చేస్తున్నారో వారు ప్రదక్షిణ చేస్తున్నపుడు వారి మీద ఒక చీర పడుతూ ఉంది. అలా క్రమంగా ఊరిలో ఉన్న అందరికీ చీరలు దొరికి అందరూ సుఖంగా ఉన్నారు. ఆ తరువాతి సంవత్సరం నుండి వానలు సమయానికి కురిసి ప్రజలందరూ సుఖ శాంతులతో ఉన్నారు.

**నీతి: ఎవరైతే ఎదుటి వారి గురించి చెడుగా ఆలోచించరో,ఒకరికి అపకారం తలపెట్టరో, నిస్వార్థంగా ఎదుటి వారికి సాయం చేస్తారో వారికి దైవానుగ్రహం ఉంటుంది.**

## ఇల్లు చాల నిశ్శబ్దంగా ఉంది

**శ్యామల చాప**

ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉంది. రీన కాగితంపై తన పెన్ను కదులుతున్న శబ్దం మరియు బయట గాలి శబ్దం మాత్రమే వినగలిగింది. ఆమె తల్లిదండ్రులు కూరగాయలు కొనడానికి మార్కెట్ కు వెళ్లారు. ఆమె ఒంటరిగా ఉంది. ఇది రీనకి ప్రత్యేకమైన సమయం. ఈ రోజు ఎలా గడిచిందో రీన రాయడం లేదు. ఆమె తన సొంత కథను రాస్తోంది. ఆమె ఒక విరిగిన కోట నుండి పారిపోతున్న ధైర్యవంతులైన అమ్మాయిల గురించి రాసింది. ఆమె కిటికీ

వెలుపల ఉన్న ప్రపంచం గురించి మరచిపోయింది. ఆమె తన చిన్న కొవ్వొత్తి నుండి వచ్చే కాంతిని మాత్రమే చూసింది. రీన తన రచన పై చాలా దృష్టి పెట్టింది.

అకస్మాత్తుగా, చీకటి తలుపు నుండి పెద్ద శబ్దాలు వచ్చాయి. ఆమె భయపడి తనలో తాను ప్రశ్నించుకుంది. అయినప్పటికీ ఆమె తలుపు తెరిచి చూసి ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఆమె ముగ్గురు ప్రాణ స్నేహితులు ఆమెను కలవడానికి వచ్చారు. వారిని కలిసినందుకు ఆమెకు చాలా ఆనందంగా ఉంది. ఆమె స్నేహితులు మాకు జ్యూస్ ఇవ్వగలరా అని అడిగారు. రీన వంటగదిలో తన స్నేహితులకు జ్యూస్ తీసుకురావడానికి వెళ్లింది. అక్కడ చాలా చీకటిగా ఉంది మరియు ఆమె లైట్ వేయాలనుకుంది కానీ రీన స్నేహితులు ఆమెను ఆపారు.

ఆమె గత కొన్ని సంవత్సరాలుగా తన స్నేహితులను కలవలేదు. ఆమె మరియు ఆమె స్నేహితులు లివింగ్ రూమ్‌లో మాట్లాడుకుంటున్నారు. ఆమె ఫోన్ బెడ్‌రూమ్‌లో ఉంది. ఆమె ఫోన్ తీసుకోవడానికి బెడ్ రూమ్ కి వెళ్ళింది, రీన అమ్మ కాల్ చేస్తోంది. ఆమె కాల్ ఎత్తి తన స్నేహితులు ఇంటికి వచ్చారని తన అమ్మతో చెప్పింది. రీన అమ్మ, మీ స్నేహితులు కారు ప్రమాదంలో చనిపోయారని చెప్పింది. రీన నమ్మలేదు కానీ ఆమె గదిలోకి వెళ్లి లైట్ ఆన్ చేసి చూసింది. ఆమె స్నేహితులు దెయ్యాలు అని తెలిసి భయంతో బయటికి పరిగెత్తింది. కారు వస్తున్నట్లు రీనకి కనిపించక ఆమె కింద పడిపోయింది.

## జంతువుల పాఠశాల

**రచన : ఆషిత గూడూరు**

అనగనగా, ఒక అందమైన అడవిలో మాట్లాడే జంతువులు ఉండేవి. అక్కడ ఒక బడిలో అన్ని జంతువులు విద్యాభ్యాసం పూర్తి చేసుకుంటున్నాయి. వారందరిలో కోతి మరియు ఎలుక చాలా సన్నిహితంగా మంచి స్నేహితులుగా ఉండేవారు. వారిద్దరూ బడికి రాకుండా ఆ సమయం లో ఎక్కడికో వెళుతుంటేవారు. ఈ లోపు పరీక్షల సమయం ఆసన్నమయింది. ఒక రోజు, వాళ్ళందరూ పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. పుస్తకాలు చదువుతున్నారు. కోతి మరియు ఎలుక, పొద్దున్నేలేచి బడికి కలిసి బయలుదేరారు. పరీక్ష మనోధైర్యంతో రాశారు. కొంతకాలానికి పరీక్ష ఫలితాలు వచ్చాయి. ప్రథమ స్థానం కోతికి మరియు ద్వితీయ స్థానం ఎలుకకు వచ్చాయి.

ఇంతలో ఈ స్నేహితులని గమనిస్తున్న కవల గుడ్లగూబలు, వీళ్ళు బడికి రాకపోయినా, ఇంత చక్కటి ఫలితాలు ఎలా వచ్చాయో, అని ఆరా తీయడం మొదలు పెట్టి, దానిలో భాగంగా చిన్న పన్నాగం పన్నారు. ఒక రోజంతా కోతి ఎలుకల పై నిఘా పెట్టారు. ఆ రోజు వర్షం పడుతోంది. రాణి అనే గుడ్లగూబ కోతి ఇంటి బయట ఉంది. రాజు అనే గుడ్లగూబ ఎలుక ఇంటి బయట ఉన్నాడు. రాణి ఒక కిటికీలో నుంచి చూస్తుండగా, ఒకటి వింతగా అనిపించింది. రాజుకి కూడా అదే కనిపించింది. కోతి ఎలుక బడికి తయారయ్యారు. ఇదంతా చూస్తున్న గుడ్లగూబలు ఎలుక, కోతుల నడవడికను కాగితాలలో రాసుకున్నారు.


కోతి ఎలుక ఊరికి కాస్త బయట కలిశారు. ఇద్దరు ఒక పెద్ద గొడుగు కింద గుసగుసలాడుతున్నారు. ఆకాశంలో ఉన్న గుడ్లగూబలకు వినిపించలేదు. కాసేపటి తర్వాత వారి పక్క ఊరి వైద్య పాఠశాల

చేరుకున్నారు. ఒక కిటికీ లో నుంచి గురువులు చెప్పిన పాఠాలు విని వాళ్ల దగ్గర ఉన్న పుస్తకాలలో రాసుకున్నారు. ఈ రకముగా వారు వేరే పాఠశాలకి వెళ్ళి వాళ్ళ వాళ్ళ తరగతి కన్నా ముందు తరగతి పాఠ్యాంశాలు చదువు కొని, వారి పాఠశాల సమయంలో బడికి రాలేని జంతువులకి సహాయం చేస్తున్నారు. ఆ రకంగా వాళ్ళు ఇంకొకరికి చదువు చెప్పడం వలన వారు మంచి విజ్ఞానం సంపాదించి , వారు మంచి మార్కులు సంపాదించారు.

కోతి, ఎలుకలని చూసి గుడ్లగూబలు, మిగతా జంతువులు చాలా నేర్చుకున్నాయి. వారు వారి స్నేహితులకి సహాయం చేయడమే కాకుండా వారి విజ్ఞానం ఎలా పెంపొందించుకోవాలో తెలుసుకున్న కోతి, ఎలుకలని చూసి చాలా ప్రేరణ పొందారు.

**నీతి :**

**ఒకరి చేష్టల ఆధారంగా మాత్రమే తీర్పులు ఇవ్వకుండా, వారి చర్యల వెనుక ఉన్న ఉద్దేశాన్ని, పరిస్థితులను, మరియు వారి లోతైన స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.**




## జంతువుల పాఠశాల

**-కావ్య కంటేటి**

అనగనగా ఒక అడవిలో జంతువులకి ఒక పాఠశాల ఉండేది. ఆ పాఠశాలలో అడివిలో ఉన్న అన్ని జంతువులూ వచ్చి చదువుకునేవి. కాని ఒక పిచ్చుక మాత్రం వచ్చేది కాదు. రోజు దాని స్నేహితులు అయిన సింహం, కుందేలు, మరియు నక్క బడికి వెళ్ళేటప్పుడు,"ఓ పిచ్చుక మాతో పాటు బడికి ఎందుకు రావు?" అని అడిగేవి. దానికి రోజు పిచ్చుక ఒక్కటే సమాధానం చెప్పేది. “హ్హహ్హహ్హ నేను బడికా? హ్హహ్హహ్హ నాకు అన్నితెలిసినప్పుడు ఆ బడికి వచ్చి ఏమి నేర్చుకోవాలి?” అని అనేది.

పిచ్చుక బడికి రాదని తెలిసినా కూడా దాని స్నేహితులు రోజు రమ్మని అడిగేవి.



ఒక నాడు మధ్యాహ్నం పూట జామ చెట్టు మీద పిచ్చుక విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు అడుగుల

శబ్దం వినిపించింది, కానీ పిచ్చుక పట్టించుకోదు. అలా సాయంత్రం అవుతుండగా పిచ్చుక ఇంటికి బయలుదేరుతుంది.
వెళ్తుండగా దారిలో ఒక పంజరంలో కొన్ని గింజలు పిచ్చుకకి కనిపిస్తాయి. వెర్రితనంతో, ఆలోచించకుండా పంజరం లోపలకి వెళ్లి తినటము మొదలుపెడుతుంది.

అక్కడ దాక్కున్న వేటగాడు వెంటనే పంజరాన్ని మూసేస్తాడు. పాఠశాల నుంచి వస్తున్న సింహం, కుందేలు మరియు నక్క వాళ్ల స్నేహితురాలు అయినా పిచ్చుక అరుపులు విని దాని దగ్గరకు వెళతారు. పంజరంలో వున్న పిచ్చుకని చూసి వెంటనే దానిని బయటకి తేవడానికి పథకం వేస్తాయి.

వేటగాడు దగ్గరకు వచ్చిన తరువాత సింహం గట్టిగా గర్జిస్తుంది. వెంటనే కుందేలు, సింహం, మరియు నక్క పొదలు నుంచి బయటికి వచ్చి వేటగాడిని భయపెట్టిస్తాయి. భయాందోళనతో వేటగాడు పిచ్చుకని వదిలేసి పారిపోతాడు. పిచ్చుక దాని తప్పుని తెలుసుకుని, పాఠశాలకు వెళ్లి జీవిత నైపుణ్యాలను నేర్చుకుంటూ వాటి విలువని కూడా అర్థం చేసుకుంటుంది. అలా రోజు దాని స్నేహితులతో పాటు సంతోషంగా బడికి వెళ్ళింది.

## పిల్లలకి క్విజ్

పిల్లలూ , ఈ దేవుడెవరో కనిపెట్టండి ????

1)జంగమైన తండ్రి జగమెల్ల తిరుగగా , జగదాంబ అయిన తల్లి వండి వడ్డనలో దండిగామునగ, పిన్నమ్మ చెంత చేరే పసికూన ప్రేమకై ,పిన్నమ్మ పిలవందే కన్నైన విప్పడు, పిన్నమ్మ పెట్టనిదే పండైన తినడు,

2)పిన్నమ్మతో సాటిగా గల గలా పారెను, గమ్మత్తు చేసెను, పక పకా నవ్వేను, పరిగించి తిప్పెను
ఆట పాటలయందు అలరించి ప్రేమగా సాకెను
పిన్నమ్మ వడిలోన పసికూన పరమానందమున పవ్వళించేను,

3)పసికూనయని, డబ్బున్న మహారాజు డంబముగా కోటలో విందుకై కోరి పిలువ, పసిడి భవనమును ఫలహారముగా భుజియించేను
ఆమ్మో ఆమ్మో, పసివాడని భ్రమలోన పడకండి
గర్వించి కలహించితే, మింగివేయును జాగ్రత్త

4) ప్రేమగా పిలిచి పలకరిస్తే మీ ఇల్లంతా బంగారమే, చిన్న ముంతలో చిన్నమ్మను చెంతనుంచితే చిటికెడు బెల్లము ప్రేమతో పెడితే
చక చకా తిరిగేను , నవ్వులు పండించెను
మీయింట సిరులు కురిపించెను, మీయింట సిరులు కురిపించెను.

ఆశీర్వచనాలు,
మీ తాత, అమ్మమ్మ
పైడికొండల గీతానాధ్, కుమారి.

జవాబు: గణపతి

# మన గడుగ్గాయుల వేసిన బొమ్మలు






మేఘ చందన



ఆనంది చేబోలు












-దక్ష ప్రవీణ్




యువరాజ్ వరీష్ మునిపల్లి





-లక్షిత బోళెం




సూర్య శ్రీపద్ చేబోలు




-భువిక మచ్చ




రాజ్ వేదాంష్
మునిపల్లి



శ్రీహాన్ చందన




షియా దేవా



నీనా దేవా



ఇటికెలా సూర్యాన్ష్ రెడ్డి



## Men's Night

## Ladies day



# Representing Telugu Culture at various places



# కృతజ్ఞతలు

**Editor and Coordinator:** **సత్య ఆదిత్య చేబోలు**

**"వాణి సంచిక 2026" వ్యాసాలను మరియు సాహిత్య విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తగిన సూచనలతో నాణ్యతను పెంచిన సంపాదక బృందానికి కృతజ్ఞతలు:**

- **మాచిరాజు సావిత్రి గారు**
- **భుజంగ రావు దన్నపునేని గారు**
- **మురళి బాబు గారు**
- **రాజు గాదిరాజు గారు**
- **మాడభూషి శ్రీనివాస్ రాధాకృష్ణ గారు**
- **నరేష్ శనిగరపు గారు**
- **లక్ష్మి గోనెళ్ళ గారు**

**అదేవిధంగా, ఈ సంచికను పూర్తి చేయడంలో నిర్వహణ పరమైన బాధ్యతలను పంచుకుంటూ, విలువైన సూచనలు మరియు నిరంతర మద్దతు అందించిన నిర్వహణ బృంద సభ్యులకు ధన్యవాదాలు:**

- **అఖిలేష్ మునిపల్లి గారు**
- **పవన్ శ్రీకాంత్ చందన గారు**
- **శ్రీ సత్య బోళెం గారు**